Deccan Land




FEB | FEB 2026

Deccan

ఫిబ్రవరి – 2026

DECCAN LAND, HYDERABAD

162

FEBRUARY - 2026

PRGI Regn. No. TELTEL/2012/46784

₹30

సంపుటి : 14

సంచిక : 6

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

VOL 14వ వసంతంలో
162 ISSUES నూట అరవై రెండవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్

## అమరావతి ఆర్ట్





- ఆదివాసీ జీవనం – సంస్కృతి సంప్రదాయం
- సైన్సు వైయక్తికం – టెక్నాలజీ సామూహికం
- 'ఉర్దూ' ఎవరిది?
- భూభ్రమణం–భారీ నిర్మాణాలు!
















ప్రపంచ భౌగోళిక చిత్రపాటు మారుతుంటాయి. దేశీయ, రాష్ట్రీయ చిత్రపటాలూ మారుతుంటాయి. సాంస్కృతిక బాంధవ్యాలను అవి నిర్దేశించలేవు. ఇవి అనాది. మన ఆలయాలు, పుష్కరాలు, బౌద్ధ ధర్మమూ, సమ్మక్క-సారలమ్మ ఉత్సవాలు అందుకు ఉదాహరణ.

-పున్నా కృష్ణమూర్తి

















*Source : Amaravati Art - By Punna Krishnamurthy*




## అమరావతి ఆర్ట్

ధరణికోట నాగార్జునకొండ శిల్పసంపదల సచిత్ర వ్యాస సంకలనం' అనే అందమైన పుస్తకం రూపొందించారు రచయిత, సీనియర్ జర్నలిస్ట్ పున్నా కృష్ణమూర్తి. ఇటీవలే ఆవిష్కరణ అయిన ఈ పుస్తక పరిచయసభ భారతీయ విద్యాభవన్, గుంటూరులో జరిగింది. లామకాన్, హైదరాబాద్‌లో చర్చాగోష్టి జరిగింది. చరిత్ర – సంస్కృతి – కళారంగాలకు చెందిన ప్రముఖులు, ఆసక్తి పరులు ఈ పుస్తకాన్ని ఆహ్వానించారు. ఆదరిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'తిరుమలకొండ – పదచిత్రాలు, హవ్ హమ్ హైదరాబాదీ' వంటి పుస్తకాలు రచించిన పున్నా కృష్ణమూర్తితో తన తాజా పుస్తకం కవర్ పేజీ నుంచి చివరి పేజీ వరకూ 'దక్కన్ ల్యాండ్' సవివరంగా...

*ప్రత్యేక వ్యాసం : 29వ పేజీలో*

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## అలనాటి జ్ఞాపకాలు

పరవస్తు లోకేశ్వర్ 'రాచిప్పల పచ్చిపులుసు' వ్యాసంలో హైదరాబాద్ పాతబస్తీలో నాటి జ్ఞాపకాలను గుర్తు చేయడం చాలా సంతోషం. 'ఆషాటాకీస్, చౌమహల్లాప్యాలెస్, క్లాక్‌టవర్'లు రాజసం ఉట్టిపడుతూ నగరానికి శీర్షమాణిక్యంలా నిలబడినట్లు కళ్లకు కట్టినట్లు తెలియజేశారు. హైదరాబాద్ పట్టణానికి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలాంటి సిటీ కాలేజిలో మొహియుద్దీన్ ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేసేవారు. కేశవరావ్ జాదవ్, హరగోపాల్ సార్లు సిటీ కాలేజీ విద్యార్థులని నాటి ముచ్చట్లు యాది చేశారు. ముర్గీ కా చౌక్'లోని రంగు రంగుల రామచిలకలు, తెల్లపావురాలు, నల్లటి కాకులు, గుడ్ల గూబలు, ఊరపిచ్చుకలు, ఉడతలు, కుందేళ్లు, తాబేళ్లు గురించి జంతు ప్రదర్శనశాలల వర్ణించారు. నల్లలోహ విగ్రహాలు తయారు చేసే కసార్ కళాకారుల గురించి, వేశ్యా వాటికలో రసికులను మరిపించి మురిపించే వ్యవహారాలను, ఫుకట్ కా మాల్ దొరికే జుమ్మేరాత్ బజార్. రాచిప్పలు అమ్ముతున్న వద్దెర ఆడోళ్లు వద్ద రచయిత అమ్మ తన వాక్చాతుర్యం ఉపయోగించి తక్కువ పైసలకు కొన్న విధానాన్ని వివరించిన తీరు చాలా ముచ్చటగా వుంది. అలనాటి జ్ఞాపకాలను యాది చేసినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు. **– రూప్‌సింగ్,** హైదరాబాద్

❖ ❖ ❖

## భౌగోళిక విపత్తులు

గత అయిదు దశాబ్దాలుగా భూభ్రమణంలో మార్పులు హెచ్చు, తగ్గులు జరుగుతున్నట్లుగా పరిశీలనల గణాంకాలు తెలుపుతున్నాయి. భూమిపై గల వాతావరణ, ఉపరితల భౌతిక పెనుమార్పులు, అతివేగంగా వీచే గాలులు, సునామీల సందర్భంగా ఏర్పడే ఎత్తైన అలలు కూడా భ్రమణ రేటుపై ప్రభావం చూపుతున్నట్లుగా హెచ్చరిస్తున్నాయని రచయిత లచ్చయ్య వాతావరణంలో జరిగే మార్పుల గురించి వివరించారు.

**– ఎ. రాంమోహన్,** కర్నూలు

## షడ్రుచులు కలిగిన పత్రిక దక్కన్‌ల్యాండ్

రచయిత ఆర్. సీతారామారావు మాజీ వ్యవసాయ ఆహార రైతుల సంక్షేమం శాఖ మంత్రిగా ఉన్న కెఎం గురించి రాసిన వ్యాసం చాలా బాగుంది. స్వాతంత్రం సిద్ధించిన తరవాత భారత దేశంలో ముఖ్యంగా ముంబయిలో తిరిగి చెట్ల పెంపకం గురించి విస్తృత ప్రచారం చేయడం గొప్ప స్ఫూర్తిని కలిగించింది. అది జరిగిన దాదాపు 50 ఏండ్ల తరువాత తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తెలంగాణకు హరితహారం పేరుతో ఆ స్ఫూర్తిని కొనసాగించడం దానిని ఉపాధి హామితో అనుసంధానం చేయడం ద్వారా కొన్ని వేల కుటుంబాలు స్థిరముగా ఉపాధి పొందుతున్నారు. అంతే కాదు ఈ బృహత్తర ప్రయత్నాలు వల్ల రాష్ట్రంలో పచ్చదనం పెరిగి వర్షాలు కూడా పెరుగుతున్నాయి. ఇది ఆహ్వానించదగినది.

గాంధీ చేసిన ప్రయాణాలు కలిసిన మనుషులు వల్ల ఆయన దేశ విశిష్ట సంస్కృతికి ఒక చిహ్నంల కనిపిస్తారు. గాంధీ ఒక్క ఉదుటన ఉద్యమంలోకి దూకలేదు. ఉత్తర భారత తూర్పు పడమరలన్నింటిని చుట్టారు. ప్రజల ఆలోచన సరళిని అర్థం చేసుకున్నారు. అందుకే బాలగంగాధర్ తిలక్‌ను గురువుగా చేసుకొని విస్తృత ప్రయాణాలు చేశారు. ఈ వ్యాసం రచయిత వేణుగోపాల్ వివరంగా తెలిపారు.

రచయిత మంగారి రాజేందర్ రాసిన కథలో పేదవాడు అవ్వడం మూలంగానే జైలులో పెట్టబడి ఉన్నాను అనే కథ నేటి పరిస్థితికి అద్దం పడుతుంది. ఆ కథలో భార్యకు జరిగిన అన్యాయంను ఎదురించి, ముక్కలు ముక్కలుగా నరికిన సందర్భం రాజీకి వచ్చిన ఆమెను బెదిరించి అనుభవించడం. అది తెలిసిన భర్త చేసిన ఒక రకంగా కరెక్ట్ అని అనిపిస్తుంది. అది హక్కుల కోణంలో చూసిన సామాజికంగా చూసిన కరెక్ట్ అనిపించిన ఎందుకు అతడు జైలుపాలు అయ్యాడు అంటే అతడు పేద వాడు అవ్వడం మూలంగా లేదా జమానత్ కట్టలేని మూలంగా అతడు జైలులో బంధింపబడ్డాడు. మొత్తం మీద ఆలోచింప జేసే యదార్థ సంఘటనను రాసినందుకు రాజేందర్‌కు కృతజ్ఞతలు. కానీ ఇప్పటి కాలంలో విశ్వాసాలు కలిగి ఉండడమే తప్పు అయిపోయింది. ఇప్పటికీ ఎంతోమంది దళితులు, ఆదివాసులు అసలు ఏ కారణము లేకుండా అరెస్ట్ అయి జైలులో ఉండడం విచారకరం.

**–భారత అవినాష్,** జనగామ

---

## పరిశోధకులకు శుభవార్త

## దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com **- ఎడిటర్**

ISSN 2581-3188

విషయసూచిక

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 14 సంచిక : 6 పేజీలు : 60

ఫిబ్రవరి - 2026

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**సయ్యద్ ఖైజర్ భాష**
9030626288

వాణిజ్య ప్రకటనలు
**కె. సచిన్**
86866 64949

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**

కవర్‌పేజీ
**అమరావతి ఆర్ట్**

layout - Composing & Printed @
DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020
Mobile: 90599 50055
deccanpress.hyd@gmail.com

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**
దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు
సలహాలు, సూచనలు అందించిన
వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.

# లోపలి పేజీల్లో...



కవర్ స్టోరీ
29వ పేజీలో



సకల వస్తువుల కాణాచి..
నుమాయిష్?



ప్రకృతి వారసత్వానికి
కొండెత్తు తోరణం

పరకాల శేషావతారం ........ ఎసికె. శ్రీహరి ........ 6
సాంస్కృతిక సంపద ఆదివాసీ, గిరిజన జాతరలు.. (ఎడిటోరియల్) వేదకుమార్. యం ........ 7
చంద్రకాంత శిల ........ చకిలం వేణుగోపాలరావు ........ 9
తాజ్ మహోత్సవ్! ........ కొత్వాల్ సచిన్ ........ 12
ఒక పాట వంద జ్ఞాపకాలు ........ పరవస్తు లోకేశ్వర్ ........ 13
ప్రజల చేతిలో ఆయుధం సైన్స్ ........ డా॥ దేవరాజు మహారాజు ........ 16
హుజూర్‌నగర్ ఇనుపయుగపు సమాధి ........ ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ........ 17
చరిత్ర గమనాన్ని మార్చిన డార్విన్ ........ సత్య ప్రసన్న ........ 18
సైన్సు వైయక్తికం... టెక్నాలజీ సామూహికం ........ డా॥ నాగసూరి వేణుగోపాల్ ........ 19
కనువిప్పు కలిగించే (ఆంధ్రా మాగ్నా కర్తా) శాసనం ........ డా॥ జి.యస్. రామయ్య ........ 21
కనుల నిండుగా చరిత్ర పండుగ ........ కట్టా శ్రీనివాస్ ........ 23
తెలంగాణ కుంభమేళ మేడారం జాతర ........ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ........ 25
లిథియం మూలకం యొక్క ఖనిజాలు ........ కమతం మహేందర్‌రెడ్డి ........ 27
ధరణి కోట మన విస్మృతి! ........ పున్నా కృష్ణమూర్తి ........ 29
సకల వస్తువుల కాణాచి.. నుమాయిష్! ........ సయ్యద్ ఖైజర్ ........ 35
'ఉర్దూ' ఎవరిది? ........ మంగారి రాజేందర్ (జింబో) ........ 37
ప్రకృతి వారసత్వానికి కొండెత్తు తోరణం ........ ఎన్. వంశీ మోహన్ ........ 39
తరుగని చారిత్రక సిరుల తరిగొప్పుల ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 43
దీపావళికి యునెస్కో గుర్తింపు ........ ఎసికె. శ్రీహరి ........ 46
భూభ్రమణం - భారీ నిర్మాణాలు! ........ డా॥ లచ్చయ్య గాండ్ల ........ 47
భారత కోకిల సరోజినీ నాయుడు ........ దక్కన్ న్యూస్ ........ 50
ఆదివాసీ జీవనం-సంస్కృతి సంప్రదాయం ........ నూక సన్యాసిరావు ........ 51
చిత్తడి నేలలపై పెరుగుతున్న ఒత్తిడి ........ దక్కన్ న్యూస్ ........ 55
పూటకూళ్ళవ్వ (కథ) ........ మాదారపు వాణిశ్రీ ........ 57

**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిద్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# పరకాల శేషావతారం

పరకాల శేషావతారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకులు. వీరు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు నర్సాపురం శాసనసభ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా పనిచేశారు. 1925లో జన్మించారు. పరకాల కాళికాంబ వీరి జీవిత భాగస్వామి. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు.

### రాజకీయ జీవితం

పరకాల శేషావతారం కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసి 1962, 1972, 1978లో నర్సాపురం శాసనసభ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై 1976, 1978, 1981లో కాంగ్రెస్ ప్రభుత్వంలో జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య మంత్రివర్గంలో పనిచేశారు. పార్టీలతో సంబంధం లేకుండా జిల్లా రాజకీయాలను శాసించిన వీరుల్లో పరకాల శేషావతారం ఒకరు. వ్యక్తిగత ప్రతిష్టతో అత్యధికసార్లు నెగ్గి రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పి భళా అనిపించుకున్నారు. అంజయ్య మంత్రి వర్గంలో రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు. భార్య కాళికాంబ కూడా నర్సాపురం నియోజ కవర్గం నుంచి 1981లో శాసన సభ్యురాలిగా ఎన్నికయ్యారు.



శేషావతారం కాళికాంబలు కమ్యూనిస్ట్ కార్యకర్తలుగా పనిచేశారు. భార్య కాళికాంబకు భగవంతుని మీదున్న అచంచల విశ్వాసం తగ్గలేదు. యథావిధిగా పూజలు చేసేది. గుళ్ళకి వెళ్ళేది. భర్త శేషావతారం కాళికాంబ విశ్వాసాలకి అడ్డు తగల్లేదు.

### పరకాల శేషావతారం వివాహం

కాళికాంబ నాన్నగారిని, అన్నయ్యని కల్సుకోడానికి పరకాల శేషావతారం ఇంటికి వస్తుండేవారు. సిద్ధాంత పుస్తకాలు ఇస్తుండేవారు. శేషావతారం బ్రాహ్మణ యువకుడు. మంచి రచయిత. పార్టీలో ఆర్గనైజరు. కాళికాంబకు ఆయన పట్ల ఆకర్షణ కలిగి ఇష్టం ఏర్పడింది. కానీ కాళికాంబ నాన్నగారు నిడమర్రు నుంచి వచ్చిన సంబంధాన్ని ఖాయం చేయగా, తండ్రి మాట తోసెయ్యలేక మెదలకుండా ఉండిపోయింది. కానీ కొందరు కమ్యూనిస్ట్ కార్యకర్తలు ఆమె తండ్రికి కాళికాంబ ఇష్టం ఏమిటో కనుక్కోమని చెప్పగా, ఆయన ఆమె మనస్సులో ఏముందో తెల్సుకొని, శేషావతారంతో పెళ్ళి ఖాయం చేశారు. కులాలు వేరే అయినా సిద్ధాంతాలతో ఒకటయ్యారు. వీరి పెళ్ళి సెప్టెంబర్ 7, 1947న జరిగింది. పూలదండల పార్టీ పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది. జనం తండోపతండాలుగా వచ్చారు. పెళ్ళి తర్వాత నాజర్ దళం బుర్రకథ ప్రదర్శన ఇచ్చారు. కాళికాంబ అమ్మమ్మకి కాళికాంబ పెళ్ళి కమ్యూనిస్ట్ నాయకునితో జరగడం సుతరాము ఇష్టం లేదు.

### అండర్‌గ్రౌండ్‌లోకి...

తెలంగాణా సాయుధ పోరాటం 4 జూలై, 1946న మొదలైంది. కమ్యూనిస్ట్ పార్టీ తెలంగాణ పోరాటానికి సహకరిస్తుందని, పార్టీని, పార్టీ పత్రిక 'ప్రజాశక్తి'ని ప్రభుత్వం నిషేధించింది. సభలు, ఊరేగింపులు జరపరాదని సెక్షన్ 144 పెట్టింది. పార్టీని నిషేధించడం వలన కమ్యూనిస్ట్ పార్టీ కార్యకర్తలందరూ రహస్య జీవితంలోకి వెళ్ళిపోయారు. శేషావతారం భార్యభర్తలు అండర్ గ్రౌండ్‌లో ఉన్నారు. ఆ సమయంలో కాళికాంబ చాలా కష్టాలు అనుభవించారు.

### కాళికాంబ ధైర్యం

కాళికాంబ ఎక్కడికి వెళ్ళినా పోలీసులు వెంటాడుతుండేవారు. ఇల్లు సోదా చేసేవారు. ఇంట్లో సామాన్లు, వండిన వంటలు, ఊరగాయలు అన్ని పాడుచేసి, చేతికి వచ్చినవి పట్టుకుపోతూ ఉండేవారు. నోటికి వచ్చినట్లు ఛండాలపు మాటలనేవారు. ఆడవాళ్ళని నానా భీభత్సంగా భయపెట్టడం, మానభంగాలు చేయడం, కొట్టడం చేసేవారని ఆమె పేర్కొన్నారు. పుస్తకాలు చించేసి పనికొచ్చే బట్టలు పట్టుకెళ్ళేవారు. ఒక్కోసారి భర్త ఇంటికి వచ్చినా, పోలీసులు మళ్ళీ వచ్చి పట్టుకెళతారన్న భయంతో, వణుకుతో, దడతో కాళికాంబ బతికేది. ఆమె చంటిపిల్ల అరుణతో ఉన్నప్పుడు పోలీసులొచ్చి ఈ పిల్ల ఎలా వచ్చిందని ప్రశ్నలు వేశారు. ఆడవాళ్ళని వేధించడం కాదు, చేతనైతే లీడర్లను పట్టుకోండి అని ఎదురు తిరిగారు కాళికాంబ. దీన్నిబట్టి ఆమె ధైర్యం గల స్త్రీ అని తెలుస్తుంది. శేషావతారం నర్సాపురం, రాజమండ్రి జైళ్ళలో గడిపారు.

(మిగతా 8వ పేజీలో)

# ఆదివాసీ, గిరిజన మౌలిక సాంస్కృతిక సంపద ఈ జాతరలు




**జా**తర అంటే మనదేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో గ్రామ దేవతలు లేదా స్థానిక దేవతలకు ఒక నిర్దిష్టమైన రోజులలో జరిగే అతి పెద్ద పండుగ. జాతరలు గ్రామీణ సంస్కృతి, ఆధ్యాత్మిక, గిరిజన సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. సాంస్కృతిక వారసత్వాన్ని చారిత్రకంగా ఉన్నత స్థాయిలో నిలబెట్టేవి ఈ జాతరలు.

ప్రధానంగా జాతరలు తెలంగాణలో జరుగుతున్నప్పటికీ ఇతర రాష్ట్రాల్లోని గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో ప్రసిద్ధ జాతరలు జరుగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతంలో బీరమయ్య జాతరను ఆదివాసీలు నిర్వహిస్తారు. ఇది గిరిజన సంస్కృతికి చెందిన పెద్ద పండుగ. నాగాలాండ్‌లో ప్రతి సంవత్సరం డిసెంబర్ మొదటివారంలో హర్నిబిల్ జాతర జరుగుతుంది. మేఘాలయలో జాతరలు అనిపిలవరుగాని అక్కడ గిరిజనులు బెహది స్థలం ఫెస్టివల్, గోరా హిల్స్‌లో వాగాలాఫెస్టివల్, ఖాసీ తెగలు ఆస్టర్ పూల పండుగ జరుపుకుంటారు. ఈ ఉత్సవాలు గిరిజన సంస్కృతికి చెందినవి. ప్రకృతి, సంగీతం, నృత్యాలతో కూడి వుంటాయి. ఈ పండుగలు ఖాసీ గిరిజనుల మాతృ వంశీయ సంప్రదాయానికి సంబంధించినవి.

అనంతపురం జిల్లాలో ఆరెటికుల తెగ శ్రీశ్రీ సునామ జకిని మాతా, మల్కుమా జకినిమాతా జాతరను జరుపుకుంటారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరవుతారు. ఆంధ్రప్రదేశ్‌లో, ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో స్థానిక దేవతల పేర జాతరలు, కొలుపులు జరుపుతారు. ఇవన్నీ గ్రామీణ సంస్కృతి, వ్యవసాయ సంబంధిత ఉత్సవాలే.

ప్రత్యేకంగా తెలంగాణ గిరిజన జాతరలకు విశేష ప్రాచుర్యం వుంది. రెండేళ్ళకోసారి ములుగు జిల్లా మేడారంలో జరిగే సమ్మక్క సారక్క జాతర ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన జాతర. దేశంలోని పదిపన్నెండు రాష్ట్రాల నుంచి కోయ, గోండులు, ఇతర గిరిజనులు పాల్గొంటారు. ఈసారి 3 కోట్ల మంది ఈ జాతరకు వచ్చారని అంచనా. మేడారం జాతర తరువాత గొల్లగట్టు జాతర అతి పెద్దది. సూర్యాపేట జిల్లా దురజపల్లిలో రెండు సంవత్సరాలకొకసారి జరుగుతుంది. మెదక్ జిల్లాలో ఏడు పాయల జాతరలో స్థానిక దేవతకి భక్తులు ఏడురకాల నైవేద్యాలను సమర్పిస్తారు. అసిఫాబాద్ జిల్లా కోటపరందోళిలో జరిగే జంగుబాయి జాతర మరియు నాగోబ జాతరలో తెలంగాణ సరిహద్దు రాష్ట్రాల గిరిజనులు పాల్గొంటారు. జోడేఘాట్‌లో కొమరంభీమ్ వర్ధంతిలో లక్షలాది గిరిజనులు, గిరిజనేతరులు పాల్గొంటారు. గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరలో నాయక్‌పోడ్ గిరిజనులతో పాటు వేలమంది గిరిజన గిరిజనేతరులు పాల్గొంటారు. సలేశ్వరం చెంచు జాతర, బెజ్జంకి జాతర, వేలాల జాతర, మన్నెంకొండ జాతర, నాగోబాజాతర, కొమరవెల్లి జాతర వంటి ప్రముఖ జాతరలు తెలంగాణా ఆదివాసీ, గిరిజన సంస్కృతిని, గ్రామీణ సంస్కృతిని ఎలుగెత్తి చాటే వారసత్వ సంబరాలు. చారిత్రక చిరునామాలు.

ఈ వారసత్వసంపదను కాపాడుకొనడానికి, యునెస్కో గుర్తింపు సాధించడానికి, ఈ జాతరల చారిత్రక మూలాల గురించి వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు జరపటానికి అవసరమైన కృషి చేయాల్సిన బాధ్యత మనందరిమీద వుంది.



(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

### అండర్‌గ్రౌండ్ నుంచి బయటికి

కాంగ్రెసు సర్కారు నెదుర్కొనే బలం పార్టీకి లేదని, పోరాటం ఆపడం క్షేమమని కమ్యూనిస్ట్ పార్టీ నిర్ణయించి 21 అక్టోబరు 1951న పోరాటాన్ని విరమించింది. కమ్యూనిస్ట్ కార్యకర్తలు అండర్‌గ్రౌండ్ నుంచి బయటికి వచ్చారు. తర్వాత శేషావతారం, కాళికాంబలకు కమ్యూనిస్ట్ పార్టీతో విభేదాలొచ్చాయి. వాళ్ళు పార్టీలో చేర్చుకోమని ఎంత ప్రాధేయపడినా చేర్చుకోలేదు. పార్టీ చుట్టు తిరిగి విసిగిపోయి కాంగ్రెస్ పార్టీ వైపు మళ్ళారు. 1952 ఎన్నికల్లో అల్లూరి సత్యనారాయణరాజుకి నర్సాపురం అసెంబ్లీ సీటు ఇవ్వగా ఆయనకు సపోర్ట్‌గా ఎన్నికల ప్రచారం చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. 1962 అసెంబ్లీ ఎన్నికల్లో అల్లూరిగారు శేషావతారాన్ని పట్టుబట్టి నర్సాపురం నుంచి పోటీ చేయించారు. శేషావతారం గెలిచారు. 1967 ఎన్నికల్లో ఓడిపోయినా, 1972 ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలిచారు. 1976లో ముఖ్యమంత్రి వెంగళరావు మంత్రివర్గంలో రూరల్ డెవలెప్‌మెంట్ శాఖ మంత్రిగా చేరారు. గ్రామాల్లో ప్రజలకి బర్రెలు, గొర్రెలు, పాడి పశువులు వగైరా శేషావతారం శాంక్షన్ చేసేవారు. రోడ్లు, వంతెనలు వేయించేవారు.



పరకాల శేషావతారం - కాళికాంబ దంపతులు

### ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా పార్టీకోసం అహర్నిశలు..

1978 ఎన్నికల్లో హాస్పిటల్ నుంచి శేషావతారం గెలువగా, క్యాబినెట్ మంత్రిగా చేశారు. అంజయ్యగారి మంత్రివర్గంలో పంచాయితీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు పంచాయితీ ఎన్నికలు జరిగి 12 సంవత్సరాలు అయిందని, ఎన్నికలు పెట్టాలని పట్టుదలగా శేషావతారం అంజయ్యగార్ని ఒప్పించారు. శేషావతారం ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకుంటూ ప్రచారంలో పాల్గొనేవారు. శేషావతారం ఎన్నికలను ప్రిస్టేజ్‌గా తీసుకొని రాష్ట్రమంతా కాంగ్రెసును గెలిపించారు. ఇలా శేషావతారం కాంగ్రెస్ రాజకీయాల్లో ముఖ్యపాత్ర వహించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమ సందర్భంలో ఉద్యమకారులు శేషావతారాన్ని కొట్టడానికి వచ్చారు. ఆ సమయంలో వారికి దెబ్బలు తగిలాయి.

1978 శేషావతారం గుండె జబ్బుతో హైదరాబాద్ గాంధీ హాస్పిటల్లో ఉన్నపుడు, పి.వి. నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి ఎన్నికల్లో పోటీ చెయ్యవద్దని, ఎమ్.ఎల్.సి. ద్వారా మంత్రి పదవి ఇప్పిస్తానన్నప్పుడు, దొడ్డిదారిన అధికారంలోకి రావడం తనకు ఇష్టం లేదని వారికి తెగేసి చెప్పారు. శేషావతారం పట్టుదలతో చివరికి ఎన్నికల్లో పోటీ చేసి మళ్ళీ గెలిచి మంత్రయి ఎంతో పేరు సంపాదించుకున్నారు.

కమ్యూనిస్ట్ రాజకీయాల నుండి కాంగ్రెస్ పార్టీలోకి మారినా మొదట్లో బతుకుతెరువు కోసం ఎంతో శ్రమ పడవలసి వచ్చింది. శేషావతారం జనరల్ స్టోర్స్ పెట్టారు. అందులో నష్టం వచ్చింది. శేషావతారం కూడు-గుడ్డ అనే నాటకం రాసి వేయించారు. అందులోనూ నష్టం వచ్చింది. కాళికాంబ నాన్నగారు, అన్నయ్య, శేషావతారం నవ్యాంధ్ర అనే దినపత్రిక పెట్టారు. అది కూడా మూతబడింది. శేషావతారం మద్రాసు వెళ్ళి సినిమాల్లో పనిచేశారు. పుట్టిల్లు సినిమా కోసం పబ్లిసిటీ మేనేజర్‌గా పనిచేశారు. చివరికి ఆ సినిమా సరిగ్గా ఆడలేదు. ఈ సమస్యలన్నింటిని ధైర్యంగా ఎదుర్కొన్న శేషావతారం 1981లో మరణించారు.

### నర్సాపురం నుంచి కాళికాంబ పోటీ...

1981లో శేషావతారం మరణం తర్వాత అంజయ్యగారు ప్రజల సానుభూతి మీద సీటు తప్పకుండా గెలుస్తుందని నర్సాపురం అసెంబ్లీ సీటు నుండి కాళికాంబను పోటీ చెయ్యమని అడిగారు. ఆమె అంగీకరించింది. ప్రచారం కోసం పార్టీ ఇచ్చే ఫండ్ ఆమెకి చేరేదికాదు. వస్తువులు తాకట్టు పెట్టుకుని తెచ్చిన డబ్బు ఖర్చు పెట్టేవారు. శేషావతారానికి తెల్సిన కొందరు ఆమెకు సహాయం చేశారు. చివరికి 800 ఓట్ల మెజారిటీతో ఆమె గెల్చింది. అంజయ్యగారొచ్చి నన్ను బ్రతికించారమ్మ అని కాళికాంబ రెండు చేతులూ పట్టుకుని కళ్ళకద్దుకుని చాలా సంబరపడ్డారు.

సంవత్సరం పాటు విసుగు విరామం లేకుండా కార్యక్రమాలు చేశారు. మళ్ళీ ఎన్నికల ప్రకటన రాగా కుటుంబ బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని పోటీ చెయ్యనన్న తన నిర్ణయాన్ని హైదరాబాద్ వెళ్ళి విజయభాస్కర్ రెడ్డిగారికి తెలియజేశారు. కార్యకర్తలు, పుట్టింటివారు ఎన్నికల్లో నిల్చోమని పట్టుబట్టినా, తనదైన నిర్ణయం తీసుకున్నారు. కాళికాంబ 2024 జనవరి 3న హైదరాబాద్‌లో కన్నుమూశారు.

శేషావతారం కుమారుడు పరకాల ప్రభాకర్ ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు. ప్రభాకర్ భార్య నిర్మలా సీతారామన్ కేంద్రమంత్రిగా పనిచేస్తున్నారు.

– ఎసికె. శ్రీహరి, m : 9849930145
e : ackvs08@gmail.com

# చంద్రకాంతశిల(Moonstone)

చంద్రకాంతిలా మెరుస్తూ, చూడటానికి వెన్నెల గడ్డకట్టినట్టు ప్రకాశిస్తూ, ఆకర్షించే విధంగా కనిపించే ఈ రాయిని చంద్రకాంత శిల అంటారు. దీనిని చంద్రగ్రహానికి అనుసంధానంగా ఉన్న ఉపరత్నంగా భావిస్తారు. సహజంగానే దీనికి అనేక జ్యోతిష్యపరమైన దైవసంబంధమైన అనేక లక్షణాలు ఆపాదించబడ్డాయి.

ఈ శిల తెల్లగా చంద్రకాంతి ఘనీభవించినట్టు మెరుపుకలిగి ఉండటంవల్ల 'చంద్రకాంతశిల' అనే పేరు వచ్చింది.

**మూన్‌స్టోన్‌కు ఉన్న ఇతర పేర్లు:**

**అడ్యులారియా (Adularia):** స్విట్జర్లాండ్‌లోని అడ్యులా పర్వతాలలో దొరకటం వల్ల వచ్చిన పేరు.

హెకేట్ (గ్రీకు చంద్ర దేవత)పేరుతో హెకటోలైట్ (Hecatolite) అనే పేరు వచ్చింది.

"చంద్రుని ప్రియమైన" అనే అర్థంలో చంద్రకాంత / చంద్రమణి అనే పేరు కూడా ఉంది.



సెలెనైట్ (Selenite) అనే పేరు కూడా వాడుతున్నారు. దీనికి గ్రీకులో "చంద్రుడు" అని అర్థం. కానీ నిజానికి ఇది జిప్సమ్ యొక్క ఖనిజం, మూన్‌స్టోన్‌కు సంబంధించినది కాదు. లాబ్రడొరైట్, సన్‌స్టోన్ వంటి ఇతర ఫెల్డ్‌స్పార్‌లకు కూడా కొన్నిసార్లు మూన్‌స్టోన్ అనే వాణిజ్య పరమైన పేర్లు వాడతారు (ఉదా: "రెయిన్‌బో" మూన్‌స్టోను).

బెల్‌మైల్కొరైట్ అనేది ఒక రకం మూన్‌స్టోన్. ఇది చాలా పెళుసుగా (fragile) ఉండటం మరియు సులభంగా విడిపోయే (perfect cleavage) లక్షణం వలన, ఈ రాయిని మలచటం (process) కష్టం.

**భౌమ మరియు ఖనిజ సమాచారం:**

మూన్‌స్టోన్, భూమి లోపల నెమ్మదిగా చల్లబడే మాగ్మా (magma) నుండి గ్రానైట్ లాంటి రాళ్లలో ఏర్పడుతుంది.

**రెండు ఖనిజాల పొరల ఏర్పాటు:**

ఫెల్డ్‌స్పార్ (Orthoclase & Albite) ఖనిజాల పొరలు ఏర్పడటం వల్ల ఈ మెరుపు వస్తుంది. కాంతి ఈ ఖనిజ పొరల మధ్య ప్రయాణించి, మెరిసే ప్రభావాన్ని (schiller effect) కలిగిస్తుంది. కఠినత్వం Mohs స్కేల్ పై 6-6.5 గా ఉంటుంది. మోనోక్లినిక్ స్ఫటిక నిర్మాణము కలిగి ఉంటుంది.

**భౌమ పరిస్థితుల ప్రభావం:**

(శ్రీలంకలోని మూన్‌స్టోన్‌లు (Ceylon) నెమ్మదిగా చల్లబడిన పెద్ద స్ఫటికాల కారణంగా నీలి మెరుపుతో ఉంటాయి.), భారతదేశంలోనివి (Indian Rainbow) టైటానియం, రాగి వంటి మూలకాల జాడల్లో కలిగి ఉండటం వల్ల నీలం, ఆకుపచ్చ, పీచు రంగులతో ఉంటాయి.

**మెరుపుకు కారణం**

మూన్ స్టోన్ (Moonstone) యొక్క మెరుపు, నీలం, గులాబీ, తెలుపు, వెండి రంగుల్లో కనిపించే అద్భుతమైన కాంతి (Adularescence) దానిలోని పొరల మధ్య కాంతి పరావర్తనం, వక్రీభవనం, విక్షేపణం వల్ల వస్తుంది. ఇది గ్రానైట్ వంటి అగ్ని శిలల్లో నెమ్మదిగా చల్లబడేటప్పుడు ఫెల్డ్‌స్పార్ (Feldspar) ఖనిజాల పొరలు ఏర్పడటం వల్ల, అలాగే టైటానియం వంటి మూలకాల ప్రభావంతో ఏర్పడుతుంది. దీనివల్ల రంగుల సమ్మేళనం కనిపిస్తుంది.

**కాంతి ప్రభావం (Impact of Light):**

**వక్రీభవనం & పరావర్తనం:** మూన్‌స్టోన్‌లోకి వెళ్ళిన కాంతి, దాని పొరల మధ్య వంగి (refraction), లోపలి ఉపరితలాల నుండి బౌన్స్ (reflection) అవుతుంది. దీనివల్ల రంగులు లోపలి నుంచి వస్తున్నట్లు, మెరుస్తున్నట్లు కనిపిస్తాయి.

**విక్షేపణం (Diffraction):** కాంతి కిరణాలు ఖనిజ పొరల మధ్య విక్షేపణం చెంది, రంగుల మెరుపును సృష్టిస్తాయి.

**ప్రాచీన సంస్కృతులలో చంద్రకాంత శిల దాని చరిత్ర:**

**ప్రాచీన భారతదేశం:** భారతదేశంలో, చంద్రకాంత శిల అత్యంత పవిత్రమైన రాయిగా పరిగణించబడుతుంది. ఇది ఘనీభవించిన చంద్రకిరణాల నుండి ఏర్పడిందని హిందూ పురాణాలు చెబుతాయి. సంస్కృతంలో దీనిని 'చంద్రకాంత మణి' లేదా 'చంద్రకాంత' (చంద్రునికి ప్రియమైనది) అని పిలుస్తారు. ఇది అదృష్టాన్ని మరియు ప్రేమను తెస్తుందని నమ్ముతారు. మరియు సాంప్రదాయ భారతీయ వివాహాలలో తరచుగా బహుమతిగా ఇస్తారు. పూర్ణమి రోజున నోటిలో చంద్రకాంత శిలను ఉంచుకుంటే భవిష్యత్తును చూడవచ్చని లేదా ప్రవచించే శక్తులు వస్తాయని నమ్మేవారు.

**గ్రీస్ మరియు రోమ్:**

ప్రాచీన రోమన్లు మరియు గ్రీకులు కూడా చంద్రకాంత శిలను తమ చంద్ర దేవతలతో (రోమన్‌లలో లూనా, గ్రీకులలో సెలీన్, ఆర్టెమిస్ వంటి దేవతలు) అనుబంధించారు. రోమన్లు ఈ రాయి చంద్రుని కిరణాల నుండి ఏర్పడిందని బలంగా నమ్మేవారు.

ప్రసిద్ధ రోమన్ ప్రకృతి శాస్త్రవేత్త ప్లినీ ది ఎల్డర్, చంద్రుని దశలతో పాటు రాయి యొక్క మెరుపు మారుతుందని పేర్కొన్నారు. ఈ నమ్మకం 16వ శతాబ్దం వరకు కొనసాగింది.

గ్రీకులు దీనికి "అఫ్రోసెలీను" (ప్రేమ దేవత అఫ్రొడైట్ మరియు చంద్ర దేవత సెలీన్ పేర్ల కలయిక) అని పేరు పెట్టారు.

**మధ్యయుగపు ఐరోపా:** మధ్యయుగంలో, ప్రయాణీకులకు, ముఖ్యంగా రాత్రిపూట లేదా సముద్ర ప్రయాణం చేసేవారికి రక్షణ కవచంగా చంద్రకాంత శిలను ఉపయోగించారు. మహిళలు దీనిని సంతానోత్పత్తిని (fertility) పెంచడానికి మరియు ప్రసవ సమయంలో రక్షణ కోసం ధరించేవారు.

**ఆధునిక చరిత్ర:**

**ఆర్ట్ నోయువే (Art Nouveau) యుగం (1890-1910):** ఈ కాలంలో చంద్రకాంత శిల ఆభరణాల రూపంలో విపరీతమైన ప్రజాదరణ పొందింది. ఫ్రెంచ్ స్వర్ణకారుడు రెనే లాలిక్ వంటి గొప్ప డిజైనర్లు దీనిని తమ ఆభరణాలలో ప్రముఖంగా ఉపయోగించారు.



**1960ల 'ఫ్లవర్-చైల్డ్' ఉద్యమం:** ఈ కాలంలో హిప్పీల మధ్య కూడా దీని సహజమైన మరియు ఆధ్యాత్మిక సౌందర్యం కారణంగా ఇది ప్రసిద్ధి చెందింది.

**పురాణాలలో మరియు జ్యోతిష్య శాస్త్రంలో చంద్రకాంత మణి (Details in Mythology and Astrology):**

పురాణాల ప్రకారం, చంద్రకాంత మణి అనేది చంద్రుని యొక్క స్వచ్ఛమైన, ప్రకాశవంతమైన కిరణాల నుండి ఉద్భవించింది. దీని మెరుపు చంద్రుని దశల (పౌర్ణమి నుండి అమావాస్యకు) ఆధారంగా పెరుగుతుందని, తగ్గుతుందని కూడా విశ్వసించేవారు.

ఆయుర్వేద ప్రకాశంలో దీని ప్రస్తావన ఇలా ఉంది.

స్నిగ్ధం శీతం పీతమత్స్యమంతర్ధత్తే చిత్తే స్వచ్ఛతాం యన్మునీనామ్?

యచ్చ స్రావం యాతి చంద్రాంశుసన్నాదజ్ఞాత్యం రత్నం చంద్రకాంతాఖ్యం ఏతత్??

(స్నిగ్ధమైనది, శీతోష్ణమైనది, పీతరంగు రంగు కలిగినది, మునుల హృదయాలలో స్పష్టతను ఇచ్చేది. చంద్రకిరణాల సంబంధంతో నీటి బిందువులు కారుతూ ఏర్పడే ఈ రత్నము చంద్రకాంతమంటారు)

రసతరంగిణిలో చంద్రకాంత శిల గురించి ప్రస్తావన ఇలా ఉంది.

చంద్రకాంతోన్తిశిశిరః స్నిగ్ధః పిత్తాపహః పరమ్।
రక్తపిత్తప్రశమనస్తథ దాహనిషూదనః

(చంద్రకాంతము అతి శీతోష్ణమైనది, స్నిగ్ధమైనది, పిత్త దోషాన్ని పూర్తిగా తీర్చేది. రక్తపిత్తాన్ని (రక్తస్రావం) శాంతింప జేస్తుంది, దహన శాంతి కలిగిస్తుంది.)

దండి యొక్క కావ్యాదర్శణం అనే గ్రంథంలో ఇంకా మహా సుభాషిత సంగ్రహం (Maha-subhashita-samgraha) అనే సూక్తి భాండాగారంలో కూడా కనిపించే శ్లోకం ఒక విహార పర్వతంపై చంద్రకాంత శిలల మధ్య నాట్యం చేస్తున్న నెమలి అందాన్ని వర్ణించే సందర్భంగా కనిపిస్తుంది.

*ఆరుహ్యక్రీడశైలస్య చంద్రకాంతస్థలీమిమామ్।*
*నృత్యత్యేష లసచ్చారుచంద్రకాంతః శిఖావలః॥*

తెలుగు సాహిత్యంలో చంద్రకాంత శిల (Moonstone) ఒక అద్భుతమైన భావనగా, శృంగార మరియు ప్రకృతి వర్ణనలలో ఎక్కువగా కనిపిస్తుంది. ప్రాచీన కావ్యాల నుండి ఆధునిక కవిత్వం వరకు దీనికి సంబంధించి ప్రధానంగా వినిపించే ప్రస్తావనలు ఇలా ఉన్నాయి.

**చంద్రోదయం-శిల ద్రవించడం:**

పురాణ ప్రబంధాల ప్రకారం, చంద్రకాంత శిలలు చంద్రుని వెన్నెల సోకగానే కరిగి నీరవుతాయని కవుల నమ్మకం. దీనిని ఒక అందమైన 'ఉత్ప్రేక్ష'గా వాడుతారు. ఉదాహరణకు, నాయకా నాయికల మధ్య విరహాన్ని లేదా ఆనందాన్ని వర్ణించేటప్పుడు, చంద్రుని రాకతో చంద్రకాంత శిలలు కరిగినట్లుగా వారి మనసులు కరిగాయని వర్ణిస్తారు.

**శృంగార కావ్యాలలో:** పెద్దన, భట్టుమూర్తి వంటి ప్రబంధ కవుల రచనలలో వెన్నెలను వర్ణించే క్రమంలో "చంద్రకాంత శిలావేదికల" ప్రస్తావన వస్తుంది. రాజభవనాలలోని మేడల మీద ఈ శిలలతో చేసిన అరుగులు ఉండేవని, వెన్నెల పడగానే అవి చల్లని నీటిని స్రవిస్తూ పరిసరాలను ఆహ్లాదపరుస్తాయని వర్ణించేవారు.

**కాళిదాసు ప్రభావం:** సంస్కృత మహాకవి కాళిదాసు తన 'మేఘదూతం'లో చంద్రకాంత శిలల గురించి చేసిన వర్ణనల ప్రభావం తెలుగు కవులపై చాలా ఉంది. యక్షుని భవనంలో వెన్నెల తగిలి కరిగే చంద్రకాంత మణుల గురించి ఆయన పేర్కొన్నారు.

**అలంకార శాస్త్రం:** తెలుగు సాహిత్యంలో "అన్యోన్యం" లేదా "అతిశయోక్తి" అలంకారాలను ఉపయోగించేటప్పుడు, చంద్రకాంత మణిని ఒక సంకేతంగా వాడతారు. చంద్రుడు (నాయకుడు) రాగానే చంద్రకాంత శిల (నాయిక) స్పందించడాన్ని ప్రకృతి సిద్ధమైన ప్రేమకు చిహ్నంగా చూపిస్తారు.

**గజేంద్ర మోక్షంలో చంద్రకాంత శిల ప్రస్తావన:**

అల వైకుంఠపురంబులో నగరిలో నా మూల సౌధంబు దాపల మందారవనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలోత్పల పర్యంక రమావినోది యగు నాపన్న ప్రసన్నుండు విహ్వల

నాగేంద్రము "పాహిపాహి" యనఁ గుయ్యాలించి సంరంభియై...

ఇది తెలుగు వారు మరచిపోలేని పద్యం. ఇందులో పేర్కొన్న "ఇందుకాంతోపల" లేదా చంద్రకాంత శిలను భగవంతునికి పర్యంకగా ఉన్నట్లు కవి వర్ణించారు.

**చంద్రకాంత శిల**



(Moonstone) ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో లభిస్తుంది. ముఖ్యమైన నిక్షేపాలు ఉన్న ప్రదేశాలు:

**శ్రీలంక (Sri Lanka):** అత్యుత్తమ నాణ్యత కలిగిన, పారదర్శకమైన మరియు నీలం రంగు మెరుపు (blue sheen) ఉన్న మూన్‌స్టోన్‌లకు శ్రీలంక ప్రసిద్ధి చెందింది. ఇక్కడి మీటియగోడ (Meetiyagoda) గనులు ముఖ్యమైనవి..

**మయన్మార్ (Myanmar):** చారిత్రికంగా అద్భుతమైన నాణ్యత గల మూన్‌స్టోన్‌లకు మయన్మార్ (బర్మా) కేంద్రంగా ఉండేది. అయితే ఇప్పుడు ఈ నిక్షేపాలు చాలావరకు తగ్గిపోయాయి.

**మడగాస్కర్ (Madagascar):** ఇక్కడ వివిధ రంగులలో, ముఖ్యంగా నలుపు మరియు అరుదైన నీలం రంగులలో మూన్‌స్టోన్లు లభిస్తాయి.

**టాంజానియా (Tanzania):** ఆకర్షణీయమైన మెరుపుతో కూడిన మూన్‌స్టోన్ నిక్షేపాలు టాంజానియాలో కూడా ఉన్నాయి.



**యునైటెడ్ స్టేట్స్ (United States):** USA లోని న్యూ మెక్సికో, వర్జీనియా, మరియు నార్త్ కరోలినా వంటి రాష్ట్రాలలో మూన్‌స్టోన్ లభిస్తుంది. అయితే ఇవి సాధారణంగా ఆసియా రకాలతో పోలిస్తే తక్కువ మెరుపును కలిగి ఉంటాయి.

**ఇతర ప్రాంతాలు:** ఆస్ట్రేలియా, బ్రెజిల్, మెక్సికో, నార్వే, పోలాండ్, మరియు స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వత ప్రాంతాలలో కూడా మూన్‌స్టోన్ నిక్షేపాలు చిన్న మొత్తాలలో కనిపిస్తాయి.

భారతదేశంలో ముఖ్యంగా తమిళనాడులోని కోయంబత్తూరు, కరూర్-కంగయం జిల్లాల్లో మూన్‌స్టోన్ నిక్షేపాలు ఉన్నాయి. ఇక్కడ తెలుపు, పీచ్, బూడిద మరియు రెయిన్‌బో రంగులలో మూన్‌స్టోన్లు లభిస్తాయి

కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు మూన్‌స్టోన్ నిక్షేపాలకు ప్రసిద్ధి చెందాయి. ఒడిశా మరియు మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో కూడా ఇవి లభిస్తాయి.

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని తూర్పు కనుమల (Eastern Ghats) ప్రాంతాలలో సహజంగా చంద్రకాంత రాయి (moonstone) లభించే అవకాశం ఉందని భౌగోళిక సర్వేలు సూచిస్తున్నాయి.

**ముఖ్య ప్రదేశాలు (తెలుగు రాష్ట్రాల్లో):**

**ఆంధ్రప్రదేశ్:** తూర్పు గోదావరి మరియు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలు, విజయనగరం జిల్లాల పరిసరాల్లో మూన్‌స్టోన్‌తో పాటు ఇతర రంగు రాళ్లు, రత్నాలు (అలెగ్జాండ్రైట్, ఆక్వామెరైన్, గార్నెట్) లభించే నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు.

తెలంగాణలో అనేక ప్రాంతాల్లో ఫెల్డ్ స్పార్ నిక్షేపాలు ఉన్నప్పటికీ చంద్రశిలల ఉనికి లభించలేదు.

**ఉపయోగాలు:**

తక్కువ ధరలో సులభంగా లభించే చంద్రకాంత శిలను ప్రధానంగా ఆభరణాలలో ఉపయోగిస్తారు. వైద్య ఉపయోగాలు (Medicinal Uses)ఈ రాయి హార్మోన్లను సమతుల్యం చేస్తుందని, మహిళలలో మానసిక సమస్యలు, గర్భం, ప్రసవ సమయంలో ఉపయోగపడుతుందని భావిస్తారు. జీర్ణక్రియ, ప్లీహము సంబంధ సమస్యలకు క్రిస్టల్ థెరపీలో వాడతారు; మానసిక ఒత్తిడి, నిద్రలేమి తగ్గిస్తుందని నమ్ముతారు.

పారిశ్రామిక ఉపయోగాలు (Industrial Uses) పరిశ్రమలలో చంద్రకాంత శిలకు అంతగా లేవు. కఠినంగా లేకపోవడం వల్ల (Mohs 6-6.5). అలంకరణలు, చిన్న ఆభరణాలు, డెకరేటివ్ వస్తువులలో మాత్రమే పరిమితం.

ఫెల్స్పార్ ఖనిజాల పరిశోధనలో ఉపయోగపడుతుంది.

**ఇతర ఉపయోగాలు (Other Uses):** ఆధ్యాత్మికంగా, ధ్యానం, చక్రాల సమతుల్యత (సక్రల్, థర్డ్ ఐ) కోసం వాడతారు. ప్రయాణికులకు రక్షణ రాళ్లుగా భావిస్తారు. భారతీయ జ్యోతిష్యంలో చంద్ర దోష నివారణకు ధరిస్తారు, భావోద్వేగ స్థిరత్వం తెస్తుందని విశ్వాసం.

**ఫ్లోరిడా రాష్ట్ర రత్నం:** 1969లో చంద్రునిపై మొదటి మానవ అడుగుజాడలను గౌరవిస్తూ, ఫ్లోరిడా రాష్ట్రం 1970లో చంద్రకాంత శిలను తమ అధికారిక రత్నంగా ప్రకటించింది. అయినప్పటికీ ఈ రాయి అక్కడ లభించదు.

-చకిలం వేణుగోపాలరావు
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e: venugopal.chakilam1@gmail.com
- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com




## మొఘలుల వారసత్వానికి గౌరవ చిహ్నం..

# తాజ్ మహోత్సవ్!

**తా**జ్ మహోత్సవ్ ప్రతి సంవత్సరం మొఘలుల కళ, సంస్కృతి మరియు సంప్రదాయాల గొప్ప వారసత్వాన్ని గౌరవించటానికి నిర్వహించబడుతోంది. తొమ్మిది రోజుల ఈ ఉత్సవంలో భారతదేశంలోని కొన్ని గొప్ప కళలు, చేతిపనులు, సంస్కృతులు, వంటకాలు, నృత్యాలు మరియు సంగీతాన్ని ప్రదర్శిస్తారు. ప్రపంచంలోని అత్యంత అందమైన స్మారక కట్టడాలలో ఒకటైన తాజ్ మహల్ సమీపంలో నిర్వహించబడే ఈ తాజ్ మహోత్సవ్ భారతదేశం యొక్క గొప్ప చరిత్ర గురించి తెలుసుకోవడానికి ఒక గొప్ప అవకాశాన్ని అందిస్తుంది.



**ఆత్మీయ అనుభూతులను చేరువ చేసే..**

వివిధ రంగాలకు చెందిన కళాకారులు తాజ్ మహోత్సవ్ సాంస్కృతిక కార్యక్రమాలలో సాయంత్రపు సమయాన సందడి చేయనున్నారు. ఇక్కడి ప్రదర్శనలు ఎంతో ఆత్మీయ అనుభూతులను చేరువచేస్తాయి. క్లాసికల్ నుండి ఫోక్ వరకు వివిధ కళారూపాలు, స్థానిక జానపద, విదేశీ ఒపేరాలు మరియు శాస్త్రీయ మరియు ప్రసిద్ధ సినిమా పాటలు కన్నుల పండగగా ప్రదర్శించబడతాయి. ఉర్రూతలూరించే సంగీత విభావలి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సుదూర ప్రాంతాలనుంచి వచ్చే కళాకారులు తమ ప్రతిభతో చూపరుల మనసును దోచేస్తారు.

**కళల నుంచి క్రాఫ్ట్ వరకూ..**

దేశంలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు 400 మంది ప్రఖ్యాత కళాకారులు తమ అద్భుతమైన కళాఖండాలను ప్రదర్శించే అవకాశాన్ని ఇక్కడ పొందుతారు. వీటిలో తమిళనాడు నుండి చెక్క/రాతి శిల్పాలు, ఈశాన్య భారతదేశం నుండి వెదురు/చెరకు కళాకృతులు, ఆగ్రా నుండి పాలరాయి మరియు జర్దోజీ రూపాలు, సహరన్‌పూర్ నుండి ఉడెన్ కళాకృతులు ఇలా చెప్పుకుంటూపోతే దేశంలోని అన్ని ప్రాంతాల వృత్తినైపుణ్యాలను ఒకేచోట చూసే అవకాశన్ని కల్పిస్తుంది తాజ్ మహోత్సవ్. అంతేకాదు, ఆహార ప్రియుల స్వర్గంగా కూడా ఈ ఫెస్టివల్ ప్రసిద్ధిపొందింది. ఈ సమయంలో సందర్శకులు మనసారా ఆస్వాదించే వివిధ రకాల వంటకాలు మరియు ప్రపంచ ప్రసిద్ధ ఆహారాలను రుచి చూడవచ్చు. ఈ తాజ్ మహోత్సవ్ 1992లో ప్రారంభమైంది. మొఘలుల గొప్ప వారసత్వాన్ని గౌరవించడం, కళాకారులకు ప్రోత్సాహం అందించడం మరియు వారి అద్భుతమైన కళాఖండాలు, హస్తకళలను అత్యంత ప్రామాణికమైన ధరలకు ప్రజలకు అందుబాటులో ఉంచడం కోసం ఇది ప్రతి సంవత్సరం నిర్వహించబడుతుంది. తాజ్ మహోత్సవ్ ఫిబ్రవరి 18 నుండి 27 వరకు తాజ్ మహల్ తూర్పు ద్వారం సమీపంలోని శిల్పగ్రామ్‌లో నిర్వహించబడుతుంది.

– కొత్వాల్. సచిన్,
m : 86866 64949
e: desk.deccan@gmail.com

# ఒక పాట వంద జ్ఞాపకాలు

**బా**ల్యంలో మన లేత చిగురాకుల వంటి పెదాలపై తొలిసారి, ఓం ప్రథమంగ, ఒకానొక సువర్ణ ఘడియలో పలికిన, పాడినపాట ఏమైవుంటుంది? మిమ్మల్ని మీరు ఎపుడైనా ప్రశ్నించుకుని, ఆలోచించారా? ఆ పాటను మీరు పట్టుకున్నారా? మళ్లీ మీ పెదాలపై ఆ పాట నర్తనమాడిందా? ఇక అక్కడ నుండి జీవితాంతం పాటల పల్లకీలో ప్రయాణిస్తూనే ఉన్నాం కదా! పాటల లోకంలో ఊరేగుతునే ఉన్నాం కదా! మన “అమ్మలు” మనకు పాలు, పాట ఏక కాలంలోనే పరిచయం చేసారు. ఉగ్గుపాలతోనే పాట మన వెంబడి తోడుగా, నీడగా ఇంత కాలం నడిచి వచ్చింది కదా!

నా వరకైతే నా మూడేళ్ల వయసులో మొదటిసారి నేను పాడింది ఒక హిందీ పాట.

*“దేఖ్ తెరి సంసార్ కీ హాలత్*
*క్యా హోగయీ భగవాన్*
*కిత్ నా బదల్ గయా ఇన్సాన్”*




(1954లో వచ్చిన “నాస్తిక్” అనే హిందీ సీన్మాలోని పాట. దేశ విభజన విషాదాలను ఆ సీన్మా చూపించింది). హీరో అజిత్. మన హైద్రాబాద్, గోల్కొండలో పుట్టి పెరిగిన వాడే.

నా మాతృభాష తెలుగు. మరి హిందీ పాట నా పెదాలపైకి ఎట్లా వచ్చింది? ఇప్పటికీ నేను ఉర్దూ, హిందీ పాటల “షౌకీన్” నే. ఆ పాట నా పెదాలపై ఎట్లా పుట్టిందో చెప్పక తప్పదు.

నేను పుట్టింది హైదరాబాద్ పాతనగరంల కుర్మగూడెం బస్తీ. అలియాబాద్ దర్వాజాకు వెళ్లే తోవల కుడివైపు ఒక చిన్న కమాన్. అందులోకి వెళ్లి తిరిగి ఎడమవైపు మళ్లంగనే కుర్మగూడెం బస్తీ. దాన్ని దాటి సీదా వెళ్లితే గాజీబండ బస్తీ. నేను పుట్టిన బస్తీల కురుమ కుటుంబాలే అధికం. వాడకట్టు మధ్యల పురాతనమైన రావిచెట్టు ఊడలు విస్తరించి ఉండేది. ఆ చెట్టు చుట్టూ సిమెంటు గచ్చుతో చేసిన గుండ్రటి విశాలమైన వేదిక. వటవృక్షపు చల్లని ఛత్రచ్ఛాయల క్రింద “చావిడిలా” ఉండేది. దాని పక్కన అమ్మవారి గుడి. మైసమ్మనో, పోశమ్మనో, ముత్యాలమ్మనో కావచ్చు. కురుమోళ్లు చెప్పే ఒగ్గు కథను మొదటిసారి నేను విన్నది ఆ చావిడి దగ్గరే. ఆ రావిచెట్టు ఎదురుంగనే మా “గరీబ్ ఖానా”. నేను ఇంట్ల ఉండేది తక్కువ, బజార్ల ఉండేది ఎక్కువ. ఒగ్గు కథను ఆ కురుమ కళాకారులు డోలు, మేళ తాళాలతో, కాళ్ల గజ్జెలతో దరువులు వేస్తూ లయబద్ధంగా గుండ్రంగా తిరుగుతూ, లంఘించి కుప్పి గంతులు వేస్తుంటే బస్తీమొత్తం దద్దరిల్లి ఆబాలగోపాలం యావత్తూ మంత్రనగరిలోకి మాయమైపోయేవారు. మా చిన్నప్పుడు ఒగ్గు కథని మేం “డిల్లం-బల్లం” అనేవారం.

ఒకసారి ఆషాడమాసంలో బోనాల పండుగ వచ్చింది. జనం జాతర జజ్జనకరి జనారేలా వుంది. రావి చెట్టు కొమ్మకు ఒక లౌడ్ స్పీకర్ (పుంగీ) తగిలించారు. క్రిందనున్న గ్రామ్‌ఫోన్‌తో దానికి కనెక్షన్ ఇచ్చి నల్లని రికార్డు వేసారు. అది గుండ్రంగ తిరుగుతుంటే పుంగీల నుండి పాట ప్రవాహంలా ప్రవహించింది. ఆ పాటనే “దేఖ్ తెరీ సంసార్ కి హాలత్”.

ఆ రెండు రోజుల జాతరల ఆ పాట పదే పదే వేసారు. నేను పెద్ద “కాన్ సేన్”ను కదా వినీ వినీ ఆ పాట నాకు కంఠోపాఠం అయ్యింది. ఇగ అంతే సంగతులు. చిత్తగించవలెను. ఆ పాట రాగం ఒకటి మాత్రమే పట్టుకుని, అపభ్రంశ పదాలతో ఘోరంగా ఉచ్చరిస్తూ వినని వారికీ, వినే వారికి ఇద్దరికి మాత్రమే “తాన్‌సేన్”లా వినిపించసాగాను. హిందీ భాష తెలిసిన వారిని గాయపరిచేలా పెద్ద గాయకుణ్ణి ఐపోయాను. ఒక రోజు మా పెద్దక్క అత్తారింటి నుండి పుట్టింటికి వచ్చింది నా గానంతో అందరినీ గాయపరుస్తున్నా నన్న వార్త ఆమెకు కూడా తెలిసింది. “ఒరే లోకీ ఆ పాట పాడరా” అని హఠాత్తుగా ఆమె అడగగానే నాకు సిగ్గు ముంచుకొచ్చింది నా నక్కిళ్లు కూలబడినయి. నోరు పెగిలి పాట ఇవతలి లోకి రాలేదు. ఆమె మళ్లీ బ్రతిమిలాడింది. నేనింకా నాలోకి నేను ముడుచుక పోయినాను. ఒప్పులకుప్ప, సిగ్గుల మొగ్గ ఐనాను. నా అవస్థ గమనించి ఆమె “పోనీ ఆగోడ చాటుకు పోయి పాడు” అని కనికరించింది. నేను ఒక్క గంతులో గోడ వెనుక దాగి “దేఖ్ తెరి సంసార్ కి హాలత్” అన్న పాటను ఒ దునియా తే రఖ్ వాలే స్థాయిలో గొంతుపెంచి ఏడు కొండలపై నున్న వాడికి కూడా వినబడేలా విజృంభించి పాట కచేరి ప్రారంభించాను.

ఆ తర్వాత కొద్దిరోజులకు జండాపండుగ వచ్చింది. అంటే “పంద్రాగస్టు” అన్న మాట రావిచెట్టుకు మళ్లీ “పుంగీ” తయార్. నేను జారుతున్న చెడ్డీ పైకి లాక్కుంటూ అమ్మవారి గుడి దగ్గర హాజర్. ఈ సారి తెలుగు పాట.

*“ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా*
*నీ కష్టమంతా తీరునురో రన్నో చిన్నన్నా”*

(1955, రోజులు మారాయి సీన్మా)

టక్కున పాత పాటను వదిలి ఈ కొత్త పాటను లంకించుకుని మళ్లీ శ్రోతల కర్ణభేరీలను పగుల గొట్టటం ప్రారంభించాను.

ఇంతటితో ఐపోలేదు. ఎండాకాలం బడులకు సెలవులని మా రంగన్న మడికొండ నుండి పట్నం వచ్చాడు. వాడు నా కంటె చాలా పెద్ద. ఒక్క చదువు తప్ప అన్ని కళల్లోనూ, విద్యల్లోనూవాడు ఆరితేరినాడు. వాడు ఆవారా పోరగాడని మా అమ్మా బాపులకు కోపం. వాడితో దోస్తీ చేస్తే నేను కూడా చెడిపోతానని వాళ్ల భయం. నాకేమో వాడంటే చాలా ఇష్టం. గిలేర్‌తో పిట్టలను, ఉడతలను కొట్టటం, బొంగరాలు గిరగిర్రా తిప్పటం, గోలీలు ఆడటంలో (రంగు రంగుల గాజు గోలీలు) వాడు అవ్వల్ దర్జా నంబర్ వన్ ఆ గోలీలల్ల రంగురంగుల పువ్వులు ఎట్లా పెట్టారో అని నా సందేహం. అవి వాడి నిక్కర్ జేబులో ఒకదానికొకటి వొరుసుకుని గలగలా చప్పుడు చేసేవి. వాటిల్లోని రంగులపువ్వుల రహస్యాలు తెలుసుకోవాలని నా కుతూహలం. ఓ రోజు ఒక గోలీని రాయితో పగులకొట్టినం. రంగుల్లేవ్, పువ్వుల్లేవ్ ఉత్త గాజుపొడి తప్ప.

దానితో నాకు శంకరాచార్యుల వారి మాయావాదమే కాక విశ్వరహస్యం కూడా బోధపడింది.

వాడు ఆడే గోలీలాట మన రెండు కళ్లతో చూసి తరించవలసిందే. దూరాన ఒక గుంటలో ఒక గోలీని నిలబెట్టి మరికొంత దూరంలో మోకాళ్లు ముడుచు కు కూచుని, కుడి చేతి బొటన వేలు చూపుడు వేలు మధ్యన మరో గోలీని బిగించి పట్టుకుని ఒక కన్ను మూసి ఇంకో కన్ను తెరిచి తీక్షణమైన ఒంటికంటి చూపుతో ఎడమ చేయి చూపుడు వ్రేలుతో ఆ గోలీని బాణంలా విసిరేవాడు. అది గురి తప్పకుండా గుంతలో వున్న గోలీని తాకి టక్కున ఎగర కొట్టేది. వాడు ఆడుతున్నంత సేపు వాడి పెదాలపై ఒక పాట పల్లవిస్తుండేది. వాడున్నన్ని రోజులు ఆ పాటే పాడుతుండేవాడు.

*"గోరే గోరే గాల్ గాల్ పే*

*ఉల్ జే ఉల్ జే బాల్*

*ఓ తెరా క్యా కహెనా"*

(1957, తుమ్ సా నహీ దేఖా సీన్మా)

సెలవులు ఐపోగానే వాడు, వాపస్ వెళ్లి పోయాడు. నా గుండె గూడు ఖాళీ అయి దిగులు నిండుకుంది. వాడు ఆడి పాడిన వాకిలిని చూస్తూ అక్కడున్న అరుగులపై ఒక్కడినే ఒంటరిగా, మనాదితో కూచునేవాడిని. ఒక దినం హఠాత్తుగా ఎక్కడ్నుండో రేడియోలో 'గోరే గోరే గాల్ గాల్ పే" గానా వినబడింది. వాడు యాదికొచ్చి మనసంతా పానీ పానీ ఐపోయింది. మా రంగన్న తెగిన గాలి పటంలానే అర్థాయుస్సులోనే మరణించాడు. "గోరే గోరే గాల్ గాల్ పే". ఎప్పుడు విన్నా రంగన్నే నాకు జ్ఞాపకం వస్తాడు.

తర్వాత మేం కుర్మగూడెం ఖాళీచేసి శాలిబండ దగ్గరలోని రూప్‌లాల్ బజార్‌లో ఒక పాత పెంకుటిల్లును కొనుక్కున్నాం. ఆ బస్తీ ఒక మినీ ఇండియా. మా గల్లీలో ముస్లింలు, మరాఠీలు, వెనక దిక్కు కన్నడిగులు, బొందిలీలు, కాయస్తులు, జోషీలే కాక మంగలి, గొల్ల, వడ్రంగి, బ్రహ్మణ కులాల వారు కూడా ఉండేవారు. ఆ కాలంలో రేడియో కొంతమంది ఇండ్లలోనే ఉండేది. అది ధనికుల వాడుకునే విలాసవంతమైన సాధనం. మా వెనక ఇల్లు జోషీలది. వాళ్ల రేడియోలోని పాటలన్నీ మా మీది దయతో మా ఇంట్లకు మలయ మారుతంలా ప్రవహించేవి.

వారానికోసారి "బినాకా గీత్ మాలా". అమీర్ సయానీ మంద్రమైన, మత్తు గొంతుతో రాత్రిపూట వచ్చేది. మేం చేద బావి ప్రక్కన మల్లె పందిరి క్రింద మంచాలల్ల పడుకుని ఆ పాటలన్నీ వినేది."జంగ్లీ" సినిమాలో షమ్మీకపూర్ పాట "చాహె కొయి ముజె జంగ్లీ కహే" అని రఫీసాబ్ గొంతు చించుకుని పంచమ స్వరంలో పాడుతుంటే మా మనసులు మానససరోవరంగా మారిపోయేవి. "మేరా జూతా హై జపానీ, ఏ పంట్లోన్ హిందుస్థానీ" పాట అర్థం కాకున్నా ఆ స్వర మాధుర్యానికి, సంగీతానికి "దిల్‌ఖుష్" ఐపోయేది. అప్పటికీ ముఖేష్, శంకర్ జై కిషన్, శైలేంద్రల పేర్లు కూడా తెలియవు. హీరోలే ఆ పాటలన్నీ పాడుతారని నమ్మే అమాయకపు సత్తె కాలం అది.




మా ఇంటి వెనుక యాపచెట్టు పక్కన ఒక బొందిలోళ్ల ఉమ్మడి కుటుంబం ఉండేది. 1857 సిపాయిల తిరుగుబాటు విఫలం కాగానే ఉత్తర భారత దేశపు బుందేల్‌ఖండ్ ప్రజలు ప్రాణాలను అరచేతులల్ల పెట్టుకుని వింధ్యపర్వతాలను దాటి నైజాం రాజ్యంలకు వలస వచ్చారు. వారిలో అత్యధికులు నిజాం కొలువులో సైనికులుగా చేరారు. ఆ ఉమ్మడి కుటుంబంలో అమ్మాయిపెళ్లి కుదిరింది. ఇక ఊరంతా ఒకటే హడావుడి. రాత్రిపూట పెళ్లి. ఆ ఇంటికి ఇంద్రధనస్సు లాంటి రంగులు వేసారు. పండు వెన్నెల్లాంటి పెట్రోమాక్సు లైట్ల వెలుగుల్లో ఇల్లు ఇల్లంతా ధగధగమని చమక్ చమక్ మని మెరిసింది. పిలవని పేరంటంలా నేనక్కడ హాజర్. పెద్ద వెండిప్లేట్‌లో అమర్చిన గాజుగ్లాసులల్ల రంగు రంగుల చల్లని షర్బత్ పానీయాలను అతిథులకు అందిస్తున్నారు. ఆ సేవకులు నాకూ ఓ గ్లాసు ఇచ్చారు. దానిని సేవించిన తర్వాత నాచూపు యాపచెట్టు క్రింద బల్లపీట చుట్టూ మూగిన గుంపు మీదికి మళ్లింది. నేను కూడా వెళ్లి ఆ గుంపులో చొరబడి మెడలు నిక్కించి మిటమిట చూసాను. గ్రామ్‌ఫోన్, దానిపై నల్లని రికార్డు. చెట్టుకొమ్మమీద తెల్లని పుంగీ అంటే లౌడ్‌స్పీకర్. కరెంట్ వైర్ల కనెక్షన్ కూడా ఉంది కాని ఎక్కడో లోపం వల్ల పాట వొస్తలేదు. కుక్క బొమ్మ ఉన్న నల్లటి హెచ్ఎంవి రికార్డు ప్లేయర్ గిరగిరా

తిరుగుతుంది కాని పాట మాత్రం వొస్త లేదు. అందరూ దానితో కిందా మీదా కుస్తీ పడుతున్నారు. క్యా ఫాయిదా? గానా నహీం ఆరా. ఒకాయన దానికి కుంజీ ఇవ్వాలని చెప్పి ఏదో పనిముట్టు దానిలో దూర్చి చెయ్యి, బుజం నొప్పి పుట్టేలా గిరగిరా తిప్పాడు. చెమటలు పట్టాయి కాని పాట మాత్రం రాలేదు. గ్రామ్‌ఫోన్ మూగనోము వ్రతం పట్టినట్టుంది. నాకు విసుగు, నిద్రా ముంచుకొచ్చి ఇంటికి నిరాశగా వెళ్లి ముసుగుతన్ని నిద్రపోయాను.

తెల్లారి నిద్రలేవంగనే పాట, పుంగీ యాదికొచ్చి యాపచెట్టు క్రిందికి ఉరికిన బల్లపీట ఖాళీగా కనబడింది. పుంగీ అట్లనే ఉంది కాని గ్రామ్‌ఫోన్ మాత్రం లేదు. రిపేరు కోసం పట్నం తీసుక పోయింద్రట. కొండంత నిరాశతో నేను బడికి తయారై వెళ్లిపోయిన. బడికి పోయి చదువులల్ల పడంగనే "పుంగీ" సంగతి పాట సంగతి యాది మర్సిన. అన్నం బెల్లుల భీ యాదికి రాలే. ఆఖరీల బడి ఇడిసిపెట్టినంక భీ గుర్తుకు రాకపాయె. గల్లీలల్ల నడుసుకుంట వాడకట్టుకు రాంగనే.....

*"ఖోయా ఖోయా చాంద్*

*ఖులా ఆస్మాన్*

*ఆఖోం మే సారీ రాత్ జాయెగీ*

*తుమ్ కో భీ కైసే నీంద్ ఆయేగీ"*

(1960, కాలాబజార్ సీన్మాలో దేవానంద్ పాట)

అన్న పాట కర్ణానందంగ నా చెవులకు సోకింది. ఆ పుంగీ పుణ్యమా అని ఆ పాట నాలుగు దిక్కులను ఒక్కటిగ చేస్తుంది. నేను ఇంట్లకు పోయి పుస్తకాల బట్ట సంచీని గూట్లె విసిరి కొట్టి మళ్లీ యాపచెట్టు క్రిందికి ఉరికిన. ఇక మళ్లీ వారం దినాల దాకా నా పెదవుల మీద నుండి "ఖోయా ఖోయా చాంద్" పాట పోనే లేదు. ఆ పాట ఇప్పటికీ మనసు నుండి మాసిపోలేదు. చెదిరిపోలేదు.

ఇక 1960ల నా హృదయం రాజ్ కపూర్ కే అంకితం ఐపోయింది. అప్పటికి నా వయస్సు నవవసంతాలు. లేత చిగురాకు వంటి హృదయం ఏది విన్నా ఏది చూసినా రెపరెపలాడే మనసు. ఒకరోజు మా ముగ్గురక్కలు గుసగుసలాడుకుని ముస్తాబులు మొదలు పెట్టారు. నేను నా "జాసూసీపనా"తో విశయం పసిగట్టాను. ముందే వెళ్లి శాలిబండా చెట్టుక్రింద వాళ్లు రిక్షా ఎక్కే రోడ్డు మీద కాపలా కాసాను. ఆఖరికి ముగ్గురు దొంగలు రెడ్‌హాండెడ్‌గా నాకు దొరికారు. నా ఉక్రోషపు ఎర్రటి ముఖాన్ని చూసి వారికి నవ్వు కూడా వచ్చింది. తర్వాత దయ కలిగింది.

అట్లా చార్మినార్ దాటి గుల్జార్ హౌజ్ క్రిష్ణా టాకీసుల రాజ్ కపూర్ సీన్మా "జిస్ దేశ్ మే గంగా బహతీహై" చూసే భాగ్యం అక్కల పుణ్యమా అని నాకు లభించింది. చీకట్లలో వేం తడుముకుంటూ వెళ్లి కుర్చీలల్ల కూచునేసరికే రాజ్ కపూర్ డప్పు కొట్టుకుంట "మేరా నామ్ రాజు" పాట చిన్న తెప్పపై నిలబడి గంగా నదిలో పాడుతున్నాడు. కాశీలోని ఘాట్‌లు, దేవాలయాలు, రిషికేష్ లక్ష్మణ్ జులా, దూరాన హిమాలయాలు కనబడుతున్నాయి. "లవ్ ఎట్ ఫస్ట్ సైట్" నేను రాజ్‌కపూర్ ప్రేమలో పడిపోయాను. ఇప్పటికీ ఇవతలికి రానేలేదు. సీన్మా నుండి ఇంటికి వచ్చినంక ఆ తెల్లారి బియ్యం డబ్బామీది గుండ్రటి రేకుమూతను తీసుకుని దానినే డప్పుగా భావించి చేతులతో కొట్టుకుంట "మేరా నాం రాజు" పాటతో ఇంటిని హోరెత్తించాను. తెల్లపేపర్ ఏది కనబడినా 'హిమాలయాలను, గంగానదిని, అందులో పడవను, అందులో నిలబడ్డ మనిషి చేతిలో ఒక గుండ్రటి డప్పును చిత్రించే వాడిని. మరాఠీల ఇంటిల లేదా జోషీల ఇంటి రేడియోలో "జిస్ దేశ్ మే" పాటలు వస్తుంటే హడావుడిగా పరిగెత్తి వారి ఇంటి కిటికీల వద్ద నిలబడి చెవులప్పగించి ఆ పాటలను, ఆ రాగాలను విని ఊహలలో తేలిపోయే వాడిని.




నేను మొదటిసారి కాశీకి వెళ్లినప్పుడు దశాశ్వమేధ్ ఘాట్ మెట్లపై కూచుని గంగానది అలలను చూస్తూ "హమ్ ఉస్ దేశ్ కే వాసీహై, జిస్ దేశ్ మే గంగా బహతీ హై' పాట పెద్దగా తన్మయత్వంతో పాడుకున్నాను. ఆ సీన్మాలో నాయిక పద్మిని "ఓ బసంతీ పావన్ పాగల్' పాట రాతి కొండలపై, బండలపై అద్భుతంగా నృత్యం చేస్తూ పాడుతుంది. క్రింద లోయలో ఏదో ఒక నది ఆమె లాగే వొంపులు తిరుగుతూ పాములా ప్రవహిస్తుంది. ఆ కొండలు, బండలు ఎక్కడుంటాయని, అది ఏం నది అని చాలా మందిని అడిగాను. ఎవరూ చెప్పలేదు. చివరికి బిన్నీ రూబెన్ రాసిన రాజ్‌కపూర్ జీవిత కథ పుస్తకంలో అవి జబల్‌పూర్‌కు దగ్గరలోని "బేడేఘాట్"లో ఉన్న పాలరాతి కొండలనీ, క్రింద ప్రవహించేది నర్మదానది అని తెలిసింది. 65 సంవత్సరాలు దాటినంక నేను ఆ ప్రాంతానికి వెళ్లి ఆ పాలరాతి బండలపై కూచుని పద్మినిని, రాజ్‌కపూర్‌ను ఆ నృత్య దృశ్యీకరణను గుర్తు చేసుకున్నాను. క్రింద నర్మద ఉధృతంగ పారుతుంది. షూటింగ్ కోసం వారందరూ బస చేసిన గెస్ట్‌హౌజ్‌ను కూడా చూసాను. అప్పుడు ఆ రోజులలో అక్కడ వాచ్‌మెన్‌గా పనిచేసిన ఒక స్థానిక వృద్ధుడితో మాట్లాడి అతను చెప్పిన ఆ నాటి ముచ్చట్లన్నీ విన్నాను.

(తరువాయి వచ్చే సంచికలో)

-పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# ప్రజల చేతిలో ఆయుధం సైన్స్

మన దేశంలో 'నేషనల్ సైన్స్ డే' (ఎన్ఎస్‌డీ) 1987 ఫిబ్రవరి 28 నుంచి ప్రతి ఏడాదీ నిర్వహించుకుంటున్నాం. అదే రోజు మన భారత శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ తన పరిశోధనల్ని 'రామన్ ఎఫెక్ట్' పేరుతో 28 ఫిబ్రవరి 1928న ప్రతిపాదించారు. దీనికే ఆయనకు నోబెల్ బహుమతి వచ్చింది. ఇది భారత్‌కే కాదు మొత్తం ఆసియా ఖండానికే దక్కిన మొదటి నోబెల్ బహుమతి.

సైన్స్ డే పాఠశాలలకు, కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు మాత్రమే పరిమితం కాదు. అన్ని పౌర సంఘాల్లో దీన్ని ఘనంగా జరుపు కోవాలి. దేశ పౌరుల్లో ముఖ్యంగా బాల బాలికల్లో సైన్సుపట్ల ఆసక్తిని పెంచడానికి దీన్ని ఉపయోగించాలి. సైన్స్‌డే సంద ర్భంగా ఉపన్యాసాలు, ఊరేగింపులు, వైజ్ఞానిక ప్రదర్శనలు, సైన్స్ సంబంధిత పోటీలు నిర్వహించి ప్రజల్లో అవగాహనపెంచాలి.




మన విద్యా విధానంలో ఉన్న ప్రధాన లోపమేమంటే, క్లాస్ రూంలో సైన్స్ సూత్రాలు మాత్రమే చెబుతారు. అంతేగానీ, ఒక శాస్త్రవేత్త ఎన్ని ఒడిదుడుకులను ఎదుర్కొని ఆ పరిశోధనలు చేయగలిగాడన్నది మాత్రం సంక్షిప్తంగా నైనా చెప్పరు. ఈ ధోరణి మారాలి. ప్రపంచమంతా వైజ్ఞానికంగా ముందుకు దూసుకుపోతున్న తరుణంలో కొందరు మన దేశ పౌరులు మన ప్రభుత్వ పెద్దలు మూఢ నమ్మకాలకు పెద్ద పీట వేస్తున్నారు. దేశాన్ని మూడు వేల ఏళ్ళ నాటి అనాగరిక సమాజంలోకి లాక్కుపోతున్నారు. ఆ ప్రమాదంలోంచి దేశాన్ని రక్షించుకోవాలంటే దేశ పౌరులంతా వివేకం ప్రదర్శించాలి. సైన్సును ఒక వెన్నెముకగా చేసుకుని ప్రగతి పథంలోకి నడవాలి. మూఢత్వాన్ని వదిలి, చేతనత్వంలోకి రావాలంటే మనం మన రాజ్యాంగంలో రాసుకున్న 51ఏ (హెచ్) స్ఫూర్తిని నిలుపు కోవాలంటే, ప్రతి పౌరుడూ చిత్తశుద్ధితో పని చేయక తప్పదు. ఇప్పటి దేశ కాల పరిస్థితులను చూస్తుంటే, ఇక ఆ దిశలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచించి ఆచరించాల్సిన అవసరం వచ్చిందని అనిపిస్తోంది.

ఇప్పుడు ప్రజల చేతిలో ఉన్న ఆయుధం ప్రశ్న! ప్రశ్నలోంచి ఎదుగుతూ వచ్చిందే సైన్సు!! ఈ సైన్సు అంత ముఖ్యమైందిగా ఎందుకయ్యిందీ? అంటే చీకటిలోంచి వెలుగులోకి వెళ్ళాలంటే సైన్సే ఆసరా కాబట్టి. అనాగరికతనూ, మూర్ఖత్వాన్నీ వదిలి విశాల విశ్వంలో అత్యాధునిక మానవులుగా నిలబడాలంటే సైన్సు తప్ప మరో మార్గంలేదు. అన్యాయాల్ని, అబద్ధాల్ని, దుర్మార్గాల్ని ఛేదించాలంటే సైన్సు సహాయం తీసుకోక తప్పదు. అలాగే ఇప్పుడు ప్రభుత్వాల మూఢత్వం బద్దలు కొట్టాలన్నా, మనకున్నది ఒక్కటే పదునైన ఆయుధం అదే సైన్స్!

**సైన్స్ దే సందర్భంగా నిర్వహించు కోవాల్సిన కార్యక్రమాలు:**

- నిత్య జీవితంలో సైన్సు ప్రాముఖ్యతను గ్రహించే విధంగా కార్యక్రమాలు రూపొందించు కోవాలి.
- మానవాభ్యుదయానికి ఉపయోగపడే వైజ్ఞా నిక పథకాలకు రూపకల్పన చేసుకోవాలి.
- సమాజంలో వైజ్ఞానిక అవగాహన పెంచడానికి కృషి చేసిన, చేస్తున్నవారి అభిప్రాయాలు తెలుసుకుంటూ ఉండాలి. వాటికి ప్రాధాన్యత కల్పించాలి.

*(సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ డా॥ దేవరాజు మహారాజు అంతర్జాలం వ్యాసం)*

DECCAN
దక్కన్
సామాజిక, సాంస్కృతిక ఛానల్
CHANNEL




# హుజూర్‌నగర్ ఇనుపయుగపు సమాధి

## తెలంగాణలో ఉమ్మడి కుటుంబానికి పునాది

ఉమ్మడి కుటుంబం. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలోని బాగోగులపట్ల అవగాహన కల్పించటానికి ఒక సినిమా కూడా వచ్చింది. ఈ వ్యవస్థ బృహత్ భారతదేశమంతా దాదాపు 50 ఏళ్ల క్రితం వరకూ అమలులో ఉండేది. అధునాతన విద్య వల్ల దక్కిన ఉద్యోగావకాశాల వల్ల, ఉమ్మడి కుటుంబంలోని రెండో, మూడో తరం వాళ్లు, దేశ, విదేశాలకు తరలి వెళ్లటంతో, ఈ వ్యవస్థ తన అస్థితత్వాన్ని కోల్పోయింది. భార్యా, భర్త, పిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులకే పరిమితమైన చిన్న కుటుంబంగా విడిపోయింది. విశాల ప్రాంగణంలో సువిశాలంగా, ఎన్నో గదులతో, మండువా లోగిళ్లతో విలసిల్లిన ఉమ్మడి కుటుంబానికి చాలా చరిత్ర ఉంది. ఎక్కడిదాకో ఎందుకు, తెలంగాణలో, సూర్యాపేట జిల్లాలో మండల కేంద్రమైన హుజూర్‌నగర్‌లో ఇనుపయుగానికి (సా.శ.పూ.2000–500) చెందిన ఉమ్మడి కుటుంబ ఆనవాళ్లు లభించాయి.

హుజూర్‌నగర్‌కు ఈశాన్యం వైపున్న ఒక చిన్న కొండ సానువుల్లో 18 ఇనుప యుగపు గది సమాధులున్నాయి. సమీపంలో రెండు నీటి కుంటలున్నాయి. ఒక చిన్న లోయలా ఉన్న ఆ ప్రాంతంలో చుట్టూ నల్లరేగడి భూములన్నాయి. అప్పటి మానవులు జీవించటానికి అనువైన వనరుగా ఉపయోగపడినాయి. అక్కడున్న 18 సమాధుల్లో ఒక సమాధిని 1984లో రాష్ట్ర పురావస్తుశాఖలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డా. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తవ్వకాలు చేపట్టి ఆసక్తికర చారిత్రక విషయాలను వెల్లడించింది.

వివిధ సందర్భాల్లో, వివిధ కారణాలచేత మరణించిన వారిని, ఒకరి తరువాత ఒకరి చొప్పున ఆ గదుల్లో పాతిపెట్టారు. తొమ్మిది గదుల్లో.. మొదటి దానిలో కొన్ని ఎముకలు, నాపరాళ్లు గది ముందు భాగంలో, ఆహారం వదలటానికి ఒక రంధ్రం, రెండో గది, మూడు విభాగాలుగా విభజించబడింది. ఈ మూడింటిలో మూడు శవాలను పాతిపెట్టారు. ఎముకలతోపాటు పుర్రెలు నలుపు, నలుపుఎరుపు మట్టి పాత్రలున్నాయి. ఇందులో ఒక కళేబరం చిన్నపిల్లవానిది. మూడో గదిలో 3, నాలుగో గదిలో ఒకటి, ఐదో దానిలో ఒక నాగలికర్రు, కొన్ని ఇనుప పరికరాలు లభించాయి. ఇలా ముందుగా ఒకటి, తరువాత 3, ఆ తరువాత 5 గదులతో మొత్తం 9 మందిని ఒకే సమాధిలో పాతి పెట్టిన అరుదైన ఆధారంగా పురావస్తు పరిశోధకులు భావించారు. సా.శ.పూ. 2000–500 సం॥ల మధ్య కాలానికి చెందిన ఈ సమాధి, ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పునాదిగానే కాక, తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి.

–ఈమని శివనాగిరెడ్డి–స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# చరిత్ర గమనాన్ని మార్చిన డార్విన్

ఖగోళ భౌతిక శాస్త్రములో కోపర్నికస్ ప్రతిపాదించిన 'సూర్య కేంద్ర సిద్ధాంతానికి' ఎంత ప్రాముఖ్యత వుందో, అంతే ప్రాధాన్యత ఇంగ్లండ్‌కు చెందిన ప్రముఖ జీవశాస్త్రవేత్త డార్విన్ 'జీవ పరిణామ సిద్ధాంతానికి' ఉంది. 1809 ఫిబ్రవరి 12న జన్మించిన చార్లెస్ రాబర్ట్ డార్విన్ ఐదేళ్ల ప్రపంచయానం చేసి వివిధ వృక్ష జంతుజాతులను పరిశీలించి 1859లో 'ఆన్ ది ఆరిజన్ ఆఫ్ స్పీసీస్' (జీవజాతుల ఉత్పత్తి) అనే గ్రంథన్ని ప్రచురించాడు. ప్రకృతిలో జీవజాతులు వేటికవే ఏకకాలంలో రూపొందినట్లు ఎంతోకాలంగా నమ్ముతూ వస్తున్న ప్రజానీకానికి డార్విన్ సిద్ధాంతం కొత్తమార్గాన్ని చూపింది. మనుగడ కోసం పోరాటంలో భాగంగా వివిధ జీవజాతుల మధ్య సంఘర్షణ జరుగుతుందని, కొన్ని సందర్భాలలో ప్రకృతితో కూడా జీవజాతులు ఘర్షణ పడతాయని, సంఘర్షణలో నెగ్గినవే మనుగడ సాగించగలవని, జీవ వైవిధ్యం ప్రకృతి ప్రధాన లక్షణమని, వారసత్వం, పర్యావరణం రెండూ మనిషి నడతను ప్రభావితం చేస్తాయని డార్విన్ ప్రతిపాదించారు.



డార్విన్ సిద్ధాంతంతో పలువురు మతాధికారులు విభేదించారు. డార్విన్ ప్రచురించిన పుస్తకాలను నిషేధించారు. కార్ల్ మార్క్స్, ఆడమ్‌స్మిత్ వంటి ప్రముఖ ఆర్థికవేత్తలు తమ సిద్ధాంతాలతో ప్రపంచ గమనాన్ని మార్చినట్లే, డార్విన్ ఆలోచనలు కూడా ప్రజల ఆలోచనల్ని మార్చడంలో కీలకపాత్ర పోషించాయి. గ్రెగర్ మెండల్, హర్‌గోవింద్ ఖురానా వంటి శాస్త్రవేత్తలు జెనిటిక్ ఇంజనీరింగ్‌లో చేసిన పరిశోధనలకు వాలెస్, డార్విన్ ఆలోచనలు ఎంతగానో దోహదపడ్డాయి.




వాతావరణ పరిస్థితులకు 'అనుకూలనం' చెందటాన్ని పరిణా మంలో కీలకంగా డార్విన్ భావిస్తే, మెండల్ పరిశోధనలు జీవుల లక్షణాలు ఒక తరం నుండి మరో తరానికి ఎలా బదిలీ అవుతాయో చూపించాడు. ఆ అనువంశిక లక్షణాలే జీవులు 'అనుకూలనం' చెందటంలో కీలక పాత్ర పోషిస్తాయని బలమైన రుజువులు చూపాడు. జీవుల్లో మార్పులకు 'ఉత్పరివర్తనాలు' (మ్యుటేషన్స్) కారణమని చెప్పాడు. మెండల్ కాలానికి కూడా ఉత్పరివర్తనం చెందేవాటి భౌతిక రూపం తెలియదు. అందుకే మెండల్ వాటిని 'కారకాలు'గా పేర్కొన్నాడు. ఆధునిక జీవశాస్త్రం, ముఖ్యంగా జన్యువదార్థం డీఎన్ఏ ఆవిష్కరణ తర్వాత వీటి వెనుక దాగిఉన్న రహస్యం 'జన్యువులు' (జీన్స్) అని తేల్చింది. నాటి నుండి నేటి వరకు వెలుగు చూస్తున్న నూతన సమాచారం డార్విన్ జీవ పరిణామ సిద్ధాంత ఔన్నత్యాన్నీ, సత్యాన్నీ ఆవిష్కరిస్తూనే ఉంది.

'జాతుల ఉత్పత్తి' పుస్తకం ప్రచురితమై 167 ఏళ్లు అయింది. సృష్టి వాదానికి ముగింపు పలికి సరికొత్త ఆలోచనలకు డార్విన్ తెరతీశాడు. జీవశాస్త్రంలో డార్విన్ 'జీవకణ సిద్ధాంతం', భౌతిక శాస్త్రంలో ఐన్‌స్టీన్ 'సాపేక్ష సిద్ధాంతం', ఖగోళ శాస్త్రంలో కోపర్నికస్ 'సూర్య కేంద్ర సిద్ధాంతం', మానసిక శాస్త్రంలో సిగ్మెంట్ ఫ్రాయిడ్ 'మనో విశ్లేషణ సిద్ధాంతాలు' ఆధునిక సైన్స్ మరింత పురోగమించడానికి ఎంతగానో దోహదపడ్డాయి. డార్విన్ ఆలోచనలను 166 ఏళ్ల క్రితం ఇంగ్లండ్‌లో మతవాదులు వ్యతిరేకించినట్లే, నేడు కొందరు మతోన్మాదులు కూడా తప్పుపట్టే ప్రయత్నం చేస్తున్నారు. అభ్యుదయ వాదులు, మానవతావాదులు ఉమ్మడిగా డార్విన్ ఆలోచనలను మరింత ముందుకు తీసుకెళ్ళాల్సిన అవసరం వుంది.

*(ఫిబ్రవరి 12న డార్విన్ జయంతి సందర్భంగా..)*

– సత్య ప్రసన్న
m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

# సైన్సు వైయక్తికం... టెక్నాలజీ సామూహికం

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో రామేశ్వరం ప్రాంతంలో ఓ కుర్రాడు వార్తాపత్రికలు ఇంటింటికి చేరవేసేవాడు. అది సముద్రతీర ప్రాంతం కనుక యుద్ధ విమానాలు తరచు కనబడేవి, ఆ విషయాలు పత్రికల్లో కూడా వుండేవి. హిట్లర్ లాగా దేశాలను వినాశనం చెయ్యాలనే ఆలోచన ఆ కుర్రాడికి రాలేదు, కానీ గాలిలో ఎగరగలిగే యంత్రాలపై ఆసక్తి అమితంగా కలిగింది! సోదరి గాజులు కుదువ పెట్టి కాలేజీలో చేరారు, చేరిన తర్వాత తెలిసింది ఆ కోర్సు తన ఆసక్తికి సంబంధించింది కాదని. ఆ యువకుడే తర్వాతి కాలంలో మన దేశ రాష్ట్రపతి అయిన శాస్త్రవేత్త ఎ.పి.జె. అబ్దుల్ కలాం! ఆయన చేరిన కోర్సు బి.యస్సీ., కానీ చేరాల్సిన కోర్సు ఇంజనీరింగు!

సైన్సూ టెక్నాలజీ అనే పదాలను తరచు కలిపి వాడుతూంటాం. రెండూ ఒకటే అని కూడా భావిస్తూంటాం. ఈ రెండు జంటపదాలు బహుళ ప్రాచుర్యం పొంది తేడాలు పూర్తిగా మరిచిపోయే పరిస్థితి ఏర్పడింది. బి.ఇ. కోర్సు ఇప్పుడు బి.టెక్.గా మారిపోయింది. అంతకు ముందు సైన్సులో అంతర్భాగంగా ఇంజనీరింగును లేదా టెక్నాలజీని భావించేవారం. కొన్ని దశాబ్దాల క్రితం బి.ఎస్సీ (ఇంజనీరింగ్), ఎమ్మెస్సీ (టెక్) వంటి కోర్సులు వుండేవి. క్రమంగా ఇవన్నీ అదృశ్యమైపోయి ఇప్పుడు కేవలం బి.టెక్., ఎమ్.టెక్. మాత్రమే మిగిలాయి.



ఎ.పి.జె. అబ్దుల్ కలాం

నిజానికి సైన్సూ టెక్నాలజీ, ఈ రెండింటి మధ్య చాలా తేడా వుంది. సైన్సు అనేది ప్రధానంగా పరిశీలనల ఆధారంగా రూపుదిద్దుకుంటుంది. మరోరకంగా చెప్పాలంటే ఒక క్రమపద్ధతిలో కొత్త జ్ఞానాన్ని పరిశీలనల ద్వారా, ప్రయోగాల ద్వారా గడించడమే. ఈ ప్రక్రియలో ఎప్పటికప్పుడు కొత్త లోతుల కోసం అన్వేషణ వుంటుంది. ప్రకృతిని పరిశీలించి ఆయా పరిస్థితులను గమనించి విశ్లేషించుకుని సూత్రీకరణలు చేసుకుంటాం. ఆ ప్రతిపాదనల ఆధారంగా ఎటువంటి ఫలితాలు వుండవచ్చునో అనే అంచనాల కోసం మరింత అధ్యయనమూ వుంటుంది. కనుక సైన్సును మౌలిక శాస్త్రంగా పరిగణిస్తాం. ఇది పరిశోధన కోసం సాగే పరిశోధన వంటిది. తక్షణలాభాలుండవు.

సైన్సు ఫలితంగా టెక్నాలజీ రూపుదిద్దుకుంటుంది. గడించిన శాస్త్ర విజ్ఞానాన్ని మన అవసరాల మేరకు అనువర్తింప చేసుకోవడమే టెక్నాలజీ! అంటే సైన్సు ప్రతిపాదించిన నియమాలు, సూత్రాలు ఆధారంగా కొత్త ఫలితాలు లేదా ఉత్పత్తులు తయారు చేసుకోవడమే టెక్నాలజీ రంగం. సైన్సు కారణంగా దుష్పరిణామాలు వుండవు, కానీ టెక్నాలజీలో దుష్ఫలితాలు కూడా ఎన్నో వుండే అవకాశం వుంది. అలాగే మౌలిక సూత్రం ఒకటే అయినా వినియోగించుకునే విధానం, ఉత్పత్తి లేదా తయారయ్యే పద్ధతీ మారుతూ వుండవచ్చు, మరింత వేగంగా, నైపుణ్యంతో ఉత్పత్తులు సాధ్యం కావచ్చు. సైన్సుకు లాభం కలిగే అవకాశం లేదు గానీ, టెక్నాలజీతో ప్రయోజనాలు చాలా వున్నాయి. కనుకనే వాణిజ్యవేత్తలకు టెక్నాలజీ అంటే తగని మక్కువ, తగ్గని ఆకర్షణ.

ఈ విషయాలనే మరోరకంగా చెప్పాలంటే మన ఇంటి ప్లాను సిద్ధం చేసుకునే విధానం గురించి ఆలోచించండి. మనకున్న స్థలమెంత? మనకున్న అవసరాలు ఏమిటి? మనకున్న ఆర్థిక స్తోమత ఎంత?... అనే పరిమితులు ఆధారంగా భవనం ఎంత వైశాల్యం వుంటుంది? భవనం వెలుపల తోట ఎంత వుంటుంది? భవనం దేంతో నిర్మిస్తాం? ఎన్ని అంతస్తులుంటాయి? ఎన్ని గదులుంటాయి? ఏఏ గదులుంటాయి?... ఇలాంటి ప్రణాళికను సైన్సుగా పరిగణించవచ్చు అని ప్రఖ్యాత శాస్త్రవేత్త, బెంగుళూరు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్. నరసింహయ్య 'సైన్సు-మానవత' అనే వ్యాసంలో వివరిస్తారు. తర్వాతి దశలో భవనాన్ని నిర్మిస్తాం. ఇలా భవనం నిర్మించే ప్రక్రియను 'టెక్నాలజీ'గా గణిస్తాం. ఉదాహరణకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ, బాటనీ, సైకాలజీ వంటి వాటిని వివిధ విభాగాలుగా వున్న సైన్సు శాఖలుగా పరిగణిస్తాం. టెక్నాలజీ అంటే స్థూలంగా మనం వాడే టెక్నిక్కులు, నైపుణ్యాలు, ప్రక్రియలు, ప్రణాళికలు, ఉత్పత్తులు మొదలైన వాటి సామూహిక ఫలితం. మనం చిన్న తరగతులలో యంత్రలాభం అనే మాట

తెలుసుకున్నాం. ఆ యంత్రలాభం అనేది మరోరకంగా టెక్నాలజీ ఫలితం అని చెప్పవచ్చు.

సైన్సు టెక్నాలజీ మధ్య తేడాలను చాలా రకాలుగా వివరించవచ్చు. సైన్సు అంటే తెలుసుకోవడమని, టెక్నాలజీ అంటే పనిచెయ్యడమని కూడా అర్థం చేసుకోవచ్చు! ఈ రెండింటి మధ్య తేడాలని అబ్దుల్ కలాం సరికొత్తగా తన ఆత్మకథ ఆన్ 'వింగ్స్ ఆఫ్ ది ఫైర్' పుస్తకంలో చెప్పారు. ఆయన దృష్టిలో సైన్సు అనేది వైయక్తిక ప్రయత్నం కాగా, టెక్నాలజీ అనేది సామూహిక ప్రయత్నం లేదా టీమ్ వర్క్. చమత్కారంగా సైన్స్ ను శివాలయంతోను, టెక్నాలజీని వైష్ణవాలయం గానూ పోల్చవచ్చు. వీటిని గురించి వివరించాల్సిన అవసరం లేదనుకుంటా.



సి.వి. రామన్

1897లో సర్ జె.జె. థమ్సన్ ఎలక్ట్రాన్‌ను కనుగొన్నారు. అప్పటికి ఆ మాట కూడా లేదు. ఆ ఆవిష్కరణ వల్ల పెద్ద ప్రయోజనం వుండదేమో అని కూడా ఆయన భావించారు. కానీ, తరువాత, తరువాత ఎలక్ట్రాన్ అనేది ఎంత కీలకమైనదో, 'ఎలక్ట్రానిక్స్' అనే విభాగం ఎంత ప్రాధాన్యత గడించిందో ఇప్పుడు వేరుగా చెప్పనక్కరలేదు. వైజ్ఞానిక చరిత్రలో ఇలాంటి దృష్టాంతాలను మనం చాలా చూడవచ్చు. అయితే టెక్నాలజీని బలం పెంచుకోవడానికో, బెదిరించడానికో, నాశనం చేయడానికో వినియోగించడం వల్లనే సమస్యలన్నీ చుట్టుముడతాయి. సైన్యాన్ని సమీకరించుకున్నట్టుగానే ఆధునిక కాలంలో సంపన్న దేశాలు వినాశనానికి పనికివచ్చే టెక్నాలజీ ఆధారిత ఆయుధాలను పోగు చేసుకుని చాలా ఇతర దేశాలను భయపెడుతున్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధంలో అణ్వస్త్రాల కారణంగా పెను వినాశనం జరగడం, వస్తుసంపద నాశనం కావడం, భూమీ, నీరూ, ఆకాశం వంటివి కలుషితం కావడం అంతకు మించి ఆ దుష్ప్రభావాలు తరువాతి కాలంలో జన్మించిన శిశువులపై వుండడం మనకు తెలుసు. నిజానికి టెక్నాలజీ కల్పించిన అనర్థం ఇంకొన్ని రకాలుగా కూడా మనం గమనించవచ్చు. టెక్నాలజీ దుర్వినియోగం కారణంగా చాలా రకాల అవశేషాలు, కలుషితాలు ఆ సమాజానికి ప్రతిబంధకమే కాదు, గుదిబండగా కూడా మారాయి. రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా టెక్నాలజీ పట్ల విశేషమైన ఆసక్తి కలిగింది, పెరిగింది. తత్కారణంగానే సైన్సు జర్నలిజం కూడా అభివృద్ధి చెందింది. తరవాత రెండు మూడు దశాబ్దాలకు ప్రపంచ వ్యాప్తంగా పరిసరాలపై ఆసక్తి, కాలుష్యం పట్ల భయం పెరగడం వల్ల పర్యావరణ దృష్టి, పర్యావరణ రక్షణ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. వాటి ఫలితంగానే 1972 జూన్ 5వ తేదీన ప్రపంచ దేశాలు తొలిసారి ఐక్యరాజ్యసమితి వేదికగా స్వీడన్ లోని స్టాక్ హోమ్ నగరంలో పర్యావరణ సదస్సును జరుపుకున్నాయి. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని అప్పటినుంచి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5వ తేదీ జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

అదే సమయంలో హిరోషిమా డే, నాగసాకి డే అని శాంతి కోసం సైన్స్, సామరస్యం కోసం సైన్స్ అనే భావనలు నినాదాలుగా మారాయి.

సైన్సుపట్ల అవగాహన కల్పించడానికి 1986లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ (ఎన్.సి.ఎఫ్.ఇ.సి.) విజ్ఞానశాస్త్ర దినోత్సవాన్ని జరుపుకోవలసి వుందని అప్పటి కేంద్ర ప్రభుత్వాన్ని సూచిస్తూ ప్రతిపాదన చేసింది. తత్ఫలితంగా 'రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరించబడిన ఫిబ్రవరి 28 (1928) తేదీని 1987 నుంచి ప్రతి సంవత్సరం జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవం (నేషనల్ సైన్స్ డే) గా జరుపుకుంటున్నాం. అందువల్లనే సైన్స్ అవగాహన పెంపొందించే దిశలో ప్రయోగశాలలకు ప్రజలను ఆహ్వానించడం, సైన్సుతో ముడిపడిన విషయాలు వివరించడంతోపాటు పాఠశాల కళాశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతోంది. 1988 నుంచి నేషనల్ సైన్స్ డే పెద్ద ఎత్తున జరగడం మొదలైంది, ఆ సంవత్సరమే శాస్త్రవేత్త సి.వి.రామన్ శత జయంతి సంవత్సరం కావడం విశేషం.

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e : venunagasuri@gmail.com



# కనువిప్పు కలిగించే (ఆంధ్రా మాగ్నా కర్తా) శాసనం

ప్రాచీన సమాజాల జీవన విధానాన్ని రాజకీయాలను మరియు నమ్మకాలను గుర్తు చేసేందుకు ఉపయోగపడే శాశ్వత ఆయుధాలే శిలా శాసనాలు, తాళపత్రి గ్రంథాలు, పుస్తకాలు, రాగి పత్రాలు మరియు దాక్యుమెంట్స్ మొదలైనవి, చారిత్రక ఆధారాలు, రాజకీయ చరిత్ర విశేషాలు, పరిపాలన ఉత్తర్వులు, సామాజిక స్థితులు, ఆర్థిక పరిస్థితులు, మతపరమైన విషయాలు, సాంస్కృతిక విషయాలు, భాష గురించి, లిపి గురించి స్మారక చిహ్నాల గురించి, ప్రాంతీయ చరిత్ర గురించి, రాజుల పాలన విధానం గురించి, యుద్ధాల గురించి, బిరుదుల గురించి మరియు కరువు కాటకాలు గురించి శాసనాలు తెలియజేస్తాయి.

పైన తెలిపిన శాసనాలలో పరిపాలన ఉత్తర్వుల గురించి పన్నుల గురించి కొన్ని శాసనాలను గమనిద్దాం.

**1) అశోకుని లుంబిని శాసనం**

(కాలము తెలుపని) ఈ శాసనము నందు గౌతమ బుద్ధుడు జన్మించిన లుంబిని గ్రామస్తులకు, Ashoka The Great పన్నుల నుండి గ్రామాన్ని విముక్తిని కలిగించాడు.

**2) కళింగ మహారాజు ఖారవేల శాసనం**

ఒడిస్సా లోని భువనేశ్వర్ వద్ద గల ఉదయగిరి గుహ నందలి శాసనాన్ని గమనిస్తే ప్రజా సంక్షేమ పన్నులు మరియు పన్నుల భారం తాత్కాలిక సమయం తగ్గింపు వంటివి గమనించవచ్చు.

**3) గౌతమీపుత్ర శాతకర్ణి మహారాష్ట్ర నందలి నాసిక్ శాసనం**

ఈ శాసనమును గనుక గమనిస్తే ధర్మ చర్య మరియు విద్య కోసం పనిచేసే బౌద్ధ సంస్థలపై పన్ను మినహాయింపు ఇచ్చినట్లు తెలుస్తుంది అలాగే ఆ శాసనం నందు రాజ్యాధికారం సామాజిక సంక్షేమం మరియు విజయాలు సైతం తెలుపబడ్డాయి.

ఇలాంటి పన్నుల విషయంలో జరిగిన పోరాటాల చరిత్ర గురించి తెలుసుకుందాము. హెన్రీII (1154-1189) మొదటి కుమారుడైన రిచర్డ్ అనంతరం (1189-1199) రెండవ కుమారుడైన కింగ్ జాన్ ఇంగ్లాండును (1199-1206) పరిపాలించాడు. కింగ్ జాన్ పరిపాలనలో అధిక పన్నులతో పాటు అన్యాయ పాలన కొనసాగించారు. దానివలన ప్రజా హక్కుల క్షీణిత కొనసాగించబడింది. అధిక పన్నుల భారం భరించలేక అనేకమంది భూస్వాములు దూరమయ్యారు. అప్పటిదాకా ఫ్రాన్స్ సమీపమున ఉన్న నార్మండ్ పై కింగ్ జాన్ పట్టు కోల్పోయారు. ఆ సమయంలో కింగ్ జాన్ కు ఎవ్వరూ సహకరించలేదు. అది గమనించిన ఫ్రెంచ్ రాజు ఫిలిప్II, ఇంగ్లాండ్ రాజు జాన్ మీద యుద్ధం ప్రకటించి నార్మండ్ ను స్వాధీన పరుచుకున్నాడు. King John దీనివలన, ఇంగ్లాండులో భూస్వాములతో పాటు ప్రజలకు మరింత విశ్వాసంను కోల్పోయేటట్లు చేసుకున్నాడు. అలాంటి సమయంలో కింగ్ జాన్, 1215వ సంవత్సరం, కింగ్ జాన్ భూ స్వాములపై మరియు ప్రజలపై పన్నుల అధికంగా వేశాడు. దాన్ని వ్యతిరేకిస్తూ భూస్వాములు ప్రజా ఉద్యమాన్ని నడిపారు. రాజు సైతం చట్ట పరిధిలో నడుచుకోవాలన్న ప్రధాన ఉద్దేశంతోనూ మరియు ఇష్టానుసారంగా పన్నులు విధించరాదన్న సంకల్పంతో ఉద్యమించారు. ఆ ఒత్తిడిని తట్టుకోలేక కింగ్ జాన్ మధ్యవర్తిత్వానికి ఒప్పుకున్నాడు. ఆర్చ్ బిషప్ స్టీఫెన్ లాంగ్టన్ మధ్యవర్తిత్వ వహించి భూస్వాములకు మరియు కింగ్ జానుకు ఒప్పందాన్ని కుదిర్చాడు. ఈ ఒప్పందార పత్రాన్ని మాగ్నా కార్తా (Magna Carta) అంటారు.




తర్వాత పలు దేశాలకు Magna Cart అనేది స్ఫూర్తిదాయకమై మరియు దిక్సూచిగా మారి అనేక దేశాధిపతులను తలవొగ్గేట్లు చేసింది.

Magna carta కన్నా గొప్ప రీతిలో ఆంధ్రప్రదేశ్ లోని అవిభక్త అనంతపురం జిల్లాలోని కనగానపల్లి గ్రామంలో కనువిప్పు కలిగించే అద్భుతమైన విజయనగర రాజుల కాలమనాటి శాసనం మరుగున పడిపోయింది. వివరాల్లోకి వెళ్తే కనగానపల్లికి ఉత్తరాన మడకశిర తాలూకు గ్రామాలు, తూర్పున ధర్మవరం తాలూకు గ్రామాలు, పడమర పెనుగొండ వెళ్లే మార్గంలోని గ్రామాలు దక్షిణాన తాడిపత్రికి సంబంధించిన గ్రామాలు కలిపి 32 గ్రామాలు ఉన్నాయి.

గ్రామాలలో గౌడ /కరణం/ కవాలు అధికారం చలా ఇస్తూ ఉంటారు. వీరిని పాలెగాళ్లు లేదా దండ నాయకులు పర్యవేక్షిస్తుంటారు. వారి పైన కేంద్ర మంత్రివర్గం కలిగి ఉంటుంది. ఆ కేంద్ర మంత్రివర్గ ఆలోచనలతో రాజు సామ్రాజ్యాన్ని

పరిపాలిస్తుంటాడు. ఈ సమయంలో కృష్ణదేవరాయలు సోదరుడు, అచ్యుత దేవరాయలు విజయనగర సామ్రాధీశుడుగా ఉండేవాడు. కృష్ణదేవరాయులు 1509-1529 C.E, పరిపాలించగా, అచ్యుతదేవరాయలు 15 29- 15 42 C.E, వరకు 13 సంవత్సరంలు జనరంజకంగా పాలించాడు. గ్రామాభివృద్ధికి రైతాంగానికి మరియు దేవాలయ నిర్మాణాలకు గ్రామంలోని పంచాణము వారు ఎంతగానో ఉపయోగపడేవారు. కమ్మరి, కుమ్మరి, కంసాలి, వడ్రంగి మరియు శిల్పిని పంచాణము వారు అని అంటారు. ధాన్యాన్ని దాచుకునే పాత్రలు మట్టి పాత్రలు కుమ్మరి తయారు చేయగా రైతాంగానికి సంబంధించిన ఇనుప పరికరాలు కమ్మరి తయారు చేసేవాడు గృహోపకరణ వస్తువులను వడ్రంగి తయారు చేయగా అలంకరణ వస్తువులను కంసాలి తయారు చేసేవాడు ప్రత్యేకించి దేవాలయం నిర్మాణాల యందు శిల్పి ప్రభావం అధికంగా ఉంటుందనేది జగమెరిగిన సత్యమే అయితే ఈ వృత్తి నైపుణ్యం కలిగిన వీరందరి పైన మరియు వెట్టి వారి పైన సైతం ఊహించని విధంగా పన్నులు వేశారు కనగానిపల్లి పాలెగాడు. మరియు పన్నులు వసూలు చేయమని గ్రామ అధికారులకు ఆదేశించాడు. పంచాననం వారు మరియు వెట్టివారు పన్నులు రద్దు చేయమని ఎంతగానో వేడుకొన్నారు అయితే వారి విన్నపాన్ని కనికరించకపోగా కర్కశంతో ప్రవర్తించారు గ్రామ అధికారులు.



*"వరమివ్వని వేల్పులకును*
*మరీ మరీ మొక్కినను మన్నింపరుగా*
*పరమెరుగని మొరకులకును*
*సరసములాడినను వారు సమ్మతింపరుగా సుమతి."*

విసుగు చెందిన 32 గ్రామాల పంచాననం వారు మరియు వెట్టి వారు అందరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుని పాకాల సీమ, కుందుర్తి సీమ లాంటి ప్రదేశాలకు తమ సంసారాలను బండ్ల నందు ఎక్కించుకొని వలసకు వెళ్లారు. అంతే తిరిగి రాలేదు. ఒక్కసారి 32 గ్రామాల వృత్తి నైపుణ్యముగల పంచాననం వారు వెళ్ళిపోగానే కనగానపల్లి రైతుల పరిస్థితి అతలాకుతలమైంది. రైతులు గ్రామ అధికారుల మీద తీవ్ర ఒత్తిడిని తీసుకొని వచ్చారు. వారిని గ్రామ అధికారులు మరియు పాలెగాడు సైతం నియంత్రించలేక పోయారు. నెలలు గడిచాయి, అలజడి తీవ్రత ఎక్కువైంది మరియు రైతుల ఒత్తిడి ఎక్కువైంది. చిట్ట చివరకు విజయనగర సంస్థానా ధీశుడైన అచ్యుత దేవరాయలకు ఈ విషయం అంతా తెలిసింది.

సమస్య తీవ్రతను గుర్తించి తన కేంద్ర మంత్రివర్గముతో చర్చించి అచ్యుత దేవరాయలు చక్కటి నిర్ణయము తీసుకొని కనగానపల్లి దండనాయకుడైన వాకిటి తిమ్మప్పకు ఆదేశాలు పంపించారు. రాజు ఆదేశాలను శిరసావహిస్తూ తిమ్మప్ప నాయకుడు గ్రామ రెడ్లు, కరణాలు మరియు అధికారులైనటువంటి ఈశ్వరయ్య భూమిరెడ్డి కనగానపల్లి రెడ్డి, చెన్నమ రెడ్డి కరణం హెరీంనయ్యా పర్వత రాజు బసవయ్య అయ్యవరపు నాగయ్య మొదలైన 32 గ్రామాల అధికారులను పిలిపించి మరియు పంచాననం పెద్దలను పిలిపించి జరిగిన తప్పును ఒప్పుకుని పంచాణం వారిపై విధించిన పన్నులను రద్దు చేయించారు. జరిగిన తప్పులకు క్షమాపణలు తెలియజేసి వారికి రాజుగారి ప్రమాణ పత్రాన్ని అందించి వారందరినీ వారి గ్రామాలకు తిరిగి రావలసిందిగా కోరడం జరిగినది. రాజాజ్ఞకు లోబడి పాలె గాడు మరియు గ్రామ అధికారులు భవిష్యత్తులో, మరెప్పుడూ పంచాణం వారిపై అధిక పన్నులు విధించలేదు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యంగా కనగానపల్లిలో నిలిచింది ఇంగ్లాండులో Mega Cart లాంటి శాసనము. ఇది శాలివాహన శకం 1455 విజయ నామ సంవత్సరం వైశాఖ శుద్ధ త్రయోదశి అనగా క్రీస్తు శకం 1533 సంవత్సరం మే 5వ తేదీన ఒడంబడికకు చిహ్నంగా నిలిచింది ఈ శాసనం. ఆ తర్వాత మే ఒకటి 1986 ప్రపంచ కార్మిక దినోత్సవానికి నాంది పలికింది. కనగానపల్లి నందు జరిగిన పన్నుల పోరాటంలో ఒక్క రక్తపు చుక్క చిందించకుండా వృత్తి నైపుణ్యం కలిగిన పంచాననం వారు మరియు వెట్టివారు సైతం తమ నిస్సహాయతను నిరసనను చక్కగా ప్రదర్శించి రాజు దృష్టికి తీసుకెళ్లి దళారుల లాంటి గ్రామాధికారుల వంచేట్టు చేశారు. అయితే ఇంత గొప్ప శాసనానికి సరైన రక్షణ లేదు. ఈ శాసనాన్ని రక్షించ వలసినటువంటి బాధ్యత archaeological డిపార్ట్‌మెంట్ వారు తీసుకోవాలని, మరింత పరిశోధనలు యూనివర్సిటీ వారు చరిత్ర పరిశోధకులు జరపాలని దీనిని భారత Magna Cartగా గుర్తించాలని లేదా కనీసం ఆంధ్ర Magna Carta గా గుర్తించాలని ముక్త కంఠముతో అందరూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అంతేకాదు మే డే (మే డే)ను ఏ రకంగా జరుపుతారో, అదేవిధంగా వృత్తి నైపుణ్య దినముగా మే15వ తేదీని గుర్తించాలని మరియు పర్యాటక రంగం అభివృద్ధి చేయాలని అందరూ సవినయంగా కోరుకుంటున్నారు.

-డా|| జి.యస్.రామయ్య
INTACH సభ్యులు - కర్నూలు జిల్లా చాప్టర్,
ఆంధ్రప్రదేశ్, m : 898 555 0007




# కనుల నిండుగా చరిత్ర పండుగ

## 'కొత్త తెలంగాణ చరిత్ర బృందం' పునర్దర్శనం

చరిత్రను కేవలం పుస్తకాల్లోని పాఠంలా కాకుండా, ఒక పండుగలా జరుపుకోగలమా? రాబోయే తరానికి మన మూలాలను ఇష్టంగా, అర్థమయ్యే రీతిలో చెప్పగలమా? ఎటువంటి లాభాపేక్ష లేకుండా, ప్రాచీన ఆనవాళ్లను వెతకడం, కాపాడటాన్ని ఒక యజ్ఞంలా చేసే బృందాన్ని తయారుచేయగలమా? ఈ ప్రశ్నలన్నింటికీ 'అవును, ఇది సాధ్యమే' అని నిరూపిస్తున్నారు శ్రీరామోజు హరగోపాల్. ఆయన నేతృత్వంలోని 'కొత్త తెలంగాణ చరిత్ర బృందం' తన నిరంతర పరిశోధనలతో తెలంగాణ చరిత్రను సరికొత్తగా ఆవిష్కరిస్తోంది.

### ఒక నిరంతర పరిశోధనా యజ్ఞం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నుంచే, ఇక్కడి చరిత్ర మనకు తెలిసిన దానికన్నా మరెంతో లోతైనదని, విశిష్టమైనదని నమ్మిన ఒక విశ్రాంత ఉపాధ్యాయుడు తన మిత్రబృందంతో కలిసి మొదలుపెట్టిన ప్రయాణం ఇది. ఆదిమానవుడి రాతి చిత్రాల నుంచి ఆధునిక శిల్పకళా రీతుల వరకు, భూమి పొరల నిర్మాణం నుంచి సాహిత్యపు సారం వరకు ఈ బృందం అధ్యయనం చేస్తోంది. కేవలం గదులకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించి ఆధారాలను సేకరించడం వీరి ప్రత్యేకత.

ఇటీవల జనవరి 10వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా 'తెలంగాణ పునర్దర్శనం' పేరిట రెండవ చరిత్ర సదస్సును అత్యంత వైభవంగా నిర్వహించారు. కాలేజీ విద్యార్థుల నుంచి తలపండిన విద్వాంసుల వరకు, వివిధ వయసుల వారి అనుభవాలను రంగరించి 40 పరిశోధనా పత్రాలను ఈ సదస్సులో సమర్పించారు.

### సామాన్యుల నుంచి పరిశోధకుల వరకు

చరిత్రను చదివించడమే ఒక సవాలుగా మారిన నేటి కాలంలో, సామాజిక మాధ్యమాలు, పత్రికా కథనాల ద్వారా ఈ బృందం చరిత్రను జనావళికి చేరువ చేసింది. వివిధ ప్రాంతాల్లోని ఔత్సాహిక పరిశోధకులను ఏకం చేసి, వారి వారి ప్రాంతాల్లోని చారిత్రక విశేషాలను వెలుగులోకి తెచ్చింది. మొదటి సదస్సులో వెలువడిన పరిశోధనా పత్రాలను 'అస్మక' అనే సంకలనంగా తీసుకురావడం కొత్త తెలంగాణ చరిత్ర బృందం కృషికి ఒక నిదర్శనం.

### సదస్సులో ప్రముఖుల అభిప్రాయాలు:

ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు బృందం చేస్తున్న కృషిని కొనియాడారు:

**డాక్టర్ కూతాడి అర్జునరావు (తెలంగాణ వారసత్వ శాఖ సంచాలకులు):**

"ప్రభుత్వాలు చేయాల్సిన పనులను ఒక స్వచ్ఛంద సంస్థ బాధ్యతగా తీసుకోవడం అభినందనీయం. భవిష్యత్తులో ఇలాంటి సదస్సులకు ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలను వినియోగించుకోవచ్చు, మా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుంది."

**డాక్టర్ కుర్రా జితేంద్రబాబు (చరిత్రకారుడు):**

గత 15-20 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ, పత్రికలు, సోషల్ మీడియా ద్వారా చరిత్రను విశ్లేషించడంలో హరగోపాల్ టీమ్ వెలకట్టలేని సేవ చేస్తోందని పేర్కొన్నారు.

**దామరాజు సూర్యకుమార్ (శాసన పరిష్కర్త):**

వేదికకు తెలంగాణ పురావస్తు శాఖ తొలి సూపరింటెండెంట్ గులాం యజ్దానీ పేరు పెట్టడాన్ని ఆయన ప్రశంసించారు. బి.ఎన్. శాస్త్రి గారు ప్రారంభించిన శాసన పరిష్కరణ కృషి కొనసాగించడం, దేవాలయ నిర్మాణ రీతులపై జరుగుతున్న చర్చ వివరణ పరిశోధనలను గుర్తుచేశారు.







**విరువంటి గోపాలకృష్ణ (వయోవృద్ధ చరిత్రకారుడు):**

తెలంగాణ చరిత్రను వెలికితీయడంలో శాసనాల పాత్ర అమూల్యమని, ఈ విషయంలో హరగోపాల్ చొరవ అద్భుతమని కొనియాడారు.

**మణి కొండ వేదకుమార్ (ఇంటాక్ సభ్యులు):**

200 మంది సభ్యులతో సాగుతున్న ఈ ప్రయాణం గొప్పదని, ముఖ్యంగా మూసీ నది పరివాహక ప్రాంతాల్లోని చారిత్రక వాస్తవాలపై మరింత దృష్టి సారించాలని సూచించారు.

**జయధీర్ తిరుమలరావు (ఆధ్యకళ):**

"చరిత్ర అంటే సామాన్యులు ఉండాలి. గిరిజన తెగల అలవాట్లు, మౌఖిక చరిత్రను కూడా ఇందులో భాగం చేయాలి" అని అభిలషించారు.

**డాక్టర్ బండి మురళీధర రెడ్డి - డాక్టర్ చకిలం వేణుగోపాలరావు:**

నివేదికల రూపంలో ఉన్న సమాచారాన్ని సాధికారిక పరిశోధనా ప్రతులుగా అచ్చు వేయాలని, ప్రతి ఏటా ఇలాంటి సదస్సులు జరగాలని ఆకాంక్షించారు. వేదికకు డైనోసార్ల పరిశోధకుడు పొన్నాల యాదగిరి పేరు పెట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

**ఎస్.ఎస్. రంగాచార్యులు (ఆర్కియాలజీ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్):**

నిజాం కాలం నాటి ఆర్కియాలజీ శాఖ కృషిని గుర్తుచేస్తూ, ప్రస్తుత కాలంలో ప్రభుత్వ శాఖల కంటే మిన్నగా ఈ బృందం స్వచ్ఛందంగా పనిచేస్తోందని ప్రశంసించారు.

**సదస్సు ముగింపు - ఒక సంకల్పం**

ఈ సదస్సులో డాక్టర్ కొండా శ్రీనివాసులు, డాక్టర్ బద్దెల రామచంద్రారెడ్డి వంటి ప్రముఖులు పరిశోధనల్లో ఉండాల్సిన లోతును, జర్నల్స్‌లో వీటిని ప్రచురించాల్సిన ఆవశ్యకతను వివరించారు.

**సభలో పాల్గొన్న ప్రముఖులు**

సుద్దాల అశోక్ తేజ, మట్టిమనిషి పాండురంగారావు, సుమనస్పతిరెడ్డి, సంగనభట్ల నరసయ్య సదస్సు కన్వీనర్‌గా డాక్టర్ భైరోజు శ్యాంసుందర్ కార్యక్రమ నిర్వహణ చేయగా, తొలి సభ అధ్యక్షుడిగా బి.వి.భద్రగిరీశ్, సదస్సు ఉద్దేశ్యాన్ని చేస్తున్న కృషిని విహంగవీక్షణంలా కో-కన్వీనర్ కట్టా శ్రీనివాస్ తెలిపారు. సమాపన సదస్సులో కార్యదర్శి బలగం రామ్మోహన్ నేతృత్వంలో పత్ర సమర్పకులకు సన్మానం జరిగింది.

వందన సమర్పణ ప్రసంగంలో శ్రీరామోజు హరగోపాల్ మాట్లాడుతూ, తాను చేస్తున్న ఈ పరిశోధనలు ఏ డిగ్రీల మీదో ఆధారపడి చేస్తున్నవి కావు. కేవలం చరిత్రపై ఉన్న మక్కువ, మిత్రుల సహకారంతోనే ఇది సాధ్యమవుతోంది. ఈ చారిత్రక అన్వేషణ నిరంతరం సాగాలి అని పిలుపునిచ్చారు.

- కట్టా శ్రీనివాస్
m : 9885133969
e:katta.khammam@gmail.com

# తెలంగాణ కుంభమేళ మేడారం జాతర

భారతదేశంలోని తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా జరుపుకునే గిరిజన పండుగ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు ప్రాంతంలో ఉన్న తాడ్వాయి మండలంలోని మేడారంలో ఈ జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఘనంగా జరుగుతుంటది (ప్రస్తుతం మేడారం ములుగు జిల్లాలో ఉంది). కుంభమేళా తర్వాత అంతటి స్థాయిలో మేడారం జాతర దేశంలో ఎంతో ఘనంగా జరుగుతుంది. దేశం నలుమూలల నుండి లక్షలాదిమంది భక్తులు పాల్గొని ఈ జాతర నాలుగు రోజులపాటు నిర్వహిస్తారు. జాతర సురువు కాకముందే భక్తులు నెల రోజుల ముందు నుండే దర్శించుకోవడం విశేషం. గిరిజన దేవతలు వారిని సందర్శిస్తారని నమ్ముతున్న సమయంలో మేడారం జాతర జరుగుతుంటది.



ఒక గిరిజన కథ ప్రకారం 13వ శతాబ్దంలో వేట కోసం వెళ్ళిన గిరిజన నాయకులు పులుల మధ్య అపారమైన కాంతిని వెదజల్లుతున్న అమ్మాయి (సమ్మక్క)ని చూస్తారు. ఆమెను వారి నివాస ప్రాంతానికి తీసుకెళ్లి తెగ అధిపతి దత్తత తీసుకుని పెంచుతాడు. కొద్ది కాలం తర్వాత పగిడిద్దరాజుతో వివాహము జరిపిస్తారు. ఆమెకు సారలమ్మ, నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలతో పాటు జంపన్న అనే కుమారుడు కలుగుతారు. కాకతీయుల చివరి రాజు ప్రతాపరుద్రుని సైన్యంతో జరిగిన యుద్ధంలో జంపన్న మరణించడం వల్ల సమీపంలో ఉన్న సంపెంగ వాగుకు జంపన్న వాగు అనే పేరు వచ్చినట్లు ఆధారాలు తెలుపుతున్నాయి. యుద్ధంలో వీరవనితలు మరణిస్తారు. వీరోచిత పోరాటం చేసి జంపన్న మరణించడం వల్ల ఆ వాగులోని నీరు ఎర్రగా మారిందని ఇప్పటికీ ప్రజలు అంటుంటారు. అయితే జంపన్న వాగులో ప్రవహించే నీరు ఇప్పటికీ ఎర్రగా ఉంటుందని అందుకు ప్రధాన కారణం ఆ గిరిజన దేవతల మహిమగా భక్తులు నమ్ముతారు. అయితే శాస్త్రీయంగా ఆలోచించినప్పుడు ఆ ప్రాంతమంతా సహజంగా ఎరుపు రంగు నేల అయినందున ప్రవహించే నీరు సహజంగా ఎరుపు రంగులో ఉండడం జరుగుతుందని కొంతమంది అభిప్రాయం. జాతరను సందర్శించిన భక్తులు జంపన్న వాగులో స్నానం చేసి సమ్మక్క, సారాలమ్మ, పగిడిద్దరాజుల గద్దెలను దర్శించుకుని బెల్లం బంగారాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. కోరిన కోరికలు తీరినప్పుడు తమ బరువుకు సమానంగా నిలువెత్తు బెల్లం బంగారాన్ని సమర్పించడం జాతరలో చూస్తాం. ప్రతి రెండేళ్లకి ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి నుండి నాలుగు రోజులపాటు మేడారం జాతర అంగరంగ వైభవంగా మొదలవుతుంది. మొదటిరోజు కన్నేపల్లి నుండి సారాలమ్మకు ప్రతిరూపమైన బరిణను మేళతాళాలతో తీసుకువచ్చి వెదురు కర్రలకు పట్టుదారంతో కడతారు. రెండవ రోజు సమ్మక్కను ప్రతిరూపంగా భావించే కుంకుమ భరిణను చిలకలగుట్ట నుండి తీసుకువచ్చి వెదురు కర్రకు అలంకరిస్తారు. మూడవరోజు వనదేవతలుగా భక్తులకు దర్శనమిస్తారు. నాలుగవ రోజు సమ్మక్క, సారలమ్మల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

ఈ నాలుగు రోజుల పాటు ఇసుక వేస్తే రాలనంత జనం హాజరవుతారు. నిశ్శబ్దంగా ఉండే ఆ అడవి ప్రాంతమంతా భక్తజన సందోహంతో కిటకిట లాడుతుంది. వాస్తవంగా ఈ ప్రాంతంలో అడుగుపెట్టగానే భక్తుల మనసులలో ఏదో తెలియని భక్త పారవశ్యంతో కూడిన కంపనం మొదలవుతుంది. వాస్తవానికి అక్కడ భౌతికంగా గుడి లేదు గోపురం లేదు. అర్చనలు లేవు. వేద మంత్రోచ్చారణలు అసలే లేవు. తీర్థం లేదు తీయటి ప్రసాదం లేదు. కుంకుమ భరిణకే కోటి మొక్కులు. ఏ దారైనా అమ్మ దగ్గరకే. కంక చెట్లకి వేయి దండాలు. ఏ రాయిని తలచినా తల్లి పలుకే. నిలువెత్తు బెల్లాన్ని బంగారం అనుకొని నైవేద్యం సమర్పిస్తారు. అక్కడ హాజరైన భక్తులు పూనకాలతో ఊగిపోతారు. వనదేవతలే కోట్లాదిమంది కొంగు బంగారంగా వెలసిల్లుతోంది. కోరిన కోరికలు తీర్చేటి మన దేవతల జాతర ఆసియాలోనే అతిపెద్ద సంబురం. అదే తెలంగాణ కుంభమేళా జాతర. ఆ నమ్మకం ఇప్పటిది కాదు. ఏడు వందల సంవత్సరాల నాటి ఆచారం. నేటికీ చెక్కుచెదరని సంప్రదాయం. ఏ మాత్రం పొల్లు పోనీ సంస్కృతి. కులం ఏదైనా తల్లులకు సబ్బండ వర్గాలు పబ్బతి పడతారు. ఆ దృశ్యాలను కనులారా గాంచిన తర్వాత ప్రకృతిని మించిన దేవుడు లేడు అని చెప్పే వేదిక అది. వీర వనితల త్యాగంతో విరాజిల్లుతున్న పులకించిన నేల. గుడిలో కొలువైన దేవతల జాతరలు తెలంగాణలో చాలా చూస్తాం. కానీ ఇక్కడ ఏ గుడి కనిపించదు. ఇది ఒక రకంగా

చెప్పాలంటే మట్టి మనుషుల జాతర. గుడి అంటూ ప్రత్యేకంగా లేకపోయినా ప్రతి భక్తుని గుండెల్లో కొలువైన జాతర మన మేడారం. అక్కడ మట్టికున్న మహిమ చాలా గొప్పది. ఏ చెట్టును తాకినా దైవమే సాక్షాత్కరిస్తుంది. ఏ కొమ్మను మొక్కినా అమ్మే కనిపిస్తుంది. ప్రతి మట్టి రేణువు చైతన్యం కలిగిస్తది. పచ్చని ప్రకృతి రారమ్మని పిలిచినట్టు ఉంటది. దాన్ని ముట్టుకున్నా, పోరాట పటిమ ఉట్టిపడుతది. అక్కడి చెట్లను తాకితే ఏదో తెలియని ధైర్యం లేచి వస్తది. భూమ్మీద పచ్చని వస్త్రం పరిచినట్లుగా పరిసరాలు కనిపిస్తయి. అక్కడి చెట్ల ఆకులు చేసే సవ్వడులు సరిగమల శబ్దాలు వినిపించడమే కాదు, ప్రతి గుండెను తట్టి లేపుతయి. ఆ చెట్ల ఆకులను కౌగిలించుకుంటే కోటానుకోట్ల ఆదివాసీల గర్జనలు వినిపిస్తయి. పచ్చని అడవి కోసం, ఆత్మగౌరవం కోసం తొడగొట్టి యుద్ధం చేసిన ఆడవి బిడ్డల పోరాటం స్ఫూర్తినిస్తది. అంతటి మహోజ్వల చరిత్ర కలిగిన ప్రాంతాన్ని సందర్శించడమే గొప్ప పుణ్యకార్యంగా ఆశేష ప్రజానీకం భావిస్తరు. ఒక్కసారైనా దర్శించాలని ఆరాటపడుతరు. అదే ఎంతో విశిష్టత కలిగిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను నేను మొదటిసారిగా సందర్శించాను.



ఇంతటి ఘనంగా జరిగే మేడారం జాతరకు తెలంగాణ ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన భారీ ఏర్పాట్లు చేసింది. సుమారు 250 కోట్ల రూపాయలతో అనేక నిర్మాణాలు చేపట్టింది. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర 2026 జనవరి 28 నుండి 31 వరకు నాలుగు రోజుల పాటు ఘనంగా జరుగుతది. ఇది తెలంగాణకు తలమానికంగా, ధీరత్వానికి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన మేడారం ఆదివాసీల గిరిజన జాతర. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో అడవి తల్లి ఒడిలో కొలువుధీరిన సమ్మక్క సారలమ్మ వనదేవతల అనుగ్రహం కోసం ప్రజలు అత్యంత భక్తి పారవశంతో పాల్గొంటారు. తొలుత ఒక చిన్న గ్రామంలో ప్రారంభమైన ఈ గిరిజనుల పండుగ రాను రాను దేదీప్య మానమై కోటి మందికి పైగా భక్తులు పాల్గొనే జన జాతరగా మారింది. నాలుగు రోజులపాటు భూమి ఈనిందా అన్నంతగా అటవీ ప్రాంతమంతా భక్తజన సందోహంగా మారుతుంది. జాతరకు మునుపు ఆ ప్రాంతమంతా నిర్మానుష్యమై పచ్చని ప్రకృతితో, పక్షుల కిలకిల రావాలతో అత్యంత రమణీయమైన అటవీ ప్రాంతం జాతర సమయంలో ఇసుక పోస్తే రాలనంత జన ప్రవాహం ప్రభంజనమై సాగుతోంది. 1998లోనే అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించింది. పొరుగు జిల్లాలే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, మహారాష్ట్ర, కర్ణాటక, జార్ఖండ్ సహా వివిధ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు జాతరలో పాల్గొంటారు. ఈ జాతర ప్రత్యేకత ఏమిటంటే అన్ని పూజా కార్యక్రమాలు ఆదివాసీలే నిర్వహించుకుంటారు. సమ్మక్క సారలమ్మ దేవతలు తమ దివ్య అద్భుత శక్తులతో తమ కోరికలను తీరుస్తారని ప్రజలు విశ్వసిస్తారు. సంతానం కలగాలని దేవతలను ప్రార్థిస్తారు. కోరిన కోరికలు నెరవేరాలని ముడుపులు కడతారు. బెల్లం, కొబ్బరికాయలు, నగదు రూపంలో విరాళాలు సమర్పిస్తారు. యాత్రికులు జంపన్న నదిలో స్నానం చేసి శుద్ధి చెంది పాపాలను పోగొట్టుకుంటారు. ఎక్కడ చూసినా డప్పులు కొట్టడం, బాకాలు ఊదడం ఆ ప్రాంతమంతా పెద్ద శబ్దాలతో దద్దరిల్లిపోతుంది. కోళ్లను కోసి మొక్కులు తీర్చుకుంటారు. అక్కడే కనిపించిన చెట్ల కింద వండుకొని భోజనాలు చేసి తిరుగు ప్రయాణవుతారు. ఆ దృశ్యం చూస్తుంటే కనుల నిండుగా సంబురం అనిపిస్తది. ఆ సన్నివేశాలు మనసుకు ఉద్విగ్న భరితం అనిపిస్తయి.

ఈసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతర అభివృద్ధి కోసం నిధులు వెచ్చించడమే కాకుండా, జాతర ఏర్పాట్లకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ అనేక సౌకర్యాలు కల్పించింది. 100 పడకల ఆసుపత్రితో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టం, స్నాన ఘట్టాలు వంటి అనేక పనులను శాశ్వత ప్రాతిపదికన చేపట్టింది. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, గొట్టు గోత్రాలు, ఆచార సంప్రదాయాలు వంటి కట్టుబొట్టు చెదరకుండా మేడారం పునరుద్ధరణ పనులు చేపట్టడం జరిగింది. ఎనిమిది స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయబడినవి. ప్రధాన ద్వారం ఎత్తు 25 అడుగులు. ఐదు అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేశారు. ఏ మాత్రం గిరిజనుల సంస్కృతికి భంగం కలగకుండా పునర్నిర్మాణం చేపట్టడం జరిగింది. ఓరుగల్లును పరిపాలించిన ప్రతాప రుద్రుడి కాలం నుంచి ఈ జాతర ప్రారంభమైనట్లు తెలుస్తుంది. ఒకనాటి చిరుదివ్వే ఇవ్వాళ అఖండ దీపమై సాగుతుంది. మరో వంద సంవత్సరాలైనా చెక్కుచెదకుండా గిరిజన సంస్కృతి ఉట్టిపడే విధంగా మేడారం వెలుగులు అందుకోబోతుంది.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441 5616 55
e : komatireddy.arunabuchireddy@gmail.com

**Periodic table of the elements**

Alkali metals · Alkaline-earth metals · Transition metals · Other metals · Other nonmetals · Halogens · Noble gases · Rare-earth elements (21, 39, 57–71) and lanthanoid elements (57–71 only) · Actinoid elements

| period / group | 1* | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 1 H | | | | | | | | | | | | | | | | | 2 He |
| 2 | 3 Li | 4 Be | | | | | | | | | | | 5 B | 6 C | 7 N | 8 O | 9 F | 10 Ne |
| 3 | 11 Na | 12 Mg | | | | | | | | | | | 13 Al | 14 Si | 15 P | 16 S | 17 Cl | 18 Ar |
| 4 | 19 K | 20 Ca | 21 Sc | 22 Ti | 23 V | 24 Cr | 25 Mn | 26 Fe | 27 Co | 28 Ni | 29 Cu | 30 Zn | 31 Ga | 32 Ge | 33 As | 34 Se | 35 Br | 36 Kr |
| 5 | 37 Rb | 38 Sr | 39 Y | 40 Zr | 41 Nb | 42 Mo | 43 Tc | 44 Ru | 45 Rh | 46 Pd | 47 Ag | 48 Cd | 49 In | 50 Sn | 51 Sb | 52 Te | 53 I | 54 Xe |
| 6 | 55 Cs | 56 Ba | 57 La | 72 Hf | 73 Ta | 74 W | 75 Re | 76 Os | 77 Ir | 78 Pt | 79 Au | 80 Hg | 81 Tl | 82 Pb | 83 Bi | 84 Po | 85 At | 86 Rn |
| 7 | 87 Fr | 88 Ra | 89 Ac | 104 Rf | 105 Db | 106 Sg | 107 Bh | 108 Hs | 109 Mt | 110 Ds | 111 Rg | 112 Cn | 113 Nh | 114 Fl | 115 Mc | 116 Lv | 117 Ts | 118 Og |

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| lanthanoid series 6 | 58 Ce | 59 Pr | 60 Nd | 61 Pm | 62 Sm | 63 Eu | 64 Gd | 65 Tb | 66 Dy | 67 Ho | 68 Er | 69 Tm | 70 Yb | 71 Lu |
| [redacted] series 7 | 90 Th | 91 Pa | 92 U | 93 Np | 94 Pu | 95 Am | 96 Cm | 97 Bk | 98 Cf | 99 Es | 100 Fm | 101 Md | 102 No | 103 Lr |

*Numbering system adopted by the International Union of Pure and Applied Chemistry (IUPAC).

© Encyclopædia Britannica, Inc.

# లిథియం మూలకం యొక్క ఖనిజాలు

లిథియం కేంద్ర ప్రభుత్వం ద్వారా నోటిఫై చేయబడ్డ క్రిటికల్ మినరల్స్‌లో ఒకటి. వీటి నిక్షేపాలను మనవద్ద ఇంతకుముందు అన్వేషించలేదు. అందువలన పూర్తిగా దిగుమతి చేసుకుంటున్నాము. వీటి ఖనిజాల ప్రాముఖ్యత పెరగడానికి కారణం వీటిని బ్యాటరీలలో వాడడం వలన. లిథియం భూమి యొక్క క్రస్ట్‌లో యావరేజ్ అబండెన్స్ 25 ppm వుంటుందని నిర్ధారించబడినది. లిథియంని మొట్టమొదట ప్రపంచంలో స్వీడన్‌కు చెందిన కెమిస్ట్‌లు జోహన్ ఆగస్ట్ ఆర్ఫ్‌వెడ్‌సన్, బ్రాండే, హంఫ్రీడేవీ 1817లో పెటలైట్ అనే ఖనిజంలోని కాంపొనెంట్‌గా ఉన్నట్టు నిర్ధారించారు. వీరు లిథియంని పెటలైట్ ఖనిజం నుండి ఐసోలేట్ చేశారు. ఇది చాలా లైటెస్ట్ మెటల్, హైలీ రియాక్టివ్ మరియు ఫ్లేమబల్ అందుకని దీనిని ఇనర్ట్ అట్మాస్ఫియర్ లోస్టోర్ చేస్తారు.



*తాజాగా కత్తరించిన లిథియం నమూనా, కనీస ఆక్సైడ్లతో*

లిథియం యొక్క ఉపయోగం ఎనర్జీ పరిశ్రమలలో పెరగడం వల్ల అత్యంత ప్రాముఖ్యత పొందింది. ఎన్నో హైటెక్ కంపెనీలలో ప్రపంచవ్యాప్తంగా ఈ మధ్యకాలంలో ఎన్నో టెక్నాలజికల్ డెవలప్‌మెంట్స్ జరిగాయి. పలు పరిశ్రమలలో ముఖ్యంగా మినరల్ పరిశ్రమల్లో, ఎక్స్‌ప్లరేశన్ మైనింగ్ ఎక్స్‌ట్రాక్షన్ మరియు లిథియం కాన్సన్‌ట్రేషన్ వాటి ఓర్స్ నుండి. ప్రస్తుతం లిథియం మూడు సోర్‌సెస్ నుండి మైన్ చేసి ఎక్స్‌ట్రాక్ట్ చేస్తున్నారు.

1)బ్రైన్స్‌ను బేసిన్స్, భూమిక్రింద నుండి పంపు చేసి ఎక్స్‌ట్రాక్ట్ చేస్తున్నారు.

2)హార్డ్ రాక్ పెగ్మటైట్స్ నుండి

3)సెడిమెంటరీ ఫార్మేశన్స్ నుండి.

ప్రస్తుతం ప్రపంచంలో అర్జెంటీనా, చిలీ బోలివ్యాలో సాల్ట్ ఫ్లాట్స్ నుండి బ్రైన్స్ నుండి తీస్తున్నారు. ఆస్ట్రేలియాలో పెగ్మటైట్స్ నుండి తీస్తున్నారు. ముఖ్యంగా అందులో దొరికే స్పాద్యుమీన్ అనే ఖనిజం ద్వారా లీడింగ్ ప్రొడ్యూసర్ అయ్యింది.

లిథియం దొరికే శిలలు, పెగ్మటైట్స్, లాటరైట్‌కోక్లే, కేయోలి నైట్ క్లేస్‌లో, మైకేశియస్ శిలలో లెపిడోలైట్ (లిథియం మైకా) ఉండే అవకాశం ఉన్నది. బ్రైన్స్‌లో సాల్ట్ ఫ్లాట్స్ నుండి మరియు కోస్తా ప్రాంతంలోని టైడల ఫ్లాట్ క్లేస్ నుండి. ఈ మధ్యకాలంలో సౌదీ అరేబియాలో ఆయిల్ ఫీల్డ్స్‌లో కనుగొన్నారు. మన దేశంలో ఇప్పటి వరకు కోస్తా ప్రాంతంలో అన్వేషణ జరగలేదు. కాని దొరికే



*లిథియం ఖనిజాలు: స్పొ డ్యూ మీన్ మరియు లేపిడో లైట్*

అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నవి. మొట్టమొదట మన దేశంలో మూడు సంవత్సరాల క్రితం కశ్మీర్‌లో రియాసి అనే ప్రాంతంలో జి.ఎస్.ఐ. అన్వేషించి లిథియం నిక్షేపాలున్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం వీటి నిక్షేపాల కొరకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు విస్తృతంగా అన్వేషిస్తున్నారు. వీటి నిక్షేపాలు కనుగొన్నచో మన దిగుమతి తగ్గించవచ్చును. లిథియం ఖనిజాలు ముఖ్యంగా స్పొడ్యుమీన్, లెపిడోలైట్, పెటలైట్, కూకైట్, ఆంబ్లిగోనైట్, మంటెబ్రసైట్.

లిథియం యొక్క ముఖ్య ఉపయోగాలు. బ్యాటరీలు, ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, న్యూక్లియర్ ఎనర్జీ, మెడికల్‌గా లిథియం సాల్ట్స్‌ని బైపోలార్ వ్యాధి మరియు డిప్రెషన్‌ను తగ్గించడానికి వాడతారు. ఎరోస్పేస్ మరియు డిఫెన్స్ ఎక్విప్‌మెంట్‌లో అల్యూమినియం, మాంగనీస్ అల్లాయ్‌లో వాడతారు. సెరామిక్స్, గ్లాస్, లుబ్రికెంట్స్ సింథటిక్ రబ్బర్స్, క్యాటలిస్ట్ పరిశ్రమలలో ఉపయోగిస్తారు.

– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com

# మేస్రం వంశ కోడళ్ళకి వస్త్రదానం

హైదరాబాద్ వాస్తవ్యులు క్రికెటర్ నాగేంద్ర గారు జనవరి 25న నాగోబా జాతరను పురస్కరించుకొని శ్యాంపూర్ లోని బుడుందేవ్ జాతర వద్ద వారి అమ్మగారు రాయపూడి ఆశలత గారి కోరిక మేరకు.. దైవకార్యంలో భేటీకి వచ్చిన 200 మంది మేస్రం వంశ కోడళ్ళకి మరియు పీఠాదిపతులు (కఠోడాల)కి వస్త్రదానం చేయడం జరిగింది.. అక్కడ ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.. నాగేంద్ర గారు మాట్లాడుతూ నేను తెలంగాణ రాష్ట్రం మొత్తం తిరిగి సందర్శించాను.. కానీ ఇక్కడున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఆదివాసులను చూసి చలించిపోయాననీ అన్నారు.. ఇక్కడున్న ఆదివాసీలలో స్వయంగా దేవుడిని చూశాను.. వాళ్ళంటే నాకు అమితమైన ప్రేమ ఉంది.. వారు చాలా వెనుకంజలో ఉన్నారు వారిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈరోజు వారి మధ్యలకు రావడం జరిగిందని అన్నారు.. అలాగే 21 సెప్టెంబర్ 2025 నాడు అందరి (గవర్నర్) సమక్షంలో ఆసిఫాబాద్ జిల్లాలో కొమురం భీం గారి జన్మస్థలం రౌటాసంకేపల్లి అనే గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు ప్రకటించానని తెలిపారు.. అనంతరం కేస్లాపూర్ నాగోబా ఆలయానికి వెళ్ళి ప్రత్యేక పూజలు చేసి గత సంవత్సరం ఈ ఆలయంలో పంచలోహాలతో తయారు



చేసిన 25 కిలోల గంట ని ప్రధానం చేశానని గుర్తు చేశారు..

ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ డిసిసి అధ్యక్షులు, వెడ్మా బొజ్జు గారు, SC,ST మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరి బాయి గారు, NGO సభ్యులు విఠల్ రావు గారు, జిల్లా సార్మేడి దుర్గా గారు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మనోహర్ గారు, మేనేజర్ పొన్నం జగన్ పటేల్ గారు, పీఠాధిపతులు వెంకట్ రావు మరియు మేస్రం వంశస్థులతో పాటు 2 వేల మంది పైచిలుకు ప్రజలు పాల్గొన్నారు.




# ధరణికోట మన విస్మృతి! నాగార్జునకొండ మన చైతన్యం!!

### అమరావతి ఆర్ట్... రచయిత పున్నా కృష్ణమూర్తితో దెక్కన్ ల్యాండ్ ఇంటర్వ్యూ

**'అమరావతి ఆర్ట్'** ధరణికోట నాగార్జునకొండ శిల్పసంపదల సచిత్ర వ్యాస సంకలనం' అనే అందమైన పుస్తకం రూపొందించారు రచయిత, సీనియర్ జర్నలిస్ట్ పున్నా కృష్ణమూర్తి. ఇటీవలే ఈ పుస్తక పరిచయసభ భారతీయ విద్యాభవన్, గుంటూరులో జరిగింది. లామకాన్, హైదరాబాద్‌లో చర్చాగోష్ఠి జరిగింది. చరిత్ర – సంస్కృతి – కళారంగాలకు చెందిన ప్రముఖులు, ఆసక్తి పరులు ఈ పుస్తకాన్ని ఆహ్వానించారు. ఆదరిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'తిరుమలకొండ – పదచిత్రాలు, హవ్ హమ్ హైదరాబాదీ' వంటి పుస్తకాలు రచించిన పున్నా కృష్ణమూర్తితో తన తాజా పుస్తకం కవర్ పేజీ నుంచి చివరి పేజీ వరకూ 'దక్కన్ ల్యాండ్' సవివరంగా మాట్లాడింది. ఆ సంభాషణ సారాంశం రచయిత మాటల్లో ...




**అమరావతి ఆర్ట్?**

వరల్డ్ ఆర్ట్ హిస్టారియన్స్ ప్రకారం, భారత పురావస్తు శాఖ కూడా నిర్ధారించిన ప్రకారం భారతీయ బౌద్ధ శిల్పకళలో మూడు శైలులు ఉన్నాయి. గాంధార. మధుర. అమరావతి. పశ్చిమ భారతదేశం మధ్య ఆసియా, తదితర ప్రాంతాల బౌద్ధ శిల్పకళను గాంధార స్కూల్ ఆఫ్ ఆర్ట్ అని మధ్య భారత శిల్ప కళను మధుర స్కూల్ ఆఫ్ ఆర్ట్ అని దక్షిణ భారత బౌద్ధ శిల్పకళను అమరావతి స్కూల్ ఆఫ్ ఆర్ట్ అని నిర్ధారించారు. శాతవాహనుల పాలనలో BCE 2 నుంచి CE 3 శతాబ్దాలలో ఇప్పటి అమరావతి చారిత్రక ధరణికోటలో రూపొందిన చైత్యాలు, విహారాలు తొలిదశ అమరావతి ఆర్ట్‌గా, శ్రీపర్వతం (నాగార్జున కొండ)లో జజు 3-4 శతాబ్దాలలో రూపొందిన చైత్యాలు, విహారాలు మలిదశ అమరావతి ఆర్ట్ అని వ్యవహరిస్తున్నారు. అమరావతికి పూర్వం శాతవాహనుల తొలి రాజధాని అయిన పైథాన్, కోటిలింగాల ప్రాంతాలలోని శిల్పాలను, ముఖ్యంగా అజంతా – ఎల్లోరా శిల్పాలు, చిత్రాలను కూడా అమరావతి ఆర్ట్‌గా వ్యవహరిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో వెలుగులోకి వచ్చిన వస్తున్న శిల్ప సంపద స్థూలంగా అమరావతి స్కూల్ ఆఫ్ ఆర్ట్‌గా పరిగణిస్తున్నారు.

**సింధు నది నాగరికత:**

హరప్పా – మొహంజొదారో కేంద్రంగా భారత ఉపఖండం ప్రజలందరకూ ఎంతగా వర్తిస్తుందో, అమరావతి స్కూల్ ఆఫ్ ఆర్ట్ అజంతా – ఎల్లోరాలతో సహా సమస్త దక్షిణ భారత బౌద్ధ శిల్పకళకు వర్తిస్తుంది. ఒక్క మాటలో మహారాష్ట్ర – కర్ణాటక – తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని కృష్ణా నదీ తీర ప్రాంతాల బౌద్ధ శిల్పకళగా అమరావతి స్కూల్ ఆఫ్ ఆర్ట్‌ను అభివర్ణించవచ్చు. ఓపెనింగ్ పేజీలో అమరావతి (ధరణికోట) – నాగార్జునకొండలను చూపే గూగుల్ మ్యాప్ ఇమేజ్ వాడాను.

**అమరావతి – ధరణికోట**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా కృష్ణానదీ తీరంలోని




అమరావతి అనే గ్రామం చారిత్రకమైనది. బౌద్ధ సాహిత్యం, శాసనాల ప్రకారం పూర్వనామం ధరణికోట. ధాన్యకటకం. పాళీలో ధాన్యకట్ట అని విఖ్యాతం. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు అనే జమిందారు తన హయాంలో (CE 1783 – 1816) ధరణికోటకు అమరావతి అని పేరు పెట్టారు). ఇప్పటి ఆంధ్రప్రదేశ్ రాజధాని గుంటూరు జిల్లా వెలగపూడి కేంద్రంగా ఉంది. రెండిటి మధ్య దాదాపు 24 కి.మీ. దూరం ఉంది. మనం ప్రస్తావించుకుంటున్నది అమరలింగేశ్వర ఆలయం ఉన్న పల్నాడు జిల్లాలోని చారిత్రక అమరావతి.

### అమరావతి ఓపెనర్ రాక

'యూరోపియన్స్ ఆర్ అవర్ ఐ ఓపెనర్స్' అంటారు తాపీ ధర్మారావు గారు. వలస పాలన దుర్మార్గాలు మనం అనుభవించాం. శాస్త్ర – సాంకేతిక–కళా రంగాలకు సంబంధించి బ్రిటిష్ పాలన కాంట్రిబ్యూషన్ కాదనలేనిది. ఉదాహరణకు అమరావతి. స్కాటిష్ ఆర్మీ ఆఫీసర్ అయిన కల్నల్ మెకంజీ (CE 1754 – CE 1821) ఈస్ట్ ఇండియా కంపెనీ సర్వేయర్ జనరల్ పాత్ర అమూల్యమైనది. అమరావతి శిధిల స్థూపం (1797) హంపీ శిధిలాలు (1799) మహాబలిపురం, శ్రావణబెళగొళ తదితర ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేశారు. దక్షిణ భారతదేశం మ్యాప్‌లను తొలిసారిగా రూపొందించాడు. మెకంజీ అమరావతికి వచ్చేసరికి స్థూపం అక్కడ కేవలం దిబ్బగా ఉంది. కొన్ని శిల్పాలు చెదురు మదురుగా పడి ఉన్నాయి. తాను రూపొందించిన మ్యాప్ ప్రకారం తెలంగ రాజ్యంలో ధరణికోట వద్ద అమరావతి గ్రామంలో దీపాలదిన్నె ఉన్నది. చైత్యానికి – స్థూపానికి స్థానికులు పెట్టుకున్న అచ్చతెలుగు పదం దీపాలదిన్నె. బుద్ధుని ధాతువులు కలిగిన ఈ దిన్నెను దీపాలతో అలంకరించేవారని, ఆ కాంతులు అవతలి తీరంలో వారికీ నదిపై ప్రతిఫలిస్తూ కనిపించేవని బౌద్ధ సాహిత్యంలో ఉన్నట్లు తరువాత కాలంలో తెలుసుకున్నాం. బుద్ధుడు కాలచక్రాన్ని కదిలించాడని భావించే ధరణికోటలో దాదాపు వెయ్యేండ్ల పాటు ధారణుల శ్రావ్యమైన గానంతో పులకరించిన గతాన్ని మరచిపోయి ఆ శిధిలాలు తమ వైపు చూస్తున్నా వాటి విలువ గుర్తించలేని స్థితిలో సమాజం కోమాలోకి వెళ్ళిపోయింది.

### శిల్పాల డ్రాయింగ్స్

ఆ శిల్పాలు అమూల్యమైనవని మెకంజీ గుర్తించాడు. జైన మతానికి సంబంధించినవిగా భావించాడు. తన బృందంలోని డ్రాఫ్ట్ మెన్స్‌ను రప్పించి వాటి నకళ్ళను డ్రాయింగ్స్‌గా రూపొందించి ఇంగ్లాండ్ పంపాడు. ఫొటోగ్రఫీ పురుడు పోసుకోని రోజుల్లో రూపొందిన ఆ డ్రాయింగ్స్ తాము పాలించే దేశంలో ప్రజల సంస్కృతి ఏమిటో తెలుసుకోవాలనే పాలకుల ఎరుకకు నిదర్శనం.

ఆ డ్రాయింగ్స్ చూసిన ఆర్ట్ హిస్టారియన్స్ ఆ శిల్పాలను లండన్‌కు తెప్పించుకోవడం, దారిలో కొన్ని మిస్ కావడం, కొన్ని దెబ్బ తినడం... ఈ పరిశీలనకు డ్రాయింగ్స్ ఆధారం కావడం ఒక గొప్ప సాంస్కృతిక చరిత్ర. అమరావతిలో శిల్పాలు వెలుగు చూసిన కాలమాన పరిస్థితుల్లో వాటి విలువ ఎవరికీ తెలియనందున తరలింపును ఎవ్వరూ అభ్యంతర పెట్టలేదు. బ్రిటిష్ రాజ కిరీటంలో కోహినూర్ వెలుగులు చిన్నబోయేలా బ్రిటిష్ మ్యూజియంలో అమరావతి ఆర్ట్ గ్యాలరీలో శాశ్వత ప్రదర్శనలో వెలుగులు ప్రసరిస్తున్నాయి.

### నందికొండ చైతన్యం

అమరావతి ఆర్ట్ రెండవ దశకు కేంద్రం శ్రీపర్వతం. శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవుల పాలనలో గొప్ప నాగరికత విలసిల్లిన ప్రాంతం. విజయపురిగా కూడా విఖ్యాతం. ఆచార్య నాగార్జునుడు (CE 150–250) జీవించిన నేల. తన మిత్రుడు ప్రభువు శాతకర్ణికి సుహృల్లేఖ రాసిన నేల. శ్రీలంక, తూర్పు ఆసియా, ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులు బౌద్ధాన్నే కాక, రసాయనవిద్యను, ఆయుర్వేదాన్ని అభ్యసించిన విశ్వవిద్యాలయం విలసిల్లిన నేల. ఉత్తర భారత దేశంలో సాహిత్యం లుప్తం కాగా తాను వ్యాఖ్యానించిన మాధ్యమికవాదం నేటి బౌద్ధ సాహిత్యానికి ప్రాతిపదికగా రూపొందిం నేల. ప్రస్తుత నల్లగొండ–పల్నాడు జిల్లాల మధ్య నందికొండ (హిల్ కాలనీ) – కొత్తూరు గ్రామాల శివారులలో కృష్ణానది లోయలలో









చైత్యము, విహారాలు, వైదిక ఆలయాలు ఆయా విశ్వాసుల సంరంభాలతో విలసిల్లిన నేల. రాజుల పరస్పర దాడులలో అనివార్య కారణాలతో విస్మృతికి గురైనది.

పల్నాడు నదీ తీరపు గ్రామం నాగులవరం ఉపాధ్యాయుడు సూరపునేని వెంకట్రామయ్య. గ్రామ శివారులో కొన్ని శిల్పాలున్నాయని CE 1925లో మాచెర్లలోని గుర్రం మల్లయ్య ఇతర పెద్దలకు చెప్పాడు. గుర్రం మల్లయ్య శాంతినికేతన్ విద్యార్థి. అమరావతి శిల్పాల నేపథ్యం తెలిసిన వ్యక్తి. అజంతా గుహలు చూసి ఉన్నారు. ఆయన ఇతర పెద్దలు రాసిన ఉత్తరానికి స్పందించి మెద్రాస్ పురావస్తు శాఖ నిపుణుడు ఏ.హెచ్. ఖురేషి నందికొండ – అనుపు ప్రాంతాలు సందర్శించారు. ఆ క్రమంలో ఏ.ఆర్. సరస్వతి తదితరుల రాక, అప్పటిలో పాళీ భాష నిపుణుడైన జర్మన్ ఏ.పి.హెచ్. ఒగేల్ ద్వారా శాసనాల పరిశీలన జరిగాయి.



ఇక్కడ బౌద్ధం వెల్లివిరిసింది అని రూఢి అయింది. అమరావతి (ధరణికోట)లో బౌద్ధ శిల్పాలు వెలుగులోకి వచ్చిన నాటికి మనకు వాటి విలువ తెలియదు. శిల్పకళలో సౌందర్య శాస్త్రానికి అమరావతి ఆర్ట్ తలమానికమని ప్రపంచం కొనియాడడం దేశీయులు గుర్తించారు. అమరావతి శిల్పాలను పోగొట్టుకున్నాము. నాగార్జున కొండ శిల్పాలను కోల్పోరాదని ఒక అత్యద్భుత జాతీయ చైతన్యం వెల్లివిరిసింది. పత్రికలూ విశేష వ్యాసాలు రాశాయి. రేడియోల్లో ఉపన్యాసాలు. కరుణశ్రీ వంటి కావ్యాలు వెలువడ్డాయి.

ఈ నేపథ్యంలో నందికొండ వద్ద కృష్ణా నదిపై ఆనకట్ట కట్టాలని అప్పటి మద్రాస్ రాష్ట్రంలో నిజాం స్టేట్‌లో సర్వేలు జరిగాయి. ఈ క్రమంలో గుర్తుంచుకోదగిన ప్రముఖుడు, తెలంగాణ నీటిపారుదల రంగ పితామహుడు నవాబ్ అలీ నవాబ్ జంగ్ బహదూర్. తొలిసారిగా అయన రూపొందించిన నివేదిక, డా. కె.ఎల్. రావు మలి నివేదిక, ఖోస్లా కమిటీ తుది నివేదిక ఆధారంగా విశాలమైన కృష్ణా నది లోయలో మానవ నిర్మిత నాగార్జునసాగర్ నిర్మించాలని నిర్ణయించారు. లోయలోని 50కి పైగా గ్రామాలలోని శిల్ప సంపద ఏమి కావాలి? భారతదేశ చరిత్రలో తొలి సరిగా రాత్రి పగలు ఇక్కడ పురావస్తు శాఖ తవ్వకాలు జరిపింది. శిల్పాలను ఇప్పటి నాగార్జున కొండపై దేశంలో తొలి ఐలాండ్ మ్యూజియం నిర్మించి భద్రపరచారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన మతిమరుపు, స్తబ్దత మరలా కమ్ముకుంది.

## లండన్ – నాగార్జునకొండ

అమరావతి స్కూల్ అఫ్ ఆర్ట్‌కు సంబంధించిన తొలి దశ శిల్పాలు లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో అమరావతి ఆర్ట్ గ్యాలరీలో భద్రంగా ఉన్నాయి. ప్రతి రోజు కనీసం అయిదు వేల మంది వివిధ దేశాల ప్రజలు సందర్శిస్తున్నారు. అవి దోచుకు వెళ్లారు, వెనక్కు తీసుకు రావాలి అంటున్నారు. నిజమే. మంచిదే. అయితే వాటిని వెనక్కు తెచ్చి మనం ఎక్కడ ఎలా భద్రపరుస్తాం?

ఈ ప్రశ్నకు జవాబు అమరావతి స్కూల్ ఆర్ట్ కు చెందిన నాగార్జునకొండ ముంపు ప్రాంతాల్లో లభ్యమైన శిల్పాలను మనం ఎలా పరిరక్షించుకుంటున్నాం అని ప్రశ్నించుకుంటే వస్తుంది.











నాగార్జునకొండ శిల్పాలు కొన్ని కోల్కతా మ్యూజియంలో, మెద్రాస్ మ్యూజియంలో ఉన్నాయి. ఎలా ఉన్నాయి? క్యాటలాగ్స్ అందుబాటులో ఉన్నాయా? ఉన్నాయి అంటున్న శిల్పాలు ఎక్కడో ఉన్నాయి అంటున్నారు. ఇటీవల మెద్రాస్ మ్యూజియం సందర్శించిన వారు మ్యూజియం ఆవరణలో ఎండా వానకు ఎండుతూ పడివున్నాయి అని అనడం చదివాము. మన ప్రభుత్వాలు, ప్రైవేట్ కళాశాలలు నాగార్జునకొండ మ్యూజియంకు పిల్లలను సంవత్సరానికి ఒక ట్రిప్ అయినా విద్యార్థులను తీసుకెళ్ళాలి. మన కళాకారులు సైతం ఇంగ్లాండ్‌లో అమరావతి ఆర్ట్ చూడడంతో సరిపెట్టుకోకుండా ఇప్పటికీ మనకోసం ఎదురు చూస్తున్న నాగార్జునకొండ శిల్పాలను పలకరించాలి.



**అమరావతి ఆర్ట్ ఎందుకు ప్రపంచాన్ని ఆకర్షించింది!**

పల్నాడు గ్రీన్ మార్బుల్ రాయిపై మలచిన శిల్పాలు నిశ్చలంగా ఉండవు. వాటిలో కదలిక ఉంటుంది. ముఖ చిత్రాన్ని చూడండి. సింహంతో ఆడుతున్న బాలుడు. వాడు తోక పట్టుకుంటాడు, సింహం నవ్వుతుంది. అది ఎగురుతుంది అని సూచిస్తూ రెక్క. ఆ సింహం శాక్యమునికి ప్రతీకగా కూడా భావించ వచ్చు. ప్రపంచ బౌద్ధ శిల్పకళతో కేవలం బుద్ధుడు అందుకు సంబంధించిన శిల్పాలే కాకుండా గ్రామీణ జీవితం అమరావతి ఆర్ట్ (ధరణికోట-నాగార్జునకొండ వంటి దక్షిణ భారత బౌద్ధ శిల్పకళలోనే కన్పిస్తుంది. పుస్తకంలోని రెండు చాప్టర్లు కథా శిల్పాలకు ఉదాహరణ.

**రచనకు ప్రేరణ**

నా బాల్యం, నా కుటుంబ నేపథ్యం, జర్నలిస్ట్‌గా కలిగిన అవగాహన ప్రధాన కారణాలు. నా తాత పున్నా ఎల్లయ్య దేవరకొండ వాడు. మా నాయనమ్మ పున్నా చెన్నమ్మ తల్లిదండ్రులు మాల్ సమీపంలోని చండూరు గ్రామస్తులు. ఈ పద్మశాలీ కుటుంబాలు కృష్ణ దాటి పల్నాడు ప్రాంతం వలస వెళ్లాయి. గుర్రం మల్లయ్య కుటుంబమూ చందూరి నుంచి కొత్తూరు మీదుగా మాచెర్ల వెళ్లి స్థిరపడింది. మా నాన్న పైలాన్ గాంధీ పార్క్ దగ్గర ఉండే హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఉద్యోగి. నాగార్జున సాగర్ నిర్మాణం, పురావస్తు తవ్వకాలు నేను ప్రత్యక్షంగా చూశాను. తవ్వకాల్లో సెంట్రల్ ఫోటో ఆఫీసర్‌గా పాల్గొన్న గుర్రం లక్ష్మీనారాయణ మేనమామ, ఆ తరువాత పిల్లనిచ్చిన మామ. పైలాన్-హిల్ కాలనీలలో (ఇప్పుడు నందికొండ) 8 వరకూ చదివాను. మాచర్లలో మాతామహుల ఇంట పదివరకూ చదివాను. మా బంధుత్వాలన్నీ పురానా ఫ్యూల్ అవతల అటు ఇటూ, ట్యాంక్ బ్యాండ్‌కు అటు ఇటూ వలె ఉంటాయి.

రెండు రాష్ట్రాలకు చెందిన కొందరు మిత్రులు అడుగుతుంటారు. నువ్వు ఆంధ్రానా తెలంగాణానా అని. ఇరు తీరాల మధ్య విస్తరించిన నాగార్జునసాగర్ జలాశయం గుర్తొస్తుంది (126-127 పేజీలలో వాడిన డబల్ స్ప్రెడ్ ఫోటో). ముంపు గ్రామాలూ గుర్తొస్తాయి. తెగిన పాత వంతెన గుర్తొస్తుంది. వాటిని కలిపే సాంస్కృతిక దారాల కోసం అక్షరాలను ఆశ్రయిస్తాను.

సాగర్ నిర్మాణ దశలో ఇప్పటి జలాశయంలో అనేక గ్రామాలుండేవి. నా స్నేహితులు ఆ గ్రామాల నుంచి స్కూల్‌కు వచ్చేవారు. నాగార్జునకొండకు ప్రతి సంవత్సరం స్కూల్ బస్సులో వెళ్లే వారం. కృష్ణానదిని నడిచే దాటేవరం. అందరికి సాగర్ జలాశయం చూస్తే పరవశం కలుగుతుంది. నాకు ఆ గ్రామాలు మునిగిపోయిన శిల్పసంపద కనిపిస్తుంది.

గుంటూరు జిల్లా ఆంధ్రభూమి రిపోర్టర్‌గా ఉన్నపుడు రవి కళాశాల ప్రిన్సిపాల్, నన్ను స్నేహంగా, వాత్సల్యంగా చూసే సివీన్ ధన్ 'అమరావతి ఆర్ట్ ఫెస్టివల్ 1989-90లో నిర్వహించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలనుంచి వచ్చిన ఆర్టిస్టులు అమరావతిలో మకాం వేసి కృష్ణానదీతీరంలో పెయింటింగ్స్ చేసేవారు. నేను రెగ్యులర్ రిపోర్టింగ్ పక్కన పెట్టి రోజూ అమరావతి వెళ్లే వాడిని. ఆ సందర్భంగా మ్యూజియంకి రోజూ వెళ్లడం, పుస్తకాలు చదవడం అలవాటైంది. ఆ నేపథ్యం కారణంగానే 2006లో దలైలామా









**దక్షిణ భారత దేశానికి బౌద్ధ ధర్మ సింహద్వారం తెలంగాణ**

బుద్ధుని జీవిత కాలంలో (BCE 563 – BCE 483) బౌద్ధ ధర్మం తెలంగాణకు వచ్చింది. సుత్తనిపాత, పారాయణ వగ్గ, అయిదవ అధ్యాయంలో ఈ వివరాలున్నవి. నిర్మల్ జిల్లా బాదనకుర్తి ప్రాంతంలో గోదావరీ ప్రాంతంలో బావరి అనే బ్రాహ్మణుడు ఉండేవారు. ఉత్తరాది నుంచి వచ్చే వర్తకులు – యాత్రికుల ద్వారా బుద్ధుడు ఉపదేశించిన మధ్యేమార్గ జీవన విధానం గురించి వింటారు. వృద్ధాప్యం కారణంగా తాను ప్రయాణాలు చేయలేని నేపథ్యంలో తన శిష్యులను బుద్ధుని వద్దకు పంపి, కొన్నాళ్ళు అక్కడ ఉండి బుద్ధుని కలిసి ఆ వైనం తనకు చెప్పవలసినదిగా కోరతారు. అలా శిష్యుల ద్వారా విని బుద్ధ ధర్మాన్ని అవలంభిస్తారు. బుద్ధుని శిష్యులలో ఒకరు ఒక వస్త్రం పై భగవానుని ఛాయారూపం (సిల్హౌటీ) పట్టారని కథానాలున్నవి. ఒక విధంగా బౌద్ధ ధర్మమూ – బుద్ధుని మౌలిక రూపమూ బుద్ధుని సమకాలీనుల ద్వారా తెలంగాణకు వచ్చింది.

ఆధ్వర్యంలో కాలచక్ర జరిగినపుడు అక్కడ రెండు వారాలకు పైగా మకాం వేసాను. పర్యాటకులకు బ్రిటిష్ లైబ్రరీలోని డ్రాయింగ్స్ ప్రదర్శించాను. ఆ తరువాత ఇంటర్నెట్ ఎంతో ఉపయోగ పడింది.

నాగార్జునకొండ మ్యూజియంలో శిల్పాలున్నవి. వాటిని సందర్శించే ఆసక్తిని కలుగచేసే సమాచారం ఉందా? ఎవరైనా ప్రయత్నించి వెళ్లాలంటే ప్రయాణ సౌకర్యాలు లేవు కదా? కార్లలో వెళ్లగలిగే వారికే అనువులోని నాగార్జునుడి విశ్వవిద్యాలయం శిధిలాలు, ఆంఫీ ధియేటర్ శిధిలాలు సందర్శించే వీలు. బస్సులో వెళ్లే సౌకర్యం లేదు. మనలో సాంస్కృతిక చైతన్యం కలగనిదే ఇవన్నీ సాధ్యపడవు.



**వ్యాసాలు రాసిన సందర్భం**

ప్రపంచ భౌగోళిక చిత్రపటాలు మారుతుంటాయి. దేశీయ, రాష్ట్రీయ చిత్రపటాలూ మారుతుంటాయి. సాంస్కృతిక బాంధవ్యాలను అవి నిర్దేశించలేవు. ఇవి అనాది. మన ఆలయాలు, పుష్కరాలు, బౌద్ధ ధర్మమూ, సమ్మక్క–సారలమ్మ ఉత్సవాలు అందుకు ఉదాహరణ. మా నాన్న నిజామాబాదు జిల్లాలో ఉద్యోగం చేస్తుండగా 9వ తరగతి విద్యార్థిని. అక్కడ 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాను. మాచెర్ల జిల్లాపరిషత్ స్కూల్లో 10వ తరగతి విద్యార్థిని. జై ఆంధ్ర ఉద్యమంలో పాల్గొన్నాను. కారణాలు తెలియని వయసు. విడిగా ఉంటే బాగుంటుంది అని తోటి విద్యార్థులు భావిస్తున్నారుగా. విడిగా ఉండాలి అంతే.

ఈ వ్యాసాలు రాసిన సందర్భమూ అటువంటిదే. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయింది. నవ్య ఆంధ్ర రాజధానిగా అమరావతి అనే పేరును ఎన్నుకున్నారు. రాజధాని అంటే కేవలం భవనాలు – రోడ్లతో ఏర్పడుతుందా? ఒక్క రోజులో ఏర్పడుతుందా? వానపాము చూపును వీడి విహంగ వీక్షణం చేయలేరా? ఈ వాతావరణంలో ఆంధ్రప్రదేశ్ పత్రికకు వర్కింగ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న నరేష్ నున్నా ఒక ఫీచర్ రాయమని కోరారు. ఏమి రాయాలి? ఆ ఆలోచనలనుంచి వచ్చిన వ్యాసాలు ఇవి.

**ఎలా ప్రచురించాము?**

ఈ వ్యాసాలను హైదరాబాద్ కర్ణాటక (ఇప్పుడు కళ్యాణ్ కర్ణాటక)లో నివసించే మిత్రుడు వీరమాచినేని వెంకటేశ్వరరావు చదివారు. వ్యాసంలో ఫోటో, సెల్ నెంబర్ చూసి ఫోన్ చేశారు. బొమ్మలు సరిగ్గా కనపడడం లేదు. బాగా కనపడేలా పుస్తకం వేయండి అని పట్టు పట్టారు. 1978 ప్రాంతంలో స్నేహం. చిన్న రైతు. అతని వత్తిడి కాదనలేక అతడు చేసిన ఆర్థిక సహాయం, కొంత నేను సమకూర్చుకున్న డబ్బుతో ప్రగతి ప్రెస్‌లో ప్రింట్ చేయించాం. పెన్షన్ రాని రిటైర్ అయిన మధ్యతరగతి జర్నలిస్ట్ ను, ఈ పుస్తకం ప్రింట్ అవుతుందని కలలో కూడా అనుకోలేదు. థాంక్స్ డియర్ వెంకటేశ్వరరావు.

**పుస్తకం ధర**

పుస్తకంపై వచ్చిన రివ్యూలను చదివి ఒక ఆసక్తి పరుడైన పాఠకుడు ఫోన్ చేశారు. పుస్తకం ధర రూ.1500/– పేజీలు 128 అని ప్రింట్ అయింది. పేజీలు 1500, ధర రూ. 150/– అనుకుంటా అన్నారు. కాదు సరిగ్గానే చదివారు అన్నాను. పుస్తకాన్ని స్నేహితుని ద్వారా పంపించాను. నచ్చితే తోచినంత పంపండి. నచ్చకపోతే పుస్తకం వెనక్కు పంపమన్నాను. ఆ డ్రాయింగ్స్, శిల్పాలు వాటి కథనాలు... మ్యూజియంకు వెళ్లి చూసినట్లున్నది అన్నాడు. ఎవరికైనా గిఫ్ట్‌గా ఇస్తాను అన్నాడు, వెయ్యి రూపాయలు పంపి!

**పుస్తకం గురించి:**

శ్రీలంక నుంచి ఆర్యదేవ అనే బౌద్ధ భిక్షువు ఆచార్య నాగార్జునుడు స్థాపించిన శ్రీపర్వతం విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడని బౌద్ధ సాహిత్యం ద్వారా తెలుసుకుని




ఉద్విగ్నుడనయ్యాను. నా తొలి రోజుల పెయింటింగ్స్ 'ఆర్యదేవలి' అనే పేరుతో వేసాను. నేను ఇంగ్లండ్ వెళ్లేముందు ఎవరినైనా ఒక ప్రముఖ చిత్రకారుని కలవాలి, పేరు చెప్పండి అని ఆరుద్రను అడిగాను. చిత్రకారుడు - శిల్పి - స్వాతంత్ర్య సమరయోధుడు అయిన వ్యక్తి మరొకరు లేరు గుర్రం మల్లయ్యను కలవండి అన్నారు. అప్పుడు వారిని నాగార్జునకొండలో కలిసాను, అమరావతి ఆర్ట్ కు - పుస్తక రచయితకు నాకు అవినాభావ సంబంధం ఉంది. తెలంగాణ - ఆంధ్ర రాష్ట్రాల్లో అన్ని కళాశాలల గ్రంథాయాలలో ఉంచ దగిన పుస్తకం ఇది.

*-పద్మశ్రీ ఎస్.వి. రామారావు,* చికాగో (కాంప్: హైదరాబాద్)

నా వయస్సు 80 సంవత్సరాలు. అమరావతిలో ఉన్నాను. ప్రస్తుతం విశ్రాంత చరిత్ర అధ్యాపకుడిని. అమరలింగేశ్వరుని గురించి అమరావతి శిల్పాల గురించి ఎన్నో వ్యాసాలు రాసాను. ఉపన్యాసాలు ఇచ్చాను. పున్నా కృష్ణమూర్తి పుస్తకం అపూర్వమైనది. డ్రాయింగ్స్, శిల్పాలు, వాటి కథలు ఎంత అందంగా చెప్పారో. ప్రతి తెలుగువ్యక్తి చదివితీరాల్సినది.

*-వావిలాల సుబ్బారావు,* విశ్రాంత తెలుగు లెక్చరర్

రచయిత పున్నాకృష్ణమూర్తి మిర్యాలగూడ మిత్రబృందం ద్వారా నాకు తెలుసు. బౌద్ధ శిల్పకళతో మూడు శైలులు గురించి చెబుతూ అమరావతి స్కూల్ అఫ్ ఆర్ట్ గురించి చెప్పారు. శిల్పాలను పరిచయం చేసిన వైనం బాగున్నది.

*-శ్రీ రామోజు హరగోపాల్*

పున్నా కృష్ణమూర్తి 20 ఏండ్ల క్రితం ప్రచురించిన తిరుమలకొండ - పదచిత్రాలు చదివాను. మిత్రులకు గిఫ్ట్‌గా కొన్ని కాపీలు ఇచ్చాను. నా కోరికపై మా కళాశాలలో కొన్ని గెస్ట్ లెక్చరర్స్ ఇచ్చారు. ఈ పుస్తకం ఆర్ట్ అప్రిసియేషన్‌కు ఒక ఉదాహరణ. తెలుగులో ఆర్ట్ గురించి రాయగలిగిన వారు రాసేవారు తక్కువ. ప్రతి ఆర్ట్ లవర్, ప్రతి తెలుగు వ్యక్తి చదవాల్సిన పుస్తకం.

*-శ్రీమతి వాణీదేవి సురభి,* MLC. శ్రీ వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్ స్కూల్ వ్యవస్థాపక ప్రిన్సిపాల్.

మహనీయుడైన మహాదేవ భిక్షువును, నాగార్జునాచార్యులను తలచుకుంటూ, వారితోపాటు నేటి కాలపు మరో మహనీయుడు శ్రీ గుర్రం మల్లయ్య గారిని కూడా తప్పక స్మరించుకోవాలి. నాగార్జునకొండ శిల్పాలను పరిరక్షించుకోవడంలో వారి కృషి వెలలేనిది. ఆ వైనాలను రచయిత పున్నా కృష్ణమూర్తి సోదాహరణంగా వివరించారు.

*- దీవి సుబ్బారావు,* కవి, రచయిత, తెలుగు అకాడెమీ పూర్వ అధ్యక్షులు

మనకు అందుబాటులో లేని అద్భుతమైన అమరావతి శిల్పాలను చూసేందుకు ఇటువంటి పుస్తకాలూ ఉపకరిస్తాయి. ఒక విశ్వవిద్యాలయం బహూకరించే డాక్టరేట్‌కు మించిన కృషి ఈ పుస్తకంలో ఉంది.

*-డా. యలమంచిలి శివాజీ,* పార్లమెంట్ మాజీ సభ్యులు

ఇందులో గ్రామీణ జనం, రాజులూ, అధికార వర్గం, వివిధ జంతువుల కదలికలు ఒకే ఫ్రేములో కనిపిస్తాయి. రచయిత సులభశైలి పాఠకులను సుఖప్రయాణం చేయిస్తాయి.

*-తల్లావజ్ఝల శివాజీ,* చిత్రకారులు, కళావిమర్శకులు, రచయిత

శిల్పాలు చెబుతోన్న తాత్విక సారాంశాన్ని విని మనకోసం తేటతెలుగులో రాసారు రచయిత. ప్రతి వాక్యంలోనూ కవిత్వం జాలువారేలా రచించారు. *-ఎన్. నాగేశ్వరరావు,* కవి - రచయిత

తన జ్ఞాపకాలను జోడించి, ఒకవైపు బుద్ధ భగవానుని జీవితంలోని ముఖ్య ఘట్టాలు, మరోవైపు శిల్ప కళావైభవం, మరోవైపు ప్రపంచానికి దక్షిణ భారతదేశ శిల్పకళను పరిచయం చేసిన కల్నల్ మెకంజీ నుంచి గుర్రం మల్లయ్య గారి వరకూ చేసిన కృషిని ఒక ఋషిలా పున్నా కృష్ణమూర్తి ఈ పుస్తకంలో చూపించారు.

*- ఈమని శివనాగిరెడ్డి,* స్థపతి, చరిత్ర విశ్లేషకులు

- పున్నా కృష్ణమూర్తి,
m : 7680 950 863
e:nirmalaakrishna@gmail.com








*1945 జనవరి 1న, సరిగ్గా 81 సంవత్సరాల క్రితం ఇదే రోజున, హైదరాబాద్ దక్కన్ ఏడవ నిజాం (1911–1948) అసఫ్ జా, హెచ్ఈహెచ్ నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్, ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ (నుమైయాష్) ప్రారంభించారు.*

# సకల వస్తువుల కాణాచి.. నుమాయిష్?

## ● 8 దశాబ్దాల వైభవం..! ● ఏటా 25 లక్షల సందర్శకుల రాక

**నూ**తన సంవత్సరంలో అడుగుపెట్టగానే హైదరాబాద్‌లో ఓ పండగ మొదలవుతుంది.

నుమాయిష్ ఎగ్జిబిషన్.. ప్రపంచంలోనే అతిపెద్ద మేళా. ఏటా జనవరి 1 నుంచి 45 రోజులపాటు కొనసాగుతుంది. నాలుగు తరాలకు పరిచయమున్న ఈ ఎగ్జిబిషన్‌కు ఘన చరిత్రే ఉంది. మరి దాని గురించి తెల్సుకుందాం...

నుమాయిష్ మస్నూవత్ ఇ ముల్కీ.. అంటే స్థానిక ఉత్పత్తుల ప్రదర్శనశాల. ఇదే పేరుతో ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకున్న కొందరు విద్యావంతులు బృందంగా ఏర్పడి 1938లో తొలిసారిగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక ఉత్పత్తుల విక్రయాలను ప్రోత్సహించాలని, ప్రజల ఆర్థిక పరిస్థితులను తెలుసుకోవాలనే ఉద్దేశంతో దీన్ని ప్రారంభించారు. నాడు రూ. 2.5లక్షల ఖర్చుతో 100 స్టాళ్లతో ఏర్పాటైన నుమాయిష్‌లో ఇప్పుడు వేల సంఖ్యలో స్టాళ్లు ఏర్పాటవుతున్నాయి. రూ.వందల కోట్ల వ్యాపారం జరుగుతోంది.

### తొలి ఎగ్జిబిషన్ పబ్లిక్ గార్డెన్‌లో..

ఇప్పుడు నాంపల్లిలో జరుగుతోన్న ఎగ్జిబిషన్‌ను మొదట పబ్లిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేశారు. కొన్నాళ్లకు వ్యాపారుల స్టాళ్లు, సందర్శనకు వచ్చే ప్రజల సంఖ్య పెరిగింది. స్థలాభావంతో నాంపల్లిలోని 23 ఎకరాల ఖాళీ స్థలంలో ఏర్పాటు చేశారు. దీన్నే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ అని పిలుస్తుంటారు. నుమాయిష్ పేరును కొన్నేళ్ల కిందట 'ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్'గా మార్చారు. కానీ, అందరూ దీన్ని నుమాయిష్‌గానే పిలుస్తుండటంతో 2009లో తిరిగి పాత పేరునే పెట్టారు.

జమ్ముకశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోని ప్రముఖ కంపెనీలు, స్థానిక సంస్థల ఉత్పత్తులు, హ్యాండీక్రాఫ్ట్, చేనేత వస్త్రాలు, ఎలక్ట్రికల్ పరికరాలు ఇలా అన్నీ ఇక్కడ కొలువుదీరిన స్టాళ్లలో లభిస్తాయి. రూ.10 నుంచి రూ.లక్షలు విలువ చేసే వస్తువులు దొరుకుతాయి. దేశీయ ఉత్పత్తులే కాదు.. ఇరాన్ కార్పెట్లు, టర్కీ దుప్పట్లు, బంగ్లాదేశ్ వస్త్రాలు, హ్యాండీక్రాఫ్ట్ అమ్మకానికి ఉంటాయి. మహిళలు మాత్రమే నిర్వహించే స్టాళ్లూ కనిపిస్తాయి.

1353-1354 ఫస్లీ/1945 AD సంవత్సరానికి ఎగ్జిబిషన్ సొసైటీ యొక్క ఎగ్జిక్యూటివ్ కమిటీలోని 15 మంది సభ్యుల జాబితా క్రింద ఇవ్వబడింది.

| Sl.No. | | |
|---|---|---|
| 01. | Nawab Zain Yar Jung Bahadur,<br>Hon'ble Member, P.W.D AND C.L Dept. | President |
| 02. | Raja Guru Das, B.A., LL.B.(Osmania)<br>Jagdir (Member, Advisory Municipal Committee.) | Vice President |
| 03. | Mohammed Sharfuddin, B.A (Osmania) | Hon. Secretary |
| 04. | Khawaja Muhammad Wasay, B.Sc. B.E. (Osmania)<br>P.A. TO S.E. Medak Circle. | Assistant Secretary |
| 05. | Shankerjee, B.A., LLB. (Osmania)<br>Assistant Assessor & Collector, Municipal Corporation. | Treasury |
| 06. | Mir Akbar Ali Khan, B.A.(Osmania), LL.B.<br>(Hon: London) Bar-At-Law<br>(President of the Exhibition Society,1351 F.) | Member |
| 07. | Muhammad Farooq, B.A. (Osmania)<br>H.C.S. (President of Exhibition Society 1349 F.)<br>Deputy Secretary, Political Dept. | Member |
| 08. | Syed Muhammad Ali Moosavi,<br>Ex- Vice-President, Municipal Corporation<br>(President of the Exhibition Society1350 F.) | Member |
| 09. | Habeeb-Ur-Rehman, M.A, LL.B.(Alig), B.Sc.(Hon: London)<br>Director C & I Dept. | Member |
| 10. | Khan Bahadur Ahmad Mohiuddin, B.A., (Cant.)<br>Dpt. Managing Director, Hyderabad State Bank,<br>(President of The Exhibition Society,1353 F). | Member |
| 11. | Mushatq Ahmad Khan M.A., (Cantab)<br>AG. Chief Commercial Manager,<br>H.E.H The Nizam's State Railways. | Member |
| 12. | Khawaja Muhammad Ahmad, M.A. LL.B. (Osmania)<br>Assistant Director of Archaeology,<br>Representative of The (Economic Committee) | Member |
| 13. | Khawaja Hameed Ahmed, B.A., (Osmania)<br>Assistant Director, Statistical Dept.<br>(Representative of the C & I Dept.) | Member |
| 14. | Muhammad Abdur Raoof, B.A., LL.B., (Osmania),<br>Advocate | Member |
| 15. | Mir Mahmood Ali, M.A. (Osmania)<br>Lecturer, City College<br>(President of the Exhibition Society, 1348 F.) | Member |

## షాపింగ్ మాత్రమేనా మరెన్నో..

కేవలం స్టాల్స్ మాత్రమే కాదు.. ఎగ్జిబిషన్‌కు వచ్చిన ప్రజలకు వినోదం అందించడానికి సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్‌షోలు నిర్వహిస్తుంటారు. జెయింట్‌వీల్స్, ఎగ్జిబిషన్ మొత్తం చుట్టి వచ్చేలా టాయ్ ట్రెయిన్, గేమ్స్, ఆహార ప్రియుల కోసం హోటళ్లు అందుబాటులో ఉంటాయి. ఈ ఎగ్జిబిషన్‌ను ఏటా 25 లక్షల మంది సందర్శిస్తుంటారు.

కరోనా నేపథ్యంలో 2021లో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయలేదు. గతేడాది పరిమిత సంఖ్యలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సారి 2వేలకుపైగా స్టాళ్లు ఏర్పాటవుతున్నాయి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ఎప్పుడు వెళ్లొచ్చు?

జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు కొనసాగే ఈ ఎగ్జిబిషన్ ప్రతిరోజు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 10.30 వరకు ఉంటుంది. ఎంట్రీ ఫీజు పెద్దవారికి రూ.40 ఉంటుంది. ఐదేళ్లలోపు చిన్నారులకు ఉచిత ప్రవేశం. ఎగ్జిబిషన్ కు వచ్చే ప్రజల సౌకర్యార్థం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

*(సర్ అమర్‌బీర్ సింగ్జీ మరియు ఫేస్‌బుక్ సౌజన్యంతో)*

-సయ్యద్ ఖైజర్,
m : 9030 6262 88
e:desk.deccan@gmail.com



# ‘ఉర్దూ’ ఎవరిది?

ఉర్దూ ఎవరి భాష? ఈ అంశం మీద రాసిన కథల పుస్తకంతో బాటూ, సుప్రీంకోర్టు వెలువరించిన ఓ తీర్పు నన్ను ఆకర్షించాయి. 'Whole Urdu is it any away' అన్న కథల పుస్తకంలో 16 కథలు వున్నాయి. ఉర్దూలో రాసిన కథలకి ఇంగ్లీషు అనువాదం. ఈ కథలని అనువదించి ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించిన వ్యక్తి రక్షానంద జలీల్. ఈ కథలు అన్నీ ముస్లింలు కాని రచయితలు రాసిన కథలు. క్రిష్ణచందర్, గుల్జార్, రాజేందర్‌సింగ్ బేడీ లాంటి కథకుల కథలెన్నో ఇందులో వున్నాయి. క్రిష్ణచందర్ కథతో మొదలై గుల్జార్ రాసిన కథతో ముగుస్తుంది. ఇది విస్తృతమైన సంకలనం కాదని జలీల్ తన ముందు మాటలో చెప్పుకున్నారు. ఈ కథల పుస్తకానికి సంపాదకులు రాసిన ముందుమాట ఆలోచింపచేస్తుంది. కథల పుస్తకం పేరే ఆలోచింప చేస్తుంది.




ఇక తీర్పు విషయానికి వస్తే అది మిసెస్ వర్షబాయి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసు 2025 లైవ్‌లా (సుప్రీంకోర్టు) 427. ఈ కేసులో సుప్రీంకోర్టు ఉర్దూ భాష గురించి చెప్పిన విషయాలు కూడా మనలను ఆలోచింపచేస్తాయి. ఆనందింపచేస్తాయి కూడా.

‘మరాఠీ, హిందీ భాషల మాదిరిగా ఉర్దూ కూడా ఇండో, ఆర్యన్ భాష. అది విదేశీ భాషకాదు. అది ఇక్కడే పుట్టింది. ఇక్కడే అభివృద్ధి చెందింది’ ఇదీ సుప్రీంకోర్టు వ్యాఖ్యానం ఈ తీర్పులో.

కథల పుస్తకాన్ని గుల్జార్‌కి అంకితం ఇచ్చారు. దాంతో పాటూ ఉర్దూ గురించి గుల్జార్ చెప్పిన మాటలని ఉటంకించారు. అవి ఇలా వుంటాయి.

మే కైసా ఇస్క్ హై ఉర్దూ జబాన్ కా
మజా గుల్తా హై లాజ్‌ఫాన్ కా జబాన్ పర్
కి జైసే పాన్ మే మహంగ్ గేమ్ గుల్తా హై
కై కైసే ఇస్క్ హై ఉర్దూ జబాన్ కా....

ఉర్దూ భాష మీద అంత ప్రేమ గుల్జార్‌కి, ఉర్దూ పదాలు నాలుక మీద ఆనందంతో తిరుగుతాయి. ఖరీదైన గమ్ తమలపాకులలో తిరుగుతున్నట్టు. ఇదే ఉర్దూ భాష మీద వున్న ప్రేమ.

ఇంత మంది ప్రేమిస్తున్న ఉర్దూ ఎవరి భాష? ముస్లింల భాషనా? భారతీయ ముస్లింల భాషనా? పాకిస్తాన్‌లో వున్న ముస్లింల భాషనా? మన దేశంలోని ఉత్తర భారతదేశపు భాషనా? మైనారిటీ ముస్లింలు భాషనా..? ఒకప్పుడు ఉర్దూకి పుట్టినిల్లు అయిన దక్కన్ పీఠభూమి సంగతి ఏమిటీ? దక్షిణ భారతదేశం ఉర్దూని కోరుకోదా? భోపాల్ ఉర్దూని కోరుకోదా? తెలంగాణ కోరుకోదా? ఒకప్పుడు వలీ దక్కన్‌ని తన ముద్దు బిడ్డగా గర్వంగా చెప్పుకున్న గుజరాత్ సంగతి ఏమిటి? అసలు ఈ ఉర్దూ ఎవరిదీ? ఇవే ఉర్దూ ఎవరిది? అన్న కథల పుస్తక సంపాదకులు రక్షానంద జలీల్ తన ముందు మాటలో వేసిన ప్రశ్నలు.

భౌగోళిక విషయాలను దూరంగా పెట్టితే ఉర్దూపై ఎవరు హక్కులు సాధించగలరు? కవులూ, రాజకీయ నాయకులు మాత్రమే ఉర్దూ భాష మాట్లాడగలరా? రోమాన్స్, విప్లవం గురించి పాటలు పాడే కవులది మాత్రమేనా ఉర్దూ? తమ ప్రసంగాలకి ఉత్తేజాన్ని ఇవ్వడానికి ఉపయోగించుకునే రాజకీయ నాయకులది మాత్రమేనా ఈ ఉర్దూ భాష? హమ్ దేఖేంగే, ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదాలు కోరుకునే వారికి ఉర్దూ భాష ఇష్టమా? ఉర్దూ కవిత్వంతో బాటూ ఉర్దూ గద్యం ఎలా వుంది? ఉర్దూ జర్నలిజమ్ మాటేమిటి

ఈ ప్రశ్నల నేపథ్యంలో ‘ఎవరిది ఉర్దూ’ అన్న కథల పుస్తకాన్ని వెలువరించారు. రాబోయే సంవత్సరాలలో ఉర్దూ ఎలా మనుగడ కొనసాగిస్తుందో చూడాలి? ఉర్దూ భాషని ముస్లింలతో ముడిపెట్టి చూస్తున్నంత కాలం ఉర్దూ భాషని పూర్తిగా అర్థం చేసుకోలేం. ఇది ముస్లింలకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. భాషకు సంబంధించిన అంశం.

ఇక, తీర్పుని పరిశీలిస్తే ఈ తీర్పుని జస్టిస్ సుదాన్షు ధులియా, జస్టిస్ కే. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం వెలువరించింది. ఉర్దూ భాష వాడకం అంటే ‘సమర్థవంతమైన సంభాషణ’ మాత్రమేనని, భాషా వైవిధ్యాన్ని గౌరవించాలని కోర్టు అభిప్రాయపడింది.

### ఉర్దూ పరాయి భాష కాదు : సుప్రీంకోర్టు

ఉర్దూ భాష మనకు పరాయిది కాదు. ఇది ఇక్కడే పుట్టి

ఇక్కడే వర్ధిల్లింది. ఉర్దూ పరాయి భాష అన్న అపోహ నుండి పక్షపాతం పుడుతుంది. ఈ గడ్డపై పుట్టిన భాష ఉర్దూ. విభిన్న సాంస్కృతిక నేపథ్యాలకు చెందిన ప్రజలు తమ భావాలను పంచుకోవడానికి, సంభాషించుకోవడానికి అవసరమై పుట్టిన భాష ఉర్దూ. మనదేశంలో ఉర్దూ అభివృద్ధి చెంది వర్ధిల్లింది. తరువాత కాలంలో మరింత మెరుగుపడి ప్రఖ్యాత కవులకి, రచయితలకి ఇష్టమైన భాషగా మారింది. మన దేశంలోని సామాన్య ప్రజలు ఉపయోగించే భాషలో ఉర్దూ భాష పదాలు లెక్కకు మించి వున్నాయి. అవి వారికి తెలియకపోవచ్చు. హిందీ భాషలో రోజువారి సంభాషణ వుండదని అనడం సరైంది కాదు. ఉర్దూ పదాలు లేకుండా, ఉర్దూ నుంచి వచ్చిన పదాలు లేకుండా హిందీ భాష కూడా లేదు. ఆ మాట కొస్తే 'హిందీని అన్న పర్షియన్ పదం నుంచి హిందీ వచ్చింది. భారతీయ భాషల నుంచి ఎన్నో పదాలను ఉర్దూ భాష స్వీకరించింది. మరీ ముఖ్యంగా సంస్కృతం నుంచి ఎన్నో పదాలు వచ్చి ఉర్దూలో చేరాయి.




కోర్టు పరిభాషలో కూడా ఎన్నో ఉర్దూ పదాలు, పదబంధాలు వచ్చి చేరాయి. అదాలత్, అలఫ్‌నామా, పేషీ, రిట్ ఇలా పేర్కొంటూ పోతే ఎన్నో పదాలు. సుప్రీంకోర్టు అధికారిక భాష రాజ్యాంగంలోని 348 ప్రకారం ఇంగ్లీషు అయినప్పటికీ ఉర్దూ పదాలు ఎన్నో కోర్టు పరిభాషలో వున్నాయి.

**భాష మతం కాదు:** భాష అనేది మతం కాదు. అది మతానికి ప్రాతినిధ్యం వహించదు. భాష అనేది ఒక ప్రాంతానికి, ఒక సమాజానికి, ప్రజలకి చెందుతుంది. మతానికి కాదు. భాష అనేది ఒక సంస్కృతి. ప్రజల నాగరిక ప్రగతిని కొలవడానికి భాష అనేది ఒక కొలమానం. గంగా జమునా తహెజీబ్‌ల సంస్కృతికి అత్యుత్తమ నమూనా ఉర్దూ. భాష మనం అభ్యసించడానికి ఒక సాధనంగా మారక ముందు అది కమ్యూనికేషన్‌కి ఉపయోగపడింది.

ఈ తీర్పు మౌలౌద్ బెంజాది చెప్పిన ఒక మాట ద్వారా మొదలవుతుంది. 'మీరు ఒక భాషను నేర్చుకున్నప్పుడు మీరు కేవలం ఒక కొత్త భాషలో మాట్లాడటం, వ్రాయడం కోసం మాత్రమే నేర్చుకోరు. మానవ జాతి పట్ల విశాల దృక్పథం, ఉదారత, సహనం, దయ, సానుభూతి వుండటానికి నేర్చుకుంటారు.

భాష ఎవరిదైనా, ఏ భాష పట్ల విముఖత వుండడానికి వీల్లేదు. ప్రతి భాషా బతకాలి పరిఢవిల్లాలి.

ఉర్దూ అనేది ముస్లిం భాష అనే అభిప్రాయాన్ని తుడిచి వేయడానికి 'ఎవరి భాష ఉర్దూ' అన్న కథా సంకలనం బలపడుతుంది. ఈ సంకలనం వెలువరించిన రక్షానంద జలీల్‌ని అభినందించాల్సిందే. ఎందుకంటే ఇందులోని 16 కథలు ముస్లింలు కాని వ్యక్తులు ఇష్టంగా ఉర్దూలో రాసిన కథలు.

**–మంగారి రాజేందర్ (జింబో)**
m : 9440483001
e : rajenderzimbo@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు

**మ**న **దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**




**చిరునామా :**

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com



# ప్రకృతి వారసత్వానికి కొండెత్తు తోరణం

**విషయం:** అంతర్జాతీయ వారసత్వ కట్టడాలు, ప్రాంతాలు

**స్థలం:** తిరుమల కొండలు, ఆంధ్రప్రదేశ్

**దాఖలు చేసిన తేదీ:** 27-8-2025

**ప్రాధాన్య ప్రమాణాలు:** (vii)(viii)(x)

**విభాగం:** నేచురల్

**దాఖలు చేసింది:** యునెస్కోలోని భారత శాశ్వత ప్రతినిధి బృందం

**రెఫరెన్స్ నంబర్:** 6894

**ఉనికి:** శేషాచలం అడవులు, శ్రీవేంకటేశ్వర నేషనల్ పార్క్

తిరుమల కొండలలోని తిరుమలలోని ఎపార్కియన్ అన్-కన్ఫర్మిటీ (రెండు వేర్వేరు కాలాలకు చెందిన రాతి పొరల మధ్య ఉన్న భారీ కాల వ్యత్యాసం) అనేది ప్రపంచవ్యాప్తంగా కూడా అపారమైన సహజ, సౌందర్య ప్రాముఖ్యత కలిగిన ఒక భూగర్భ శాస్త్ర లక్షణం. "ఎపార్కియన్ అన్-కన్ఫర్మిటీ" అనే పదం పురాతన ప్రీకాంబ్రియన్ శిలలకు, వాటిపై ఉన్న చాలా కొత్త భూగర్భ నిర్మాణాలకు మధ్య ఉన్న సరిహద్దును సూచించే ఒక అరుదైన, ఆసక్తికరమైన భూగర్భ శాస్త్ర విభాగాన్ని తెలియజేస్తుంది. భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు కనుమలలో ఉన్న తిరుమల కొండలు, ఈ భూగర్భ శాస్త్ర దృగ్విషయం ద్వారా సుసంపన్నమైన కొన్ని అద్భుతమైన ప్రకృతి దృశ్యాలను అందిస్తాయి.

తిరుమల కొండల సహజ తోరణం (శిలాతోరణం) భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల వెంకటేశ్వర ఆలయానికి సమీపంలో ఉన్న ఒక ప్రత్యేకమైన రాతి నిర్మాణం. ఇది అరుదైన భౌగోళిక అద్భుతం. అంతే కాదు, ఆసియాలోని అతి కొద్ది సహజ రాతి తోరణాలలో ఒకటి. ఈ తోరణం 1.5 బిలియన్ సంవత్సరాలకు పైగా పురాతనమైనదని విశ్వసిస్తున్నారు. ఇది క్వార్ట్జైట్ శిల కోత, వాతావరణం కారణంగా సహజంగా ఏర్పడింది. ఇది దాదాపు 8 మీటర్లు (26 అడుగులు) వెడల్పు, 3 మీటర్లు (10 అడుగులు) ఎత్తు ఉంటుంది. ఈ తోరణాన్ని హిందువులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఎందుకంటే ఇది సంప్రదాయ ఆలయ ద్వారాలను (తోరణం) పోలి ఉంటుంది. అంతేగాకుండా శ్రీవేంకటేశ్వర స్వామి పౌరాణిక గాథతో ముడిపడి కూడా ఉంటుం ది. తిరుమల ఆలయం నుండి 1 కి.మీ దూరంలో ఉన్న ఈ ప్రదేశం యాత్రికులు, ప్రకృతి ఔత్సాహికులకు ప్రసిద్ధ ఆకర్షణ. తోరణం చుట్టూ ఉన్న ప్రాంతం ప్రశాంతంగా ఉంటుంది. ఇది వివిధ అంశాల అన్వేషణకు అద్భుతమైన ప్రదేశంగా ఉంటుంది.

తిరుమల కొండలు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలో ఉన్నతమైన పర్వత ప్రాంతాలు. సముద్ర మట్టానికి సుమారు 980 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ కొండలు అద్భుతమైన సాంస్కృతిక,

సహజ వారసత్వానికి నిలయం. తిరుమల కొండలను తూర్పు కనుమలలోని శేషాచలం శ్రేణి (ఇది జీవవైవిధ్య సంరక్షణ కేంద్రంలో భాగం)లోని ఏడు శిఖరాల సమూహంగా పరిగణిస్తారు. ఈ కొండలు వరుసగా శేషాద్రి, నీలాద్రి, గరుడాద్రి, అంజనాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి.

ఈ కొండలలో ఎపార్కియన్ అన్-కన్ఫర్మిటీ ఉంది. ఇది భూగర్భ చరిత్రలో అసాధారణమైన ప్రశాంతత కాలాన్ని సూచించే, శిలాస్తర శాస్త్రపరంగా ప్రాముఖ్యత కలిగిన ఒక ప్రధాన అంతరాయం. (దీని 'స్తరానుక్రమ ప్రాముఖ్యత' ఏమిటంటే, ఇది అత్యంత పురాతనమైన ఆర్కియన్ కాలపు శిలలకు, తర్వాతి కాలానికి చెందిన కడప శిలా వ్యవస్థకు మధ్య ఉన్న సుమారు వందల కోట్ల ఏళ్ల కాల అంతరాన్ని స్పష్టంగా చూపిస్తుంది.)

### తిరుగులేని సార్వత్రిక విలువ

తిరుమల కొండలలోని ఎపార్కియన్ అన్‌కన్ఫార్మిటీ అసాధారణమైన భౌగోళిక సంపర్క ప్రాంతాన్ని అందిస్తుంది. (తిరుమలలోని ఎపార్కియన్ అన్-కన్ఫర్మిటీ వద్ద, అన్నింటి కంటే కింద ఉండే పురాతన శిలలే ఈ "ఆర్కియన్ గ్నీస్" శిలలు. వీటి పైన సుమారు 1.5 బిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడిన కడప శ్రేణి శిలలు ఉంటాయి). ఇక్కడ 2.5 బిలియన్ సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల పురాతన ఆర్కియన్ గ్నీస్‌లు కడప సూపర్‌గ్రూప్ యంగర్ ప్రొటె రోజోయిక్ అవక్షేపణ శిలలను దృశ్యమానంగా కలుస్తాయి. భూమి భౌగోళిక రికార్డులో ఒక స్మారక అంతరాన్ని సంగ్రహిస్తాయి. ప్రపంచంలో అత్యంత ప్రాప్యత గల, బాగా సంరక్షించబడిన అన్‌కన్ఫార్మిటీలలో ఒకటిగా ఇది నిలుస్తుంది. జాతీయ జియో-హెరిటేజ్ స్మారక చిహ్నంగా గుర్తింపు పొందిన ఈ అరుదైన దృగ్విషయం, ఆసియాలోని కొన్ని సహజ రాతి తోరణాలలో ఒకటైన తిరుమల సహజ తోరణం ద్వారా మరింత సుసంపన్నం చేయబడింది. వాటి భౌగోళిక ప్రాముఖ్యతకు మించి, ఈ నిర్మాణాలు శేషాచలం బయోస్పియర్ రిజర్వ్, శ్రీ వేంకటేశ్వర నేషనల్ పార్క్‌లో ఉన్నాయి. ఈ అడవులు అంతరించిపోతున్న సైకాస్ బెడ్‌డోమీ, జెర్డాన్స్ కోర్సర్‌తో సహా విభిన్న, స్థానిక వృక్షజాలం, జంతుజాలానికి నిలయంగా ఉన్నాయి. తిరుమల కొండలు పురాతన భూమి చరిత్ర, అసాధారణమైన సహజ సౌందర్యం, పర్యావ రణ సంపద, సుస్థిర ఆధ్యాత్మిక ప్రాముఖ్యతల అరుదైన కలయికను కలిగి ఉన్నాయి. ఇవన్నీ దీనిని అత్యుత్తమ సార్వత్రిక విలువ కలిగిన ప్రదేశంగా అర్హత పొందేలా చేస్తాయి. అత్యుత్తమ సార్వత్రిక విలువ సమర్థన క్రింద యునెస్కో జాబితా చేసిన క్రింది ప్రమాణాలలో ప్రతిబింబిస్తుంది.



**ప్రమాణం (vii):** ఎపార్కియన్ అన్-కన్ఫర్మిటీ (భూగర్భ విరామం), శిలాతోరణం, పచ్చని అడవులు, అనేక కాలానుగుణ జలపాతాలతో కూడిన తిరుమల కొండలు.. భారత ఉపఖండంలోని తూర్పు కనుమల అద్భుతమైన వర్షాధార అరణ్య దృశ్యాన్ని ఆవిష్కరిస్తాయి. ముఖ్యంగా వర్షాకాలంలో, బంగాళాఖాతం నుండి వచ్చే ఆగ్నేయ మేఘాలు ఈ కొండలను తాకినప్పుడు, ఈ ప్రాంతం ఎంతో మనోహరంగా మారుతుంది. ఒక అద్భుతమైన వర్షాకాలపు ప్రకృతి దృశ్యాన్ని సృష్టిస్తుంది.

తిరుమలలోని ఎత్తైన ప్రదేశాల నుండి కనిపించే దృశ్యాలు, చుట్టూ ఉన్న లోయలు, అక్కడక్కడా వెలసిన ఆలయాలు, దట్టమైన అడవులు, పర్వత శ్రేణులతో అద్భుతమైన అనుభూతిని కలిగిస్తాయి. ఇక్కడి కొండల ఏటవాలు ప్రాంతాలు, భూగర్భ విరామం గురించి అధ్యయనం చేసేందుకు వీలుగా బయటపడిన రాతి శిలలు, ప్రశాంతమైన, భక్తిపూర్వకమైన అనుభూతిని పంచుతూ సందర్శకులను ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి.

**ప్రమాణం (viii):** కొండల వెంబడి బహిర్గతమైన రాతి నిర్మాణాలలో ఎపార్కియన్ అసంబద్ధతను చూడవచ్చు. ఇక్కడ పురాతన శిలలు (2.5 బిలియన్ సంవత్సరాల నాటివి) తరువాతి కాలానికి చెందిన పొరలను కలుస్తాయి. పాత క్రస్ట్ కఠినమైన, కాలం చెల్లిన గ్రానైట్, గ్నీస్ నిర్మాణాలు, వాటి పైన ఉన్న మృదువైన, అవక్షేపణ పొరల మధ్య దృశ్యమాన వ్యత్యాసం భూమి భౌగోళిక చరిత్ర అద్భుత దృశ్య కథనాన్ని సృష్టిస్తుంది. ఈ నిర్మాణాలు ఈ ప్రాంతం ప్రత్యేక సౌందర్యానికి దోహదం చేస్తాయి. ఇది పురాతన భూగర్భ విశేషాలను చుట్టుపక్కల భూభాగపు పచ్చదనంతో కలుపుతుంది.

ఈ కొండలు 'ఎపార్కియన్ అన్-కన్ఫర్మిటీ'కి (భూగర్భ విరామం) నెలవు. ఇది పవిత్రమైన తిరుమల కొండలకు వెళ్లే ఘాట్ రోడ్డు మార్గంలో కనిపిస్తుంది. ఈ అన్-కన్ఫర్మిటీ అనేది ప్రోటెరోజోయిక్ సెడిమెంటరీ బేసిన్ ఏర్పడటాన్ని, అంటే ఆర్కియన్ గ్నీస్ శిలలపైన మొట్టమొదటిసారిగా అవక్షేపణ శిలలు ఏర్పడటాన్ని సూచిస్తుంది. కడప బేసిన్‌లో, దీనిని 'గుల్చేరు కాంగ్లోమెరేట్' సూచిస్తుంది. ఇది కడప సూపర్‌గ్రూప్‌లో మొట్ట మొదటి అవక్షేపణ విభాగం. ఈ బేసిన్ ఏర్పడటం అనేది సుమారు 2.0 నుండి 2.1 బిలియన్ ఏళ్ల క్రితం ప్రారంభమైందని పలువురు పరిశోధకులు అంగీకరించారు.

భూమి భూగర్భ చరిత్రలో ఒక అద్భుతమైన ప్రశాంతత నెలకొన్న కాలాన్ని ప్రతిబింబిస్తూ, ఈ విశేషం ఎంతో 'స్తరాను




క్రమ ప్రాముఖ్యతను' కలిగి ఉంది. 2001లో, భారత భూగర్భ సర్వేక్షణ సంస్థ (జీఎస్ఐ) ఈ ఎపార్కియన్ అన్-కన్ఫర్మిటీని 'జాతీయ భూగర్భ వారసత్వ చిహ్నం' (నేషనల్ జియో హెరిటేజ్ మాన్యుమెంట్)గా ప్రకటించింది. ఇది కర్నూలు - నంద్యాల రహదారిలో కూడా కనిపిస్తుంది, అక్కడ గద్వాల్ షిస్ట్ బెల్ట్‌పై 20 మీటర్ల గుల్చేరు ఫార్మేషన్ పొరలు ఉన్నాయి. అలాగే వేల్పూర్తి - పులివెందుల రహదారిలోని పర్నపల్లి వద్ద కూడా ఆర్కియన్ గ్రానైటిక్ గ్నీస్ శిలలపై అంతే మందపాటి గుల్చేరు ఫార్మేషన్ విస్తరించి ఉంది.

**ప్రమాణం (x):** తిరుమల కొండలు శ్రీవేంకటేశ్వర జాతీయ ఉద్యానవనం, శేషాచలం బయోస్పియర్ రిజర్వ్‌లో భాగం. తూర్పు కనుమలలో అత్యంత అద్భుతమైన వృక్షసంపద మండలాల్లో ఒకటిగా తిరుమల కొండలను చెప్పవచ్చు. ఇవి గొప్ప పుష్ప వైవిధ్యం కలిగి ఉన్నాయి. వాటిలో కొన్ని గొప్ప ఔషధ, వృక్షసంబంధ, ఆర్థిక ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. అనేక వృక్ష జాతులు ఈ ప్రాంతానికి చెందినవిగా పరిగణించబడతాయి. ఈ కొండలు ఉష్ణమండల అడవులు, స్థానిక వృక్షజాలం, జంతుజాలంతో గొప్ప జీవవైవిధ్యానికి నిలయంగా ఉన్నాయి. ఎపార్కియన్ అన్‌కన్ఫార్మిటీ వంటి పురాతన భౌగోళిక నిర్మాణాల ఉనికి విభిన్న పర్యావరణ వ్యవస్థలకు మద్దతు ఇవ్వడం ద్వారా ఈ ప్రాంతం సహజ సౌందర్యాన్ని పెంచుతుంది. ఈ నేషనల్ పార్క్ అనేక జలపాతాలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడి వృక్ష సంపద లోయలలో తేమతో కూడిన ఆకురాల్చే అడవు లతో కూడిన పొడి ఆకురాల్చే మిశ్రమ అడవిని కలిగి ఉంటుంది. అటవీ వాలులు సుందరమైనవి మాత్రమే కాకుండా, అంతరించిపోతున్న జెర్డాన్స్ కోర్సర్, ఇతర జాతుల వన్యప్రాణుల పరిరక్షణకు చాలా ముఖ్యమైనవి. ఇవన్నీ కూడా ఈ ప్రాంతాన్ని దృశ్యపరంగా అద్భుతంగా మాత్రమే కాకుండా పర్యావరణపరంగా కూడా ముఖ్యమైనదిగా చేస్తాయి.

ఈ బయోస్పియర్ రిజర్వ్ 106 జాతుల సీతాకోకచిలుక జాతులు, 7 ఉభయచర జాతులు, 34 సరీసృపాల జాతులు, 215 జాతుల పక్షులతో సమృద్ధిగా ఉన్న జంతుజాలంతో నిండి ఉంది. అంతరించిపోతున్న జాతి అయిన ఇండియన్ గోల్డెన్ గెక్కో కలోడాక్టిలోడ్స్ ఆరియస్‌ను ఈ ప్రాంతంలోని కొండల నుండి తిరిగి కనుగొన్నారు.

తిరుమల కొండలలోని రెండు భౌగోళిక ప్రదేశాలను ఇప్పటికే జాతీయ భౌగోళిక వారసత్వ స్మారక చిహ్నంగా గుర్తించారు. ఈ కొండలు శ్రీవేంకటేశ్వర జాతీయ ఉద్యానవనంలో భాగం. అవి దట్టమైన అడవులతో కూడిన ప్రవేశించలేని ప్రాంతాలతో కప్పబడి, తద్వారా నిర్మాణాలను సంరక్షిస్తున్నాయి.

తిరుమల కొండలలోని ఎపార్కియన్ అననుగుణత అనేది కేవలం ఒక భూగర్భ సంపద మాత్రమే కాదు, సహజ సౌందర్యం, గొప్ప జీవవైవిధ్యం. భూమి సుదీర్ఘ చరిత్రతో అనుసంధానాన్ని మేళవించే ఒక అపారమైన సౌందర్య ప్రాముఖ్యత కలిగిన ప్రాంతం కూడా.

**ఇదే విధమైన ప్రాంతాలతో పోలికలు**

ఎపార్కియన్ అన్‌కన్ఫార్మిటీ అనేది ఒక అసాధారణ భౌగోళిక, సాంస్కృతిక మైలురాయి. 1872లో భూవిజ్ఞాన శాస్త్రవేత్త రాబర్ట్ బ్రూస్ ఫుట్ మొదటిసారిగా శాస్త్రీయంగా గుర్తించిన ఈ అన్‌కన్ఫార్మిటీ, ఆర్కియన్ గ్రానైట్ గ్నీస్ (2.5 బిలియన్ ఏళ్ల వయస్సు) - కడప సూపర్‌గ్రూప్ ప్రొటెరోజోయిక్ అవక్షేపణ పొరల (1800 నుండి 1400 మిలియన్ ఏళ్ల వయస్సు) మధ్య కనిపించే స్ట్రాటిగ్రాఫిక్ సంబంధాన్ని సూచిస్తుంది. తద్వారా భూమి భౌగోళిక చరిత్రలో గణనీయమైన అంతరాన్ని సంగ్రహిస్తుంది. ఈ స్థలాన్ని అసాధారణంగా చేసేది దాని భౌగోళిక స్పష్టత, ప్రాచీనత మాత్రమే కాకుండా దక్షిణాసియాలోని అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రాలలో ఒకటైన ప్రసిద్ధ తిరుమల ఆలయ సముదాయంతో సహా గొప్ప సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రకృతి దృశ్యంలో దాని ఏకీకరణ కూడా. దీనిని ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చిన ఇతర ప్రాంతాలతో పోల్చవచ్చు, ఇవి ఇలాంటి ద్వంద్వ వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయి.

**చైనాలోని 'మౌంటైన్ రిసార్ట్, పరిసర దేవాలయాలు' (చెంగ్డే)**

చైనాలోని చెంగ్డేలో ఉన్న 'మౌంటైన్ రిసార్ట్, పరిసర





దేవాలయాలు' దీనికి ఒక అర్థవంతమైన పోలికను అందిస్తాయి. 18-19వ శతాబ్దాల మధ్య నిర్మించబడిన చెంగ్డే, రాజభవనాలు, దేవాలయాలను సరస్సులు, అడవుల వంటి సహజ దృశ్యాలతో శ్రావ్యంగా ఎలా అనుసంధానించవచ్చో నిరూపిస్తుంది. ప్రధానంగా ఇది ఒక సాంస్కృతిక ప్రదేశం అయినప్పటికీ, ప్రకృతితో అది కలిగి ఉన్న సౌందర్య సామరస్యం గమనార్హం.

అదేవిధంగా, ఎపార్కియన్ అన్-కన్ఫర్మిటీ కూడా అటవీ సంపద, పర్యావరణ వైవిధ్యం కలిగిన తిరుమల కొండలలో నిక్షిప్తమై ఉంది. వెయ్యేళ్లకు పైగా భక్తులను ఆకర్షిస్తున్న దేవాలయాలు దీని చుట్టూ ఉన్నాయి. అయితే, ఎక్కువగా మానవ నిర్మితమైన చెంగ్డేతో పోలిస్తే, ఎపార్కియన్ సైట్ మానవ నాగరికత కంటే ఎంతో పురాతనమైన భారీ సహజ భూగర్భ విశేషాన్ని మన ముందు ఉంచుతుంది. అదే సమయంలో, ఈ ప్రకృతి దృశ్యంలో పాతుకు పోయిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఆచారాలకు ఇది ఆలంబనగా నిలుస్తోంది. ఆ విధంగా, సహజసిద్ధమైన భౌగోళిక అంశాలే ఆధ్యాత్మిక గుర్తింపునకు పవిత్ర ఆధారాలుగా ఎలా మారతాయో చూపుతూ, చెంగ్డేలో కనిపించే నిర్మిత-సహజ సామరస్యాన్ని మించి ఈ ప్రదేశం విశిష్టతను చాటుతోంది.



**మౌంట్ అథోస్, గ్రీస్**

గ్రీస్‌లోని 'మౌంట్ అథోస్' మరొక పోలికను అందిస్తుంది. యునెస్కో ప్రమాణాలు (vi), (vii) కింద గుర్తింపు పొందిన మౌంట్ అథోస్, ఒక పవిత్ర ఆధ్యాత్మిక సమాజం, అద్భుతమైన సహజ సౌందర్యం కలిగిన ప్రదేశం. ఇక్కడ శతాబ్దాలుగా సన్యాసుల జీవన విధానం బాహ్య ప్రపంచానికి దాదాపు పూర్తిగా దూరంగా కొనసాగుతోంది. అదేవిధంగా, తిరుమల కొండలు వేల సంవత్సరాలుగా ఒక పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్నాయి. ఇక్కడ పురాతన కాలం నుండి మతపరమైన ఆచారాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి.

కఠినమైన, ఎత్తైన ప్రాంతాల ప్రకృతి దృశ్యాలు ఆధ్యాత్మిక వ్యక్తీకరణకు ఎలా ఆశ్రయాలుగా నిలిచాయో, కాలక్రమేణా అవి ఎలా బహుళార్థాలను సంతరించుకున్నాయో ఈ రెండు ప్రదేశాలు నిరూపిస్తాయి. అయితే, మౌంట్ అథోస్ ప్రధానంగా సన్యాసుల నివాసంగా, మతపరమైన ప్రాంతంగా మాత్రమే ఉన్నప్పటికీ, తిరుమల కొండలు మరో అదనపు కోణాన్ని కలిగి ఉన్నాయి: ఇది శాస్త్రీయంగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన మైలు రాయి, భూమిపై అత్యంత లోతైన భౌగోళిక అంతరాలలో ఒకదానిని ఇది స్పష్టంగా ప్రదర్శిస్తుంది.

ఈ పోలికలలో ఎపార్కియన్ అన్‌కన్ఫార్మిటీని ప్రత్యేకంగా చెప్పదగినదిగా చేసేది ఏమిటంటే, దాని ప్రదర్శించదగిన భౌగోళిక చరిత్ర, కొనసాగుతున్న సాంస్కృతిక ప్రాముఖ్యత యొక్క ప్రత్యేకమైన కలయిక. ఇది ఒక బిలియన్ సంవత్సరాలకు పైగా తప్పిపోయిన భౌగోళిక రికార్డును దృశ్యమానంగా సంగ్రహిస్తుంది - భారత ఉపఖండాన్ని ఆకృతి చేసిన లోతైన కాల ప్రక్రియలకు ఇది ఒక అద్భుతమైన ఉదాహరణ - ప్రపంచంలో అత్యధికంగా సందర్శించే తీర్థయాత్రలలో ఒకదానికి పవిత్ర పునాదిగా పనిచేస్తూనే ఉంది. పురాణాలు, ఆచారాలు, ఆలయ సంప్రదాయాలతో ముడిపడిన తిరుమల కొండల పవిత్ర భౌగోళికం, సైట్ భౌతిక భౌగోళికంతో విడదీయరాని విధంగా ముడిపడి ఉంది. భూమి పురాతన పరిణామం, శాశ్వత సాంస్కృతిక అభ్యాసంగా ఈ ద్వంద్వ కథనం - ఎపార్కియన్ అన్‌కన్ఫార్మిటీని ప్రపంచ వారసత్వ ప్రదేశాలలో ఒక ప్రత్యేక స్థానంలో ఉంచుతుంది.

- ఎన్. వంశీమోహన్
m : 98489 02520
e: vamsiglobal@gmail.com


ఆత్మాహుతి వీరగల్లు


పంచ వీరులు


చాముండి

# తరుగని చారిత్రక సిరుల తరిగొప్పుల

తెలంగాణాలోని ఒక్కొక్క గ్రామం బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ, ఇస్లాం, క్రైస్తవ మతధర్మాల ఆలయాలతో, గ్రామదేవతలతో, వీరగల్లులతో, అనంతమైన చరిత్రపూర్వయుగాల ఆనవాళ్ళతో, పురావస్తుసంపదలతో అలరారుతున్నాయి. 12వేల గ్రామాలున్న తెలంగాణా చరిత్రలోతుల్ని మథించినకొద్దీ అపూర్వమైన చారిత్రక సంపదలు వెలుగుచూస్తాయి. మానవ నాగరికతా, సంస్కృతుల వికాసానికి, విశ్వాసాల వైవిధ్యానికి నిలయాలు ఈ గుడులు, గోపురాలు. వాటిలోని శిల్పాలు, శైలులు, నిర్మాణాలు. అమూర్తమైన ఆలోచనలకు పరికల్పన చేయబడిన మూర్తి, ప్రతిమలు లెక్కకు మిక్కిలి కళానైపుణ్యంతో తీర్చిదిద్ద బడ్డాయి. అన్నీ మానవీకరించబడ్డ దైవభావనలు. ఇట్లుంటుందేమో దైవమని చేసిన భావనలు అగుపించే రూపాలు. ఏ ఊరి కడపలో కాలుపెట్టినా ఎంతో చరిత్ర మనకు అందుతుంది.

జనగామ జిల్లాలో తరిగొప్పుల గ్రామం చాలా ప్రాచీన గ్రామం. చుట్టుముట్టు వున్న గ్రామాలు కూడా పాతవే. వాటికి రెండు, మూడు పాటిగడ్డ (పాత వూరు శిథిలాలు) లుండడం వాటి పురాతనచరిత్రకు సాక్ష్యాలు.


బురుజు

ఈ గ్రామంలో కవి, మిత్రుడు కే.శే. జంగ వీరయ్య ఎన్నోసార్లు మమ్మల్ని తరిగొప్పులకు రమ్మన్నాడు. మాదే ఆలస్యం. 17.03.18న నేను, అరవింద్ ఆర్య, చంటి ముగ్గురం తరిగొప్పులకు వెళ్ళాం. జంగ వీరయ్య ఆదరంగా గ్రామంలోని దేవాలయాలను, శిథిలాలను వెంటతీసుకుని వెళ్ళి మాకు చూపించాడు. తరిగొప్పుల గ్రామానికి బయట గోలి మల్లన్నకుంట దగ్గర, చెప్యాల ప్రసాదశర్మ భూమి వుంది. దాన్నిపుడు కర్రె చంద్రయ్య కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. పడావుపడ్డ భూమిని దున్ని మొక్కజొన్న వేసిండు. ఆ చేను నడుమ వదిలేసిన జాగా కొంత వుంది. దాంట్లో వినాయకుడు, భైరవుడు విగ్రహాలు, మరికొన్ని శిల్పాలు మట్టికప్పుకుని వున్నాయి.

కొంచెం శ్రమపడి బయటపడేసేసరికి అద్భుతమైన శిల్పసంపద బయటపడ్డది. భైరవుడు చతుర్భుజుడు, ముందు కుడిచేతిలో ఖడ్గం, వెనకచేతిలో ఢమరుకం, ముందు ఎడమచేతిలో రక్తపాత్ర, వెనక చేతిలో త్రిశూలం వున్నాయి. జ్వాలాజటాఝూటం, దీర్ఘకర్ణాలు, చెవులకు కుండలాలు, ఆకర్ణాంత నేత్రాలు, నోటిలో కోరలు, మెడలో కంఠిక, సర్ప జంధ్యం, కపాలాల మొలతాడు, దిగంబరత్వంతో మూడున్నర అడుగుల ఎత్తు, వైతస్తిక పాదభంగిమలో ఉన్న ఈ స్థానక శిల్పం అపూర్వం అనిపించింది. కపాలమాల ధరించివున్న ఈ భైరవుడు త్రినేత్రుడు. కాలభైరవుడు.

అక్కడే వున్న వినాయకుడు చతుర్భుజుడు. శూర్పకర్ణుడు, ఏకదంతుడు. ముందరి కుడిచేతిలో విరిగిన దంతము, వెనకచేతిలో పరశువు (గొడ్డలి), ముందరి ఎడమచేతిలో మోదకం, వెనకచేతిలో పాశం ధరించాడు. దండరెట్టలపై రుద్రాక్షలు కట్టివున్నాయి. మెడలో పూసలహారం, కాళ్ళకు కడియాలు, నూపురాలున్నాయి. తలపై కరండమకుటం, పొట్టమీద నాగబంధం కలిగివుండి కాళ్ళమీద (ఉత్కుటాసనం) కూర్చున్న శిల్పం. మూషికవాహనుడు ఈ గణపతి.

భైరవుడు, వినాయకుడు రాష్ట్రకూటులశైలి, 8, 9వ శతాబ్దపు శిల్పాలు.

ఈ రెండు శిల్పాలు కాక అక్కడున్న మరోరాయిని దొర్లిస్తే


గణపతి


అడివిపంది వేట వీరగల్లు


శివలింగం


నంది

5గురు వీరులున్న రాతిఫలకం బయటపడ్డది. ఇట్లాంటి వీరగల్లు ప్యానెల్‌ను చూడడం మాకు మొదటిసారి. ఈ ప్యానెల్ మీద మొదటి ముగ్గురు వీరులు కుడిచేతుల్లో చురకత్తులు, ఎడమచేతులు ముందుకు చాచి యుద్ధోన్ముఖులై సాగుతున్నట్టు కనిపిస్తుంది. ఈ మూడుశిల్పాలకు మధ్య వాటిని వేరుచేస్తూ అంచులు చెక్కబడి వున్నాయి. మరి ఇద్దరు వీరుల శిల్పాలు ఒకే భాగంలో చెక్కివున్నాయి. నాలుగవ వీరుడు బొడ్లో కత్తిమీద చేయిపెట్టి ముందుకు సాగుతున్నాడు. 5వ వీరుని కుడిచేతిలో దూసిన కత్తి, ఎడమచేతిలో చక్రం వున్నాయి. 5గురు వీరులకు కుడివైపు తిప్పి కట్టిన సిగలు, దండరెట్టలకు దండకడియాలు, కాళ్ళకు కడియాలున్నాయి. చెవులకు కుండలాలున్నాయి. వీరకాసెలు, నడికట్లున్నాయి. అందరు వీరులు ఎడమవైపుకు తిరిగి సాగిపోతున్నారు. ఈ ఫలకం చాలా సహజమైన దృశ్యశిల్పం. ఫలకం పొడవు 7అడుగులు, ఎత్తు రెండడుగులుంది.

అక్కడే ఒక రాతిదూలం మీద చెక్కిన రెండుజతల పాదాలున్నాయి. అక్కడ గతంలో శివాలయ ప్రాంగణం వుండేదని తెలుస్తున్నది.

ఊరిబయట వున్న పాటిగడ్డకు దగ్గరలో బలిజోల్ల బావి అంచున 3అడుగుల ఎత్తైన వీరగల్లుంది. దానిమీద చెక్కబడిన వీరుని కుడిచేతిలో పరిఘవంటి ఆయుధం ఎత్తిపట్టుకున్నాడు. సిగ నడినెత్తిన కట్టివుంది. మెడలో నగలున్నాయి. చెవులకు కుండలాలున్నాయి. చేతులకు దండకడియాలు, కంకణాలున్నాయి. మొలకు కట్టిన గుడ్డ సాధారణ సైనికుని ఆహార్యం కన్నా భిన్నంగా వుంది. ఆ వీరుడు అమరుడై, వీరస్వర్గంలో దివ్యాంగనల పరిచర్యలు పొందుతున్నట్టు తెలిపే రెండో అంతస్తు దృశ్యం వుంది. ఆ వీరుడు ఉత్తరాభిముఖుడై వున్నాడు.


కేశవమూర్తి

అక్కడికి దగ్గరలో గ్రామంలో చెన్నకేశవుని దేవాలయంగా పిలువబడే గుడివుంది. ఆ గుడి మేం వెళ్ళినపుడు పునర్నిర్మాణ దశలో వుంది. రాతికట్టడాలతో వున్న గుళ్ళను కూలగొట్టి సిమెంటు దేవాలయాలను కట్టడం అపూర్వమైన పూర్వ శిల్పసౌందర్యం పోగొట్టుకోవడం జరుగుతున్నది. గుడిప్రాంగణంలో తూర్పున మీసాల వైష్ణవ ద్వారపాలకులిద్దరి శిల్పాలు వున్నాయి. ఇద్దరు చతుర్భుజులు. శంఖ, చక్రాలు, గదలతో స్వస్తికభంగిమలో నిలబడివున్నారు. తలపై కరండమకుటాలతో, మెడలో హార, గ్రైవేయకాలతో, మొలన ఉరుదాలతో, కరకంకణాలు, కాళ్ళకు కడియాలతో కనిపిస్తున్నాను. పడమటిగోడకు చేరువగా లలాటబింబంతో కూడిన గుడిద్వారం ఉత్తరాశి వుంది. దానిమీద చక్రం, శంఖం ఇరువైపుల వున్న గోవులు, గోపికలతో వేణుగోపాలస్వామి స్వస్తికభంగిమలో నిలబడి వేణువు వాయిస్తున్న శిల్పం లలాటబింబంగా వుంది.

గుడిప్రాంగణంలో దేవుని కళ్యాణమంటపం వుంది. ఆ మంటపం తొలిదశ కాకతీయుల శైలి స్తంభాలతో అగుపిస్తున్నది. గర్భగుడిలోని విగ్రహాలను, అర్చామూర్తులను చిన్న గదిలో భద్రపరిచారు. ఆ గదిలో 11మంది ఆళ్వార్ల విగ్రహాలున్నాయి. అర్చామూర్తులున్నారు. ఆ అర్చామూర్తులలో దేవేరులతో వైష్ణవమూర్తి వేణుగోపాలస్వామి వున్నాడు. ఆ వెనక ప్రధాన మూలవిగ్రహంగా భావిస్తున్న శిల్పం చతుర్భుజశిల్పం ముందరి కుడిచేతిలో తామరపువ్వు, వెనకచేతిలో శంఖం, ముందరి ఎడమచేతిలో గద, వెనకచేతిలో చక్రాలున్నాయి. తలపై కరండమకుటం, చెవులకు కుండలాలు, మెడలో కంఠహారాలు, కటిపై సాలంకృతవస్త్రం, పాదాల వద్ద గరుడుడు,


కొత్తగుడి, పాత మంటపం


వేణుగోపాలస్వామి ఉత్తరాశి


శివలింగం


భైరవుడు


ఉత్సవమూర్తి


లక్ష్మి


వాసుదేవమూర్తి


వేంకటేశ్వరుడు

చామరగ్రాహిణిలతో వున్న ఈ శిల్పం కేశవమూర్తిది. ఇదే మూర్తిని పోలి వున్న మరో విగ్రహంలో ముందర కుడిచేతిలో గద, ఎడమచేతిలో పుష్పం వుండడంతో ఈ విగ్రహం వాసుదేవమూర్తిది. మూడో విగ్రహం చతుర్భుజాలలో వెనకచేతుల్లో చక్రం, శంఖాలతో ముందరి కుడిచేయి అభయహస్తంగాను, ముందరి ఎడమచేయి కటిహస్తంగా వుంది. ఈ శిల్పం వేంకటేశ్వరునిది. ఈ మూడు దేవతా విగ్రహాలు కాక కనిపించే మరో శిల్పం తామరమొగ్గను ఎత్తిపట్టుకున్న కుడిచేయి, దించిపెట్టిన ఎడమచేతిలో పుష్పం వున్నాయి. ఈ దేవతామూర్తికి రెండుచేతులే వున్నాయి. ఆ మూర్తి లక్ష్మీరూపం.


హనుమాండ్లు

కీర్తిముఖంతో, పది పుష్పికలతో, దశావతారాలతో కూడిన మకరతోరణంతో సప్తఫణిమండల శేషువున్నాడు. వితర్క ముద్రతో, అర్ధపద్మాసనంలో ఆసీనుడైవున్న వైష్ణవమూర్తి, పీఠం కిందుగా రామానుజాచార్యుని సూక్ష్మశిల్పం అగుపిస్తున్నాయి. భూదేవి, శ్రీదేవీసమేత విష్ణువు అర్చామూర్తు లున్నాయి.

గ్రామంలో విడిగా కనిపించే శిల్పాలలో ఉత్తరాభిముఖుడైన చక్ర, శంఖ చిహ్నాలతో కనిపించే శిఖాంజనేయుడు భక్తాంజనేయుడు. అంజలి ఘటించిన చేతుల్లో తామరపూవున్నది. 16వ శతాబ్దానికి చెందిన మాధ్వ వైష్ణవ హనుమాండ్లు.

గ్రామంలో వున్న శివాలయంలో స్వయంభులింగంగా ప్రజలు భావించే శివలింగం వుంది. చతురస్రాకారంలో పానవట్టం వున్న చిన్నగుడి. గద్దెమీద నిలిపిన నంది చాళుక్యశైలి నంది. గుడిలో ఉన్నది చిన్నది కొత్తనంది. గర్భగుడిలో అర అడుగు ఎత్తున్న లింగం క్షితిజసమాంతరంగా వున్న చతురస్రాకారపానవట్టంలో ప్రతిష్టించి వున్నది. గర్భగుడి లోకప్పులో కనిపిస్తున్న భువనశిల్పం షోడశదళ పద్మశిల్పం.

గుడికెదురుగా వున్న చిన్న దీపస్తంభం మీద అస్పృశ్యులు దీపం పెట్టి దేవునికి బయటనుంచే దండం పెట్టుకునేవారట. ఈ గ్రామంలో పాటించిన ఒక సాంఘిక దురాచారానికి నిదర్శనంగా నిలబడివుంది. అక్కడకు దగ్గరలో గ్రామపంచాయితీ భవనం వెనక చతురస్రాకారంలో కట్టబడిన రాళ్ళు, ఇటుకలతో కట్టబడిన 2 అడుగుల ఎత్తైన బురుజు వుంది.

తరిగొప్పుల గ్రామంలో ఉత్తరంవైపు వున్న జారుడు బండల మీద భైరవుని శిల్పం, చాముండి శిల్పం వున్నాయి. భైరవుని శిల్పం సాధారణశిల్పం. చాముండి దేవత చతుర్భుజి. పరహస్తాలలో ఢమరుకం, త్రిశూలాలు, నిజహస్తాలలో ఖడ్గం, రక్తపాత్రలతో సుఖాసీనురాలై వున్నది. సర్పం వాహనంగా వుంది. ఇది అరుదైన చాముండి దేవతా శిల్పం.

ఊరికి మరోవైపు కుడుకుంట శికం ప్రాంతంలో చెట్లనడుమ రెండు శిల్పాలు కనిపించాయి. ఒకటి చతుర్భుజి చాముండి శిల్పం. ఢమరుకం, త్రిశూలం, ఖడ్గం, రక్తపాత్రలు ధరించిన దేవత.

రెండవది అడివిపందివేట దృశ్యశిల్ప ఫలకం. గుర్రంమీద రాజు వంటి ఆహార్యంతో వున్న వీరుడు వేటకుక్కలు రెండింటి సాయంతో అడివిపందిని వేటాడుతున్నాడు. అతనికి వెనక నిలబడిన పరిచారకుడు ఛత్రం పట్టుకుని వున్నాడు. ఇది రాచవీరగల్లు. పందివేట వీరగల్లు.

ఊరి చుట్టూరా ఇంత శిల్పసంపద వున్న తరిగొప్పుల గొప్ప గ్రామం. గ్రామ ప్రాశస్త్యాన్ని కాపాడుకోవడానికి ఈ శిల్పసంపదను కాపాడుకోవాల్సిన అవసరం వుంది.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com




# దీపావళికి యునెస్కో గుర్తింపు

## సాంస్కృతిక వారసత్వ జాబితాలో చోటు

వెలుగు వెన్నెల దీపావళి ప్రపంచ వేదికపై తళుకులీనింది. భారతీయ లోగిళ్లను సంబరాల్లో ముంచెత్తే ఈ దీపాల పండగకు అంతర్జాతీయంగా అరుదైన గౌరవం దక్కింది. యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో ఈ పండగను చేర్చారు. దిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన సమావేశంలో యునెస్కో ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో భారత్‌కు చెందిన 15 అంశాలు యునెస్కో వారసత్వ గుర్తింపు పొందినట్లయింది. వీటిలో కుంభమేళా, కోల్‌కతా దుర్గా పూజ, గుజరాత్‌లోని గర్బా నృత్యం, యోగా, వేద పఠన సంప్రదాయం, రామాయణ గాథను ప్రదర్శించే రామ్‌లీల సంప్రదాయ ప్రదర్శనలున్నాయి. వీటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని యునెస్కో ప్రతినిధులు వెల్లడించారు. డిసెంబర్ 8న ప్రారంభమైన యునెస్కో 20వ సదస్సు డిసెంబర్ 13 వరకూ దిల్లీలోని ఎర్రకోటలో జరిగింది. యునెస్కో ఇంటాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ సమావేశం భారత్‌లో జరగడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో 80 దేశాలు సమర్పించిన 67 నామినేషన్లను కమిటీ పరిశీలించింది. ఈ సదస్సులో పాల్గొనేందుకు వందల మంది ప్రతినిధులు వచ్చారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు మరోసారి అంతర్జాతీయ స్థాయిలో పట్టాభిషేకం జరిగింది. భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే 'దీపావళి' (Diwali) పండుగకు ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (UNESCO) గుర్తింపు లభించింది. యునెస్కో సాంస్కృతిక వారసత్వ (Intangible Cultural Heritage) జాబితాలో దీపావళిని చేర్చడం ద్వారా, ఈ పండుగ విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పింది. కేవలం ఒక మతపరమైన ఉత్సవంగానే కాకుండా, మానవతా విలువలకు, ఆశావాదానికి ప్రతీకగా నిలిచే దీపావళికి ఈ గుర్తింపు దక్కడం ప్రతి భారతీయుడికీ గర్వకారణం.

యునెస్కో గుర్తింపు అనేది కేవలం ఒక గౌరవం మాత్రమే కాదు, దీని వెనుక అనేక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ గుర్తింపుతో దీపావళి పండుగకు అంతర్జాతీయ 'బ్రాండ్ ఇమేజ్' లభిస్తుంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా దీపావళి జరుపుకుంటున్నప్పటికీ, యునెస్కో ముద్రతో దీనికి అధికారిక హోదా దక్కినట్లయింది. విదేశీ పర్యాటకులు భారతీయ సంస్కృతిని ప్రత్యక్షంగా వీక్షించడానికి ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా అయోధ్యలో జరిగే 'దీపోత్సవం' లేదా వారణాసిలో జరిగే వేడుకలను చూడటానికి అంతర్జాతీయ పర్యాటకుల తాకిడి గణనీయంగా పెరుగుతుంది. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుంది. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి ఐక్యరాజ్యసమితి నుండి సాంకేతిక, ఆర్థిక సహకారం లభించే అవకాశం ఉంటుంది. పండుగకు సంబంధించిన పురాతన ఆచారాలను డాక్యుమెంట్ చేయడానికి, భవిష్యత్ తరాలకు అందించడానికి ఇది దోహదపడుతుంది. అంతర్జాతీయ సంబంధాల్లో భారత్ తన పవర్‌ను పెంచుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. భారతీయ విలువైన 'వసుధైక కుటుంబకం' అనే భావనను ప్రపంచానికి వ్యాప్తి చేయడానికి ఇది ఒక వేదికగా మారుతుంది.

దీపావళికి యునెస్కో గుర్తింపు లభించడం అనేది భారతీయ సనాతన ధర్మానికి, సంస్కృతికి దక్కిన విశ్వవ్యాప్త ఆమోదం. ఈ గుర్తింపు మన బాధ్యతను కూడా పెంచుతుంది. పర్యావరణానికి హాని కలగకుండా, సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకుంటూ, మన సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది. ఏది ఏమైనా, ఇకపై దీపావళి కేవలం భారతీయ పండుగ కాదు అది ప్రపంచ పండుగ!

– ఎసికె. శ్రీహరి, m : 9849930145
e : ackvs08@gmail.com

ప్రకృతి గమనం! 4 ప్రకృతి ధర్మం!!

# భూభ్రమణం - భారీ నిర్మాణాలు!

గత కథనంలో భూభ్రమణ వేగంపై, హెచ్చుతగ్గులపై భూభ్రమణంలో జరుగుతున్న మార్పుల్ని చూసాం! కాని, భూభ్రమణంపై ప్రభావం చూపుతున్న విభిన్న కారణాలు, వాస్తవ పరిస్థితులు, భవిష్యత్ పరిణామాలు ఎలా వుంటాయనేది చర్చకురాని అంశాలే! భూగోళ పరిస్థితే అస్తవ్యస్తంగా వుంటే, మానవుడి దృష్టి చంద్రగ్రహంపై, ఇతర గ్రహాలపై పడడం, వీటిపైన కూడా ఆవాసం ఏర్పరచుకొని ఆధిపత్యం చెలాయించాలని ఓ వర్గం (అత్యంత ధనవంతులు) తపన అప్పుడే మొదలైంది కూడా!

శాస్త్రీయపరంగా విశ్లేషించినప్పుడు, భూమి ఆవిర్భవించి, పరిణామం చెంది, జీవ ఆవాసంగా మారిన తీరును గమనించినప్పుడు, తిరిగి భూమిపై జీవరాసి మొత్తంగా కనుమరుగై నివాసయోగ్యంగా వుండకపోవచ్చు. ఈ సంధికాలంలో (లక్షల సంవత్సరాల తర్వాత) మరో గ్రహాన్ని వెతుక్కోవడం మేధవున్న మనిషికి (భవిష్యత్‌లో మానవ మేధ ఎలా వుంటుందో చెప్పలేం) అనివార్యమవుతుంది. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ఏదో సాధించాలనే శాస్త్రీయ తపన కూడా ఈ ఆలోచనలకు తావిస్తుంది. పోతే, ఇప్పుడిప్పుడే భూమి నివాసయోగ్యంగా వుండకపోవడం గాని, ఇతర గ్రహాలు ఆవాసయోగ్యంగా అందుబాటులోకి రావడంగాని జరిగేపని కాదు. ఇవన్నీ అంచనాలు. ఊహలు. ఇలాంటి ఊహలే (fictions) మానవ ప్రగతికి, శాస్త్రీయ ఆలోచనలకు దారితీసింది తెలిసిందే! కాబట్టి, నేడు మానవమేధ దీర్ఘకాలిక ఆలోచనలు, లక్షలాది సంవత్సరాల తర్వాత నిజం కూడా కావచ్చు!


త్రీ గోర్జెస్ డాం

**భూగమనం - మార్పులు - భవిష్యత్తు:**

గత కథనంలో ప్రస్తావించినట్లుగా, భూమి భ్రమణంలో మార్పులు శాస్త్రీయంగా ఓ సహజ ప్రక్రియ అని గమనించాలి. అలాగే భవిష్యత్‌లో ఈ మార్పులు జరగడం సహజమే! వీటికి గల వాస్తవ కారణాలు, ఈ కారణాలు శాస్త్రీయంగా నిలబడడం ఇంకా జరగలేదు. అయితే, సహజ భూప్రక్రియలు, మానవుడి ప్రభావం ఎంతమేరకు అని చర్చమాత్రం శాస్త్రీయ పరిధిలో జరుగుతూనే వున్నది. ఇందులో వాస్తవాల్ని గుర్తెరుగుతే, మానవతప్పిద కారణాలు రుజువైతే, మానవుడి ఆలోచనలో, ఆచరణలలో నియంత్రణలు జరగవచ్చు. చీకటి నుంచి వెలుగులోకి వచ్చిన ఆదిమానవుడి నుంచి ఆధునిక మానవుడిదాకా ఎదిగిన మానవుడి బుర్ర చాలా విశిష్టమైనదే! ఈ విషయంగా జరుగుతున్న కొన్ని సంఘటనల్ని, పరిశోధనల్ని చూద్దాం!

**భారీ నిర్మాణాలు:**

ప్రపంచవ్యాపితంగా గల మహానగరాల్ని, ఆకాశ హర్మ్యాలను భారీ ఆనకట్టలను, చూస్తే అనేక ఆలోచనలు మన బుర్రల్ని తొలుస్తాయి. పెద్దలైతే, భూమాతకు భారమైతున్నది (పాపబీతి), ఇది ఎక్కువ రోజులు నిలవదనే ఊహాజనిత మాటల్ని అంటూవుంటారు. శాస్త్రీయంగా ఇందులో కొంత వాస్తవం కనిపిస్తుంది కూడా. భూమిపై నిర్మిస్తున్న ఈ కట్టడాలు భూమికి భారాన్ని కల్గించవా, పెనుమార్పులకు కారణం కావా అని అనిపిస్తుంది. ఈ దిశగా కూడా నాసాలాంటి (NASA) పరిశోధన సంస్థలు కొంత పరిశీలనలు చేసాయి. కొన్ని ఉదాహరణల్ని, భుభ్రమణ గతి గూర్చిన హెచ్చుతగ్గుల్ని, కారణాల్ని అంచనా వేసాయి.

అయితే, భూమిపై నిర్మితమవుతున్న, నిర్మించబడిన ఎత్తైన (దుబాయి, మలేసియా తదితర దేశాల ఆకాశ హర్మ్యాల వంటివి) కట్టడాలు ఒక నిర్దేశిత ప్రాంతంలో భూమిపై ఒత్తిడిని (పీడనాన్ని) కల్గించడం జరుగుతుంది. కాని, ఈ ఒత్తిడి భూమిపై గాని, భూ అక్షంపైగాని, ధృవాలపైగాని సూదిమొనంత ప్రభావాన్ని కూడా చూపవని చెపుతున్నారు. పైగా ఈ ప్రభావాన్ని గుర్తించాలంటే, మనకున్న కాలజ్ఞానం సరిపోదు. అణుగడియారాలు, జియోడెటిక్ (geodetic భూ పరిమాణ, మార్పుల సంబంధ శాస్త్రం) పరిజ్ఞానం మాత్రమే గుర్తించ గలుగుతాయి.

**త్రీ గోర్జెస్ జలాశయం:**

భారీ నిర్మాణాలు భూభ్రమణంపై ప్రభావం చూపుతాయా అనే సునిశిత ప్రశ్నకు 'అవును' (yes) అనే సమాధానానికి త్రీగోర్జెస్ జలాశయాన్ని ఉదాహరణగా తీసుకుంటున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన, పొడవైన, త్రీగోర్జెస్ జలాశయాన్ని చైనా నిర్మించడం తెలిసిందే! సముద్రమట్టానికి 185 మీటర్ల (600 అడుగులు) ఎత్తులో, 2,300 మీటర్ల (7,500 అడుగుల) పొడవుతో, పూర్తి నీటి మట్టం 42 బిలియన్ టన్నుల (క్యూబిటిక్ మీటర్ల) నీటి నిల్వతో నిర్మితమైన ఈ భారీ జలాశయం 16 మిలియన్ల ఒలియంపిక్

ఈత కొలనులకు సమానమైన నీటి సామర్థ్యాన్ని కలిగి వుంటుంది.

ఇంత పెద్దదైన భారీ జలాశయం వాస్తవానికి భూభ్రమణ వేగాన్ని తగ్గిస్తుంది. ఈ తగ్గుదల దినసరి కాలాన్ని కేవలం 0.06 మైక్రోసెకండ్లను (సెకను కాలంలో 60 బిలియన్ల వంతు) మాత్రమే పెంచగలుగుతుంది. ఈ లెక్కన ఒక సెకండు కాలాన్ని చేరుకోవడానికి సుమారు 40,000 సంవత్సరాలు పడుతుందని అంచనా. పోతే, ఈ జలాశయం నిరంతరం పూర్తి నీటి మట్టంతో వుంటే, భూమి అక్షాన్ని 2 సెం.మీ. మార్పు (shift) చేయగలుగుతుందని నాసా (NASA) కొన్ని లెక్కల్ని చూపుతున్నది.

అయితే, ఇలాంటి జలాశయాలు లేదా భారీ నిర్మాణాలు ప్రపంచ వ్యాపితమైతే..? సమాధానాలు మాత్రం లేవు. అయినా భూమికి వచ్చే ప్రమాదమేమి లేదని ఇప్పుడైతే సంతోషపడవచ్చు!

**ప్రకృతి విపత్తులు:**

సాధారణ భూకంపాలు (రిక్టర్ స్కేలుపై 5 కు లోపు) భూభ్రమణంపై ఎలాంటి ప్రభావాన్ని చూపవు. కానీ, భారీ భూకంపాలు (రిక్టర్ స్కేలుపై 7 కు పైగా) సంభవిస్తే భూభ్రమణంలో మార్పులు వస్తాయని శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. దీనికి 2011లో జపాన్‌లో వచ్చిన భారీ భూకంపం (రిక్టర్ స్కేలుపై 9.0) ఇక్కడి ఫుకుషిమా న్యూక్లియర్ (Fukushima) ప్రమాదాన్ని ఉదాహరణగా చూపుతున్నారు. ఈ భూకంపం ప్రభావం భూభ్రమణంపై ఒక సెకనులో 1.8 మిలియన్ల వంతు దినసరి కాలాన్ని ప్రభావితం చేసిందిగా గుర్తించారు.

**సునామీలు – భూభ్రమణంపై ప్రభావం:**

సాధారణ సముద్ర అలలు సహజసిద్ధ ప్రక్రియలు. కాని సముద్రగర్భంలో భూకంపాలు ఏర్పడినప్పుడు ఏర్పడే సునామీలు భారీ ప్రాణనష్టాన్ని, విధ్వంసాన్ని కలిగించడమే కాక, యావత్ భూగోళ గమనంపై ప్రభావం చూపడం గమనార్హం! 2004లో, 2011లో సంభవించిన సునామీలు ఈ కోవకు చెందినవే. 2004 డిసెంబర్ 26న హిందూ మహాసముద్రంలో రిక్టర్ స్కేలుపై 9.2 తో ఏర్పడిన భూకంపం మహాసముద్రం చుట్టూగల సుమారు 14 దేశాల్ని గడగడలాడించింది. ఈ సందర్భంగా భారత్‌లోని తమిళనాడు అతలాకుతలమై వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. మిగతా దేశాలతో కలిపి ఈ ప్రాణనష్టం 2,30,000 పై చిలుకుగా అంచనా.

అలాగే 2011 మార్చి 11న జపాన్ తూర్పుతీరాన గల పసిఫిక్ మహాసముద్రంలో రిక్టర్ స్కేల్‌పై 9.0గా నమోదైన భూకంపంతో ఏర్పడిన సునామీ, పసిఫిక్ జలాల్ని విద్యుత్ విశ్లేషణ చేసి ఆక్సీజన్‌గా, హైడ్రోజన్‌గా విడగొట్టిందంటే, సముద్ర గర్భంలో బడబాగ్ని ఎంతగా ప్రజ్వరిల్లిందో ఊహించవచ్చు. ఇలా వెలువడిన హైడ్రోజన్ (స్వయంగా మండే స్వభావం) జపాన్‌లోని ఫుకుషిమా – డాయిచీ ప్రాంతంలో గల న్యూక్లియకర్ రియాక్టర్‌ను ధ్వంసం చేసింది. ఇలాంటి భారీ విస్ఫోటాలు, ఎగిసిపడే అలలు సముద్రాల సాంద్రతను, గాఢతను, లావణీయతను మార్చివేస్తాయి. ఇది సముద్ర జీవరాశులపైన ప్రభావం చూపడమే కాకుండా, చుట్టూ వున్న ఆయా దేశాల భౌగోళిక మార్పులకు కారణమవుతుంది. ఇలాంటి భారీ సునామీల సందర్భంగా భూభ్రమణంపై ప్రభావాన్ని శాస్త్రజ్ఞులు చాలా కాలంగా అంచనా వేస్తున్నారు. వీటి ప్రభావాన్ని అంచనా వేసిన శాస్త్రజ్ఞులు, భారీ సునామీల అలలు ఒత్తిడి ఒక శతాబ్ద కాలంలో కేవలం సెకండులో రెండువేల వంతు (2 మిల్లి సెకండ్లు) కాలాన్ని ఒకరోజుకు పెంచుతాయని గణించారు. ఇంత స్వల్ప వ్యవధి భూభ్రమణంపై ఇప్పట్లో ప్రభావం చూపకపోయినా, జరుగుతున్న పరిణామాలు, భవిష్యత్తుకు ఒక హెచ్చరిక లాంటివిగా ముందుకొస్తున్నాయి.



అభివృద్ధి నీడకై భూమిగుల్ల

**బ్లాక్ హోల్స్ (కృష్ణ బిలం)**

- 1916లో ఐన్‌స్టీన్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన తర్వాత బ్లాక్ హోల్స్ (కాలరంధ్రాలు) ఆలోచనలు తిరిగి ప్రచారంలోకి వచ్చాయి.
- విశ్వంలోని భారీ నక్షత్రాల జీవితకాలం ముగిసిన తర్వాత (gravitational collapse) ఏర్పడుతాయని అంచనా:
- ఈ బ్లాక్ హోల్స్ అత్యంత శక్తివంతమైన గురుత్వాకర్షణ శక్తిని కలిగి వుంటాయి.
- ఇందులోకి పోయిన ఏ పదార్థం తిరిగి బయటకు రాదు.
- చివరికి కాంతి శక్తి కూడా బయటకురాదు.
- ఈ ఆలోచనలో మార్పులు వస్తున్నాయి.
- వీటి జీవిత కాలం $2\times10^{106}$ సంవత్సరాలుగా అంచనా. తర్వాత ఆవిరైపోతాయి. 1998 తర్వాత ఈ విలువను $2\times10^{67}$ గా సవరించారు.
- ఇలా ఆవిరైనవి పదార్థ ధర్మం ప్రకారం మరో రూపాన్ని పొందుతాయి. అవి ఏంటి అని నిర్ధారణ జరుగలేదు.

**భవిష్యత్ చిత్రపటం:**

భారీ నిర్మాణాలు, కట్టడాలు, జలాశయాలు నడుస్తున్న కాలంలో భూగోళానికి నష్టాన్ని కలిగించవు. కాని, ఈ ఆలోచనలు శాస్త్రజ్ఞుల బుర్రల్ని ఎందుకు తొలుస్తున్నాయనేదే ప్రశ్న! దీనికి పదార్థంకున్న ధర్మాలు ప్రభావితం చేస్తున్నాయి. సృష్టిలోని, విశ్వంలోని ప్రతి పదార్థం (ఘన, ద్రవ, వాయు) జఢత్వాన్ని,



స్టీఫెన్ హాకింగ్

**బ్లాక్ హోల్స్‌పై స్టీఫెన్ హాకింగ్ (Stephen Haking):**

స్టీఫెన్ హాకింగ్ బ్లాక్ హోల్స్‌పై కొన్ని ప్రతిపాదనల్ని ముందుకు తెచ్చాడు.

1. హాకింగ్ రేడియేషన్:
   క్వాంటం ప్రభావం వల్ల రేడియేషన్ విడుదలవుతుంది. దీనితో పదార్థం శక్తిని కోల్పోయి ఆవిరైపోతుంది.
2. దీని ఉపరితల వైశాల్యం (ఈవెంట్ హారిజోన్ (ఘటన క్షితిజం) ఎప్పటికి తగ్గదు. పెరగడం జరగవచ్చు. రెండు బ్లాక్ హోల్స్ కలిసినప్పుడు వాటి వైశాల్యం పెరిగినట్టు LIGO పరిశీలనలో తేలింది. (LIGO - Laser Interferometer Gravitational - wave Observatory).
3. బ్లాక్ హోల్స్‌లో చేరిన ఇతర సమాచారం పూర్తిగా నాశనం కాదు (information pardox)
4. గతంలో భావించినట్లుగా ఇది శాశ్వత జైళ్లు కావు. వీటి నుండి బయటపడే మార్గాలున్నాయి.

బ్లాక్ హోల్స్ నిరంతరం శక్తిని కోల్పోతాయని, సమాచారాన్ని సంరక్షించగలవని, ఇతర విశ్వసంబంధ పరిశోధనలకు దారులు వేయగలవని స్టీఫెన్ హాకింగ్ ప్రతిపాదించాడు.

ద్రవ్యరాశిని కలిగి వుంటాయి. జఢత్వం (inertia)కు, ద్రవ్యరాశి (mass)కి అవినాభావ సంబంధం వుంటుంది. ఇలాంటి రెండు పదార్థాల మధ్యన ఆకర్షణ (grarvitational) ఏర్పడడం, ఇది శక్తిరూపంగా మారి చలించడం జరుగుతుంది. ఇదో ప్రకృతి ధర్మం. ఈ చలనంతో ఈ రెండు పదార్థాలు ఆకర్షణ, వికర్షణకు గురవుతూ వుంటాయి. కాబట్టి (విద్యుత్ గంటలా) ఈ పదార్థాలు (భారీ) భ్రమణానికి గురై నిరంతరం చలిస్తూ వుంటాయి. గెలాక్సీలోని లక్షలాది భారీ పదార్థాలు, సౌరకుటుంబంలోని గ్రహాలు (భూమితో సహా) ఈ సూత్రంపైననే గమనం సాగిస్తాయి. ఈ గమనం తమకుతాముగా, సూర్యుని చుట్టూ తిరగడానికి కారణమవుతాయి. ఇదో నిరంతర ప్రక్రియ. ఇలా ఎంతకాలం కొనసాగుతాయి అని ప్రశ్నించుకుంటే, భూమితో సహా గ్రహాల యొక్క తుది భ్రమణాన్ని నిర్ణయించే తెలివి ఇప్పటికిప్పుడే మానవుడికి అబ్బలేదు. భవిష్యత్ చిత్రపటం ఎలా వుంటుందో చెప్పలేం.

పోతే, ఐన్‌స్టీన్ సాపేక్షసిద్ధాంతంతో, క్వాంటం మెకానిక్స్ లెక్కలతో శాస్త్రజ్ఞులు కొన్ని అంచనాలకు రాగలుగుతున్నారు. ఎంత భారీ నక్షత్రమైనా, సూర్యుడైనా తనలోని పూర్తి శక్తి (ఇంధనం) దహించబడిన తర్వాత బిలంగా (hole) మారుతుందని, ఇది నల్లని లేదా బూడిద రంగులో వుంటుందని అంచనా. దీన్నే బ్లాక్ హోల్ (black hole) అని శాస్త్రీయంగా అంటున్నారు. ఈ అంచనా ప్రకారం, సూర్యుడి శక్తి కోల్పోతే (అంతదాకా భూగోళం ఉనికిలో వుంటే) భూమి సూర్యునిలో మిలితం కావచ్చు. లేదా అంతకు ముందే, భూగోళం శక్తిని కోల్పోతే మరో గ్రహంతో కలవడం లేదా సూర్యునిలో కలవడం జరగవచ్చు. ఇవన్నీ ఊహాత్మకమైన ఆలోచనలే. అయినా, ఇవి శాస్త్రీయంగా వుంటాయి. కాబట్టి భూమి యొక్క భవిష్యత్ చిత్రపటాన్ని అంచనా వేయగలుగుతున్నారు.

**మానవ తప్పిదాలు:**

ఖనిజ సంపదలకై, పెట్రోలియంకై, సహజవాయువుకై భూగోళాన్ని గుల్లచేయడం తెలిసిందే. భూమిపైన, సముద్రంలో వందల మీటర్ల లోతుల్లో వీటిని తవ్వి తీస్తారు. ప్రపంచ వ్యాపితంగా, నిరంతరం జరుగుతున్న ఈ తవ్వకాలు భవిష్యత్‌లో భూగోళ ఉనికికి ప్రమాదాన్ని కలిగించవచ్చు. ఇప్పుడున్న నివాస యోగ్య భూగోళం ఏర్పడడానికి, ఏకఖండిక భూభాగం (pangea) (చూడు దక్కన్‌ల్యాండ్ మే 2021 సంచిక) నుండి, విభిన్న భూభాగాలు ఏర్పడడం తెలిసిందే. నాడు ఇదంత సహజ ప్రక్రియ. కాని, మానవుడే భూభాగాల్ని కదలించే చేష్టలు చేస్తుంటే, భవిష్యత్‌లో భూ స్వరూపాలు ఎలా వుంటాయో ఊహించలేము. ఒక నిర్దిష్ట ప్రామాణికంగా ఏర్పడిన భూమి, ఊహించని విధ్వంసానికి గురైతే, భూమికి సంబంధించిన మూడు పొరలు (క్రస్ట్, మాంటిల్, కోర్) అలజడికి గురికావచ్చు. వీటికి అనుబంధంగా వుండే అంతర్గత పలకలు (tectonic plates) పెనుమార్పులకు గురికావచ్చు. ఇప్పటికే చాలా భూఖండికలు బలహీనమైన ప్రాంతాలవైపు కదులుతున్నట్లుగా (భారత ఉపఖండం టిబెట్ వైపు) గుర్తిస్తూనే వున్నాం.

వీటన్నింటిని భేరీజు వేసుకున్నప్పుడు భూగోళం మార్పుకు గురికావడం ఓ నిరంతర ప్రక్రియగా భావించాలి. కాబట్టి, భవిష్యత్‌లో భూగోళం ఏరూపం సంతరించుకుంటుందో ఇప్పుడే చెప్పలేం. ఊహించలేం కూడా! కాబట్టి మనం చేయాల్సింది మాత్రం మరింత కష్టాన్ని, నష్టాన్ని భూగోళానికి కలిగించకపోవడమే!

*(భూభ్రమణంపై ప్రభావాన్ని చూపే మరికొన్ని ప్రమాదాల్ని వచ్చే సంచికలో చూద్దాం?)*

– డా॥ లచ్చయ్య గాండ్ల, m : 9440116162
e : drglachaiah@gmail.com

# మతాల కన్నా మానవత్వమే ముఖ్యం

# భారత కోకిల సరోజినీ నాయుడు

**1879** ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లోని బెంగాలీ బ్రాహ్మణ కుంటుంబంలో జన్మించారు సరోజినీ నాయుడు. తండ్రి అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, శాస్త్రవేత్త, తత్వవేత్త. హైదరాబాద్‌లోని నిజాం కళాశాలను స్థాపించి, చాలాకాలం ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఈయనే మొదటి ప్రిన్సిపాల్ కూడా. తల్లి వరద సుందరిదేవి, కవయిత్రి. ఈమె బెంగాలీలో కవిత్వం రాశారు. ఎనిమిది మంది తోబుట్టువుల్లో.. ఈమె పెద్ద. అమ్మనాన్నలిద్దరూ అక్షరాస్యులవ్వడం.. సాహిత్యాభిరుచిని కలిగి ఉండటంతో పుస్తకాలు ఎక్కువగా చదివేవారట సరోజినీ. ఆ మక్కువతోనే ఉర్దూ, తెలుగు, ఇంగ్లీష్, బెంగాలీ, పర్షియన్ భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. పిబిషెల్లీ కవిత్వమంటే ఆమెకు ఎక్కువ ఇష్టమట.



పన్నెండేళ్ల వయసులో.. 1891లో, మద్రాసు విశ్వవిద్యాలయంలో మెట్రిక్యులేషన్‌లో ప్రథమస్థానం పొంది, జాతీయస్థాయిలో ఖ్యాతిని పొందారు. మహిళా విద్యపై అనేక ఆంక్షలున్న ఆరోజుల్లోనే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సరోజిని ఉన్నతవిద్యను అభ్యసించడం గర్వకారణం. ఆమె తెలివితేటలకు, కవితా రచనకు ముగ్ధుడైన నిజాం నవాబు ఆమెను విదేశాల్లో చదువుకునేందుకు స్కాలర్‌షిప్ సైతం ఇప్పించాడు.

1898 వరకు ఇటలీ, స్విట్జర్లాండ్‌లో ఉండి అపారమైన జ్ఞానాన్ని సంపాదించిన ఆమె ఎందరో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రచయితల కవిత్వాలు, గ్రంథాల్ని ఔపోసన పట్టారు.

అదే ఏడాది.. స్వదేశానికి తిరిగివచ్చిన తరువాత డిసెంబర్ 2న, తన పంతొమ్మిదో ఏట డాక్టర్ గోవిందరాజులు నాయుడును ప్రేమ వివాహం చేసుకున్నారు. వారి వివాహాన్ని ఆనాటి సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జరిపించడం విశేషం! వీరికి జయసూర్య, పద్మజ, రణధీర్, లీలామణి నలుగురు సంతానం.

లండన్ కింగ్స్ కాలేజీ, కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించిన సరోజినీ నాయుడు.. తన రచనలతో బ్రిటిష్ విమర్శకులను సైతం మెప్పించారు. 'బర్డ్ ఆఫ్ ది టైం', 'ది గోల్డెన్ థ్రెషోల్డ్', 'ది బ్రోకెన్ వింగ్స్', 'ఫెదర్ ఆఫ్ డాన్' ఆమె రచనలలో ప్రసిద్ధమైనవి. అంతేకాదు, 'ఫీస్ట్ ఆఫ్ యూత్, ది మ్యాజిక్ ట్రీ, ది విజార్డ్ మాస్క్, ఎ ట్రెజరీ ఆఫ్ పోయెం'లు సరోజినీ నాయుడు ఆంగ్ల సాహిత్యానికి మచ్చుతునకలు. ఇంగ్లీషు పద్యాలలో భారతీయ ఆత్మ ప్రతిఫలిస్తుంది. అంతేకాదు, పద్యాలను రాగయుక్తంగా, శ్రావ్యంగా వినసొంపుగా పండటంతో ఆమెను 'భారత కోకిల' అని పిలిచేవారు.

గోపాల కృష్ణ గోఖలే సూచనలతో 1905లో కాంగ్రెస్ సభ్యురాలిగా చేరిన సరోజినీ నాయుడు.. 1915లో గాంధీజీని కలిసిన తర్వాత జాతీయోద్యమంలోకి ప్రవేశించారు. తన వాడియైన ప్రసంగాలు, ఉపన్యాసాలతో ప్రజలలో స్వాతంత్ర కాంక్షను రగిలించారు. ఐరిష్ వనిత అనిబిసెంట్ అధ్యక్షతన భారత మహిళా సమాఖ్య స్థాపన 1917లో ఏర్పాటుకు సహకరించి మహిళ ఓటు హక్కు కోసం సిఫారసు చేశారు.

1919లో మాంటెంగ్ ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం, 'ఖిలాఫత్' ఉద్యమం, రౌలత్ చట్టం, ఉప్పు సత్యాగ్రహంలో చురుకుగా పాల్గొన్నారు. 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. అప్పుడే భారత హోం రూల్ ప్రతినిధిగా లండన్ వెళ్లారు. ఇంగ్లాండులో ఉన్నప్పటికీ భారతీయుల జీవితాలను ప్రతిబింబిస్తూ రచనలు చేశారు.

స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశంలో తొలి మహిళా గవర్నర్‌గా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి నియమించబడి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. 1949 మార్చి 2న సరోజినినాయుడు తన 70వ ఏట ఈ లోకాన్ని విడిచివెళ్లారు. ఆమె సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం సరోజినీ నాయుడు జన్మదినం **ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవంగా** ప్రకటించింది.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

ద

# ఆదివాసీ జీవనం-సంస్కృతీ సంప్రదాయం

భారతీయ సంస్కృతి, నాగరికతలకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ ఈ ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల, నాగరికతల లక్షణాలు వ్యాపించి ఉండడం విశేషం. ఈశాన్య భారతంలో ప్రధానంగా ఏడు రాష్ట్రాలలోనూ, దక్షిణ భారతంలో నాలుగు రాష్ట్రాలలో వీరు అధికంగా నివసిస్తుండగా వీటిలో మన ఆంధ్ర ప్రదేశ్ కూడా ఒకటి. 1991 జనాభా లెక్కల ప్రకారం, దేశం మొత్తం మీద దాదాపుగా 8 కోట్లకు పైబడి ఆదివాసీ జనాభా ఉండగా, అందులో మన రాష్ట్రంలోనే 50 లక్షలకు (రాష్ట్ర జనాభాలో 6.59%) పైగా ఉన్నారు. విశాఖపట్నం జిల్లాలో సుమారు 2 లక్షల మంది ఉండగా, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో సుమారు 2 లక్షల మంది ఉన్నారు. మన రాష్ట్రంలో 33 గిరిజన తెగలున్నాయి. వీటిలో అత్యధిక శాతం తెగలు తమకంటూ ప్రత్యేకంగా ఒక మాతృభాషను, సంస్కృతీ సంప్రదాయాలను కలిగి ఉన్నాయి. లిపి విషయానికొస్తే, ఒక్క సవర తెగ (భాష)కు మాత్రమే ఉంది. ఈ తెగలు ప్రధానంగా తూర్పు కనుమల్లో కోస్తా తీరం వెంబడి శ్రీకాకుళం మొదలుకొని ఆదిలాబాద్ వరకు తొమ్మిది షెడ్యూలు జిల్లాల్లో (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఖమ్మం, వరంగల్, మహబూబ్నగర్ మరియు ఆదిలాబాదు) ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్నారు.



సాధారణంగా ఆయా ప్రాంతాల్లో నివసించే గిరిజన జాతులను బట్టి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఐదు తరగతులుగా వర్గీకరించారు. అవి గోండు (కోలాం ప్రాంతం), కోయ (కొండరెడ్డి ప్రాంతం), కోందు (సవర ప్రాంతం), చెంచు ప్రాంతం, మైదాన ప్రాంతం, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని గిరిజన ప్రాంతాలు ఈ వర్గీకరణ ప్రకారం, కోందు సవర ప్రాంతం కిందకు వస్తాయి. ఈ ప్రాంతంలో నాగావళి, వంశధార, సువర్ణముఖి, వేగావతి, మహేంద్రతనయ, గోముఖి, చంపావతి (గోస్థని), సీలేరు, శబరి, శారద మొదలైన నదులు అనేకం ఈ కొండ కోనల్లో ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం మనం చదవబోతున్న సంస్కృతీ సంప్రదాయాలు, నాగరికతలు శ్రీకాకుళం, విజయనగరం (ప్రస్తుతం పార్వతీపురం మన్యం) జిల్లాలకు సంబంధించినవి. ఇక్కడ ప్రధానంగా సవర, జాతాపు, గదబ, కొండదొర తెగలున్నాయి. వీటిలో కూడా సవర జాతి మిగిలిన వాటితో పోలిస్తే సంఖ్యాపరంగా, విస్తీర్ణంలోనూ, ఆధిక్యతను కలిగి ఉంది. తరువాత స్థానాన్ని జాతాపు తెగ ఆక్రమిస్తుంది. కాబట్టి ఈ ప్రాంత సవర, జాతాపు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది.

ఒక సమాజ సంస్కృతి, సంప్రదాయాలలో ఆ సమాజ సారస్వతము లేక సాహిత్యానికి గల స్థానం అద్వితీయమైనది. ఎందుకంటే ఆ సమాజ సమస్త స్థితిగతులకు అది దర్పణం పడుతుంది. కాబట్టి, ఆధునిక సమాజంలో పండితులచే లిఖించబడేదంతా శిష్ట సాహిత్యమైతే, కొండ కోనల్లోనూ పల్లెల మధ్య జానపదాల గుండెల్లో నుండి సాహిత్యం, మొత్తం, జానపద సాహిత్యంలో గిరిజన సాహిత్యం కూడా ఒక అంతర్భాగం. అయితే లిపి ఎరుగని ఈ సమాజంలో శిష్ట సాహిత్యానికి అసలు తావేలేదు. నిజానికి శిష్టసాహిత్యానికి ఉన్నంత ప్రచారంగాని, మనుగడ, తోడ్పాటుగాని జానపద ముఖ్యంగా గిరిజన సాహిత్యానికి లేకపోవడం దురదృష్టకరం. ఇది దీని యొక్క ప్రధాన లక్షణం అని కూడా చెప్పవచ్చు. ఏ సాహిత్యానికైనా ఆనందమే పరమావధి అన్న మాట అందరూ అంగీకరించిన సత్యం. ఆ విధంగా చూపినప్పుడు ఆనందాన్ని అందించడంలో జానపద (గిరిజన) సాహిత్యానికి మించిన సాహిత్యం మరొకటి లేదంటే అతిశయోక్తి కాదేమో!

ఇంకో మాటలో చెప్పాలంటే జానపదానికి సాధారణంగా ఇలాంటి లక్షణాలు ఉంటాయి అని చెప్పగలుగుతాము. కానీ, ఈ సామెతకు ఈ లక్షణం ఉండాలి. ఈ పొడుపు కథను ఇలాగే చెప్పి తీరాలి, ఈ గేయాన్ని ఇలాగే పాడాలి అనే ఖచ్చితమైన నియమం దీనికి లేదు. అలా విధించే హక్కుకూడా ఎవరికి లేదు. వీటి లక్షణాలను గూర్చి చెప్పాల్సి వచ్చినపుడు, 1) ఎవరు వ్రాసారో, ఎప్పుడు, ఎక్కడ వ్రాసారో తెలియకపోవడం, 2) ఈ సాహిత్యం మొత్తం మౌఖిక సంప్రదాయంలోనే జీవించడం, 3) జానపద గేయాల విషయానికొస్తే, చెవులకు ఇంపైన శోభనిచ్చే గానయోగ్యతను కలిగి ఉండడం, గానమే వీటికి ప్రాణంగా ఉండడం, 4) ఒక నిర్దిష్టమైన లేక నియమిత స్వరూపాన్ని కలిగి ఉండకపోవడం, 5) ఏ సాధనాలు, సామగ్రి అవసరం లేకుండా అలవోకగా పెల్లుబికే కవిత ఒక ప్రవాహంగా, అంటే ఆశువుగా చెప్పుకుంటూ పోయేవిగా ఇవి ఉండడం, 6) సహజ సౌందర్యమే తప్ప, సూత్రాలు, శాస్త్రాలు, నియమ నిబంధనల వంటి కృత్రిమ శోభకు అంతగా తావులేకుండా (మనస్సును ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా) ఉండడం, 7) గేయంలో పునరావృత్తి అంటే ఒక పదంగాని, ఒక పాదంగాని పదేపదే రావడం (ఉదాహరణకు వెన్నెలా... వెన్నెలా, మామయ్యో., మామయ్యా, దొంగిడి.. దాంగిడి.. ఉయ్యాలో.. ఉయ్యాలో), 8) చెప్పే విషయం అందరికి బాగా తెలిసిన జనసామాన్యమైన వస్తువై ఉండడం, 9) చెప్పేది, బావమరదళ్ల సరసమైనా, శిశువు గురించైనా, పశువు గురించైనా, కోలాటమైనా, భక్తి కీర్తనైనా, ఆనందమైనా, విచారమైనా, మరేదైనా రసవత్తరంగా చెప్పడం లాంటి వాటిని కొన్నింటిని జానపద సాహిత్య ప్రధాన లక్షణాలుగా చెప్పవచ్చు.

### పాడుకునే పాటలు

జానపద సాహిత్యం అనగానే వెంటనే మన మనసులో మెదిలేది గేయమే. జానపద సాహిత్యానికి మరో పేరు జానపద గేయం అన్నా తప్పులేదేమో. ఎందుకంటే ఈ సాహిత్యంలో గేయాలే (పాటలు) ఎక్కువ ప్రాచుర్యం పొందియుంటాయి. ఈ పాట. సాధారణంగా ఎవరో ఒకరి మనసున మెదిలి, కూనిరాగంగా మొదలై, ప్రకృతి లయకు తాళం వేస్తూ, దానికి భాష జతకట్టడంతో గేయంగా రూపొంది, ఆ తరువాత అక్కడి మానవ జీవంలోని వివిధ దశలకు ప్రతినూతనంగా కొనసాగుతుంది. మార్పు చెందుతూ, అంటే ఆ కూర్పులో ఎప్పటికప్పుడు అనేక మార్పులు, చేర్పులకు లోనగుతూ, పాత ఒరవడిలో క్రొత్త పదాలు, క్రొత్త జీవనానికి పాత బాణీలు కట్టుకుంటూ పారే చెలయేరులా నిత్యనూతనంగా కొనసాగుతుంది. ఒక తరం నుండి మరొక తరానికి వినికిడియే సాధనంగా సాగిపోయే స్వేచ్ఛావిహారిణి ఇది. కాబట్టి ఏదైనా ఒక జానపద కళారూపం ఇలాగే ఉంటుంది, ఉండాలి, ఇదే మూలం. అసలు, ప్రతి అని చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు. దీనిపై ఎవరి ముద్ర. అధికారం ఉండదు.

### పాటల వర్గీకరణ

జానపద సాహిత్యంలో అతి ప్రధానమైన ఈ గేయ ప్రక్రియలో ఎన్నో రకాలు ఉన్నాయి. మొత్తంగా చూసినప్పుడు కథాసహితాలు అను ఒక స్థూల విభజన ఉంది. సూక్ష్మంగా పరిశీలిస్తే మరికొన్ని వర్గీకరణలను చూడవచ్చు.



### వస్తు ప్రధాన వర్గీకరణ

పాటలోని ప్రధాన విషయాన్ని లేక వస్తువును బట్టి రామాయణం, భారతాలు వంటి పురాణ గాథలకు చెందినవి పౌరాణికాలు, చరిత్ర అంశాలను తెలిపే చారిత్రక గేయాలు, భగవారాధనకు సంబంధించిన కీర్తనలు, తత్వాలు, మంగళ హారతులు, మత సంబంధమైన గేయాలు, మలార్, మడీర్, బెమ్మంగోరి సుద్దులు వంటి పారమార్థిక గేయాలు, లాలిపాటలు/జోలపాటలు, పెండ్లిపాటలు, సమర్త పాటలు, అత్తాకోడళ్ల పాటలు, సీతమ్మోరి పాటలు వంటి స్త్రీల పాటలు, రోకట్లో పోటు వేస్తూ తిరగలి త్రిప్పుతూ లేక వ్యవసాయం, అటవీ పనులు చేసుకుంటూ సాగే శ్రామిక గేయాలు, ప్రత్యేకించి పిల్లలు పాడుకునేవి లేక పిల్లల కోసం తల్లులు పాడే చిన్నారుల పాటలు, వరసైన యువతీయువకులు కలసి సరదాగా పాడుకునే ప్రేమ, సరస లేక శృంగార గీతాలు, ఏవో అద్భుతమైన విషయాలు, మాయాజాలాలకు సంబంధించిన అద్భుత గేయాలు, కరుణరస పాటలు వినేవారికి ఆనందాన్ని నవ్వును ప్రసాదించడమే ప్రధాన లక్షణంగా కలిగిన హాస్యపు పాటలు, ప్రజలకు వివిధ విషయాలపై అవగాహన కల్పించే, సంస్కరణోద్దేశ్యం కలిగిన చైతన్య గీతాలు ఇలా ఎన్నో తరగతులకు చెందిన జానపద గేయాలు ఈ వర్గీకరణలో మనకు కనిపిస్తాయి.

### వ్యక్తి (లింగ) ప్రధాన వర్గీకరణ

పాడే వ్యక్తులను బట్టి మొత్తం పాటలను స్త్రీలు మాత్రమే పాడుకునేవి, పురుషులు మాత్రమే పాడుకునేవి. స్త్రీలు, పురుషులు కలిసి పాడుకునేవి అని మూడు రకాలుగా చెప్పవచ్చు. స్త్రీల పాటలు, పురుషుల పాటలు, స్త్రీ, పురుషులు కలసి పాడుకునే పాటలు, రసప్రధానమైన వర్గీకరణ, శృంగార గీతాలు, విషాద గీతాలు లేక భావగీతాలు, కరుణ గీతాలు, భక్తిగీతాలు ఇలా వర్గాలుగా పాడుకునేవి.

### ఆడుకునే ఆటలు

మనిషి జీవితంలో బాల్యదశ సూర్యోదయం వంటిదని, ప్రముఖ ఆంగ్ల కవి జాన్ మిల్టన్ అన్నారు. మనస్సు, శరీరము రెండు కూడా నిరంతరంగా సంచరించే అంటే చెంగు చెంగున గంతులు వేసే స్వభావం, కలిగిన వారే బాలలు. వారు నిత్య క్రీడాసక్తులు. జానపద గిరిజన బాలలకు ఆటపాటలంటే ప్రాణం. నిజానికి ఆటలంటే అభిరుచి లేని, ఆసక్తి చూపని బాలలు ఎవరుంటారు? కాకపోతే వీరికి మరింత మక్కువ. ఈ ఆటలలో ఆడపిల్లలు మాత్రమే ఆడుకునేవి. మగ పిల్లలు మాత్రమే అడుకునేవి, ఇరువురు కలసి ఆడుకునేవి ఉంటాయి. ఇక్కడ గిరిజన సమాజంలో ఇరువురు కలసి ఆడుకునేవే ఎక్కువగా ఉంటాయి. కొన్ని పూర్వపు ఆటల పేర్లు తెలిసినప్పటికి వాటిని ఎలా ఆడేవారు వాటి స్వరూప స్వభావాలు ఏంటో ఇప్పటి తరానికి తెలియదు. అలాగే వాటి స్థానంలో కొన్ని కొతకొత్త ఆటలు కూడా వచ్చి చేరుతుంటాయి. ఇతర సమాజాలతో ఏర్పడే సంబంధ బాంధవ్యాలే ఈ మార్పుకు కారణం. పక్షుల్ని, పశువుల్ని పెంచడం, వాటితో ఆడుకోవడం, ప్రకృతిలో సహజీవనం చేయడం పరిపాటి. ఆయా కాలాల్లో ప్రత్యేకమైన ఆటలు ఉంటాయి.

### చెప్పుకునే కథలు

ఆదివాసీ బాలలలో ఎక్కువ మంది నిరక్షరాస్యులే. అమాయకులు కూడాను. అందువలన మిగిలిన పిల్లలతో పోలిస్తే ప్రతీ దానికి ఆశ్చర్యపడటం, ఆనందించడం కూడా ఎక్కువే. ఐతే చిన్నప్పటి నుండి ఎన్నో విషయాలు అవి నిత్యజీవితానికి సంబంధించినవి కావచ్చు, లేక లౌకికమైనవి కావచ్చు. పెద్దతరం వాళ్లనుండి లేక సొంత తల్లులు లేక పిల్లలు తమలో తాము చెప్పుకొనే కథల రూపంగా నేర్చుకుంటూ ఉంటారు. కథలను వినడం అనేది పిల్లల్లో ఉండే ప్రత్యేకమైన ప్రవృత్తి మరియు సహజ సిద్ధమైన కుతూహలం అని చెప్పాలి. గిరిజన బాలల్లో మరింత మక్కువ ఎక్కువ, ఐతే వీరికున్న అవకాశం మాటకు వస్తే వినికిడియే ప్రధాన మార్గంగా ఇవి ఒక తరం నుండి మరొక తరానికి చేరవేయబడుతుంటాయి. పుస్తకాలు, ఇతర మాధ్యమాలకు అసలు తావులేదు.

### జరుపుకునే పండుగలు





జానపదులు నిరంతర శ్రమజీవులు, అయినా తీరిక వేళల్లో ఆటపాటలు, ఆనందోత్సహాలకు కొదువ ఉండదు. ముఖ్యంగా పండగలు, పబ్బాలు వస్తే, జాతరలు జరుగుతున్నాయంటే ఇక్కడ పిల్లలకు, పెద్దలకు పట్టరాని సంతోషం. ఉన్న దాంట్లోనే అందరూ కలిసి సంబరాలు చేసుకుంటారు. వీరు జరుపుకునే పండగలన్నింటిలోను ప్రకృతి ఆరాధన అంతర్లీనంగా ఉంటుంది. పండుగలన్ని ఇంచుమించు వ్యవసాయ సంబంధమైనవో, అటవీ ఫలసాయాల సేకరణకు సంబంధించినవో. అంతకీ కాదంటే గ్రామదేవతలకు సంబంధించినవో అయి ఉంటాయి. గ్రామ దేవతారాధనను మాతృస్వామిక వ్యవస్థకు చిహ్నంగా భావించవచ్చు. ఎందుకంటే గ్రామదేవతలలో చాలా వరకు స్త్రీమూర్తులే. ఎల్లమ్మ, గంగమ్మ, సన్యాసమ్మ, పెద్దమ్మ, మల్లమ్మ, అంగరాలమ్మ, పోలేరమ్మ, సంకులమ్మ, ఇలా పలు రకాల పేర్లతో పలు ప్రాంతాలలో జానపదులు గ్రామదేవతలను పూజిస్తుంటారు. అంటు రోగాలు ప్రబలినప్పుడో, కరువు కాటకాలు వచ్చినప్పుడో లేక బాగా పంటలు పండిన సందర్భంగానో, బాగా పంటలు పండాలనో, వేట సాగాలనో గ్రామస్తులందరూ కలిసి వీరిని కొలుస్తుంటారు. కొందరు మొక్కుబడిగా మేకపోతును, దున్నపోతులను, కోళ్లను మొదలైన జంతువులను బలి ఇవ్వడం, మద్యాన్ని అరగింపుగా పెట్టడం సర్వసాధారణం. ఢంకా, తుడుం, సన్నాయి, తంబర, తిరియ వంటి వీరి ప్రత్యేక వాయిద్య సాధనాలను రకరకాల నృత్యాల్లో ఉపయోగిస్తారు. చనిపోయిన పెద్దలను తలుచుకోవడానికి వారి ఆత్మలను శాంతింపజేయడానికి ప్రత్యేకించి కొన్ని పండుగలు (ఉదా॥ ఆగం) చేస్తారు. ఈ సందర్భంగా మంత్రాలు చదివే ఆచారం కూడా ఉంది. పూజలో సారా సమర్పించడం రివాజు, చనిపోయిన వారికి గుర్తుగా ఉండే కొలరాతి వద్ద, చనిపోయినది ఆడవారైతే దానికి చీరముక్క చుట్టి. గాజులు, అద్దం, చంప పిన్నులు, ఇతర అలంకార వస్తువులు, అడ్డ రోకలి వంటివి; మగవారైతే కొత్త పంచె ముక్కను చుట్టి, బియ్యం, జొన్నలు, కందులు, కొర్రలు, ఊదలు, జనుములు, ఆరికి తేగ మొదలైన వాటిలో వండిన వంటకాన్ని (బెల్లం జావ) ఆరగింపుగా పెడతారు. ఇక్కడ చేసే నృత్యాలు కూడా వేరుగా ఉంటాయి. ఆడ, మగ విడివిడిగా ఉజ్జీలు కట్టి ఆడతారు. ఉదయం ఆటను 'తంబంగాడు', సాయంత్రం ఆటను 'ఉంబిగాడు', రాత్రి ఆటను 'తోగల్గాడు' అంటారు.

**పండించే పంటలు**

ఆధునిక ప్రపంచంలో సంబంధాలు ఏర్పడకముందే ఆదిమ ఆర్థిక వ్యవస్థలన్నీ డబ్బుకు దూరంగా వస్తుమార్పిడి విధానాన్ని అనుసరించినప్పటికీ ప్రస్తుతం అటువంటి పరిస్థితి చాలావరకు లేదనే చెప్పాలి. తమ జీవన అవసరాలను తీర్చుకోవడానికి ఒకప్పుడు వారికి ఆహార సేకరణ (అటవీ ఫలసాయం), వేట, వ్యవసాయం, ప్రధాన మార్గాలుగా ఉండగా, ప్రస్తుతం మొదటి రెండింటి అందుబాటు క్రమేపీ తగ్గిపోతుండగా, ఇతర సమాజాల్లాగే వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా మారుతుంది.

**వాడుకునే వస్తు సామగ్రి**

ప్రస్తుతం కొన్ని రకాల మార్పులు చోటు చేసుకున్నప్పటికీ, ఎక్కువ మంది తమ సంప్రదాయ జీవనానికి పూర్తిగా దూరం మాత్రం కాలేదు. సవర సంప్రదాయ జీవనం ప్రకారం...

ఇక్కడ ఇళ్లు చాలా చిన్నవి. సంప్రదాయబద్ధమైన ఇల్లు దాదాపు పన్నెండు అడుగుల పొడవు, పదహారు అడుగుల వెడల్పును కలిగి ఉంటాయి. ఒడ్డ వంటి ధాన్యం, ఇతర చిరు ధాన్యాలను దంచుకోవడానికి చెక్కరోలును లేక రాతి బండను ఉపయోగిస్తారు. అబకలను, గరిటెలను తయారు చేసుకుంటారు. చాలావరకు వెనుకటి కాలం వారు ముతక బట్టలు కట్టుకుంటారు. ఇంటిలోని గోడలపైన రకరకాల చెట్లు, జంతువులు, పక్షుల బొమ్మలను అందంగా ఉండటానికి గీసుకుంటారు. పురుషులు మొలకు గోచి పెట్టుకుంటారు. గోచికి ఎర్రని దారాలతో కుచ్చు ఉంటుంది. తలకు గుడ్డ చుట్టుకుంటారు. హోదాను బట్టి అది మారుతుంది. ప్రత్యేకించి పండుగ రోజులలో రంగు రంగు బట్టలు కట్టుకుని తలపాగాల్లో పక్షుల ఈకలు అలంకరించుకుంటారు. స్త్రీలు ఒక ముతక బట్టను మొలచుట్టూ మోకాలి పైవరకూ చుట్టుకుంటారు. పైభాగాన వస్త్రం ఏది ఉండేది కాదు.. ప్రస్తుతం ఇది మారింది. అక్కడక్కడా చీరలు, రవికలు కడుతున్నారు. వృద్ధులు మాత్రం రవిక లేకుండానే ఉంటారు. ఎడమ వైపున కొప్పు పెట్టుకుంటారు. ఇత్తడి పువ్వులు, గొలుసులు తలలో ధరిస్తారు. చెవికి పది, పన్నెండు కుట్లు ఉంటాయి. వాటికి ఇత్తడి చుట్లు ఉండి, బరువుకు బాగా సాగిపోతాయి. గాజుపూసలు, పగడాలు, గురిగింజలు దండలుగా గ్రుచ్చుకొని మెడలో వేసుకుంటారు.. ఒక్కొక్క చేతికి నాలుగు చొప్పున వ్రేళ్లకు చుట్టు ఉంటాయి. గ్రామ పెద్ద భార్య పెద్ద కడియాలు వేసుకుంటుంది. సవరలు గ్రామాధికారిని 'గోమాంగ్' అంటారు. ఈ అధికారం వంశపారంపర్యం.

వీరికి వేటాడడం బాగా తెలుసు, ఇష్టం కూడా. బాణాలు, విల్లంబులు. వ్యవసాయ పనిముట్లు, గండర గొడ్డళ్లు లాంటివి తయారు చేసుకోగలరు. కుండలు చేసే సవరలను 'కుంబీ సవరలు' అని, లోహపు పనులు చేసే వారిని 'లారా' అని అంటారు. రాళ్లను,





నీటిని దేవతలుగా మొక్కుతారు.

పురుషులు జుట్టు కత్తిరించరు, సిగ వేస్తారు, చెంప పిన్నులను స్త్రీ, పురుషులు ఇద్దరూ ఉపయోగిస్తారు. కడియాలు, ఉంగరాలు ధరిస్తారు. స్త్రీలు కాళ్లకు కడియాలు, కాళ్లవేళ్లకు మట్టెలు, చేతులకు దండ కడియాలు, ముంజేతికి మట్టిగాజులు, ఉంగరాలు, బొట్టు, కాటుక పెట్టుకుంటారు. సవర స్త్రీ, పురుషులు, పిల్లలు, పెద్దలు అందరూ ఈత, జీలుగ కల్లు మరియు విప్పసారా త్రాగుతారు. వ్యవసాయ పనిముట్లు చేసేవాడిని 'జిన్నోడు' అంటారు. ఇండ్లపై కప్పులను వెదురుబద్దలు పేర్చి గడ్డితో కప్పేవారు. నేలను పేడతో అలుకుతారు. ఇంట్లో సాధారణంగా కంకా, గొడ్డలి, కొడవలి, విల్లంబులు, బాణాలు, కత్తులు, బళ్లాలు మొదలైనవి ఉంటాయి. వంటలు వడ్డించుకోవడానికి కర్ర తెడ్డు, ఆనపకాయ డోకి, కొబ్బరికాయ చిప్ప మొదలైనవి వాడతారు.



## ఆరోగ్యం – మూలికా వైద్యం

మనిషి తన జీవితాన్ని ఇతర వన్య ప్రాణులతో పోటీ కొనసాగిస్తూ, కాలక్రమేణా తన ఆలోచనా వ్యక్తిని, పరిశీలనా జ్ఞానాన్ని, సంగ్రహ బుద్ధిని ఉపయోగించుకొని తన జీవన కాలాన్ని రుగ్మతలను నివారించుకొని, అకాల మరణాల నుండి బయటపడడం, సుఖజీవనాన్ని పొందడం ఏనాడో నేర్చుకున్నాడు. ఈ ప్రయత్నంపై అతనికి ముందుగా సహకరించినవి వివిధ మొక్కలు, చెట్ల వేర్లు, కాయలు, గింజలు మొదలైనవే. మొక్కల ద్వారా తనకు ప్రాథమిక అవసరాలైన తిండి, బట్టే కాక ఆరోగ్యం కాపాడుకోవడం కూడా సాధ్యమవుతుందని వేల సంవత్సరాల క్రితమే తెలుసుకోగలిగాడు. వాటిని ఉపయోగించడం మొదలుపెట్టాడు. వాటినే వనమూలికలని, ఈ విధానాన్ని మూలికా వైద్యమని నేడు పిలుస్తున్నాం. దీనిలో ఎలాంటి సాంకేతిక ప్రక్రియలను ఉపయోగించక నేరుగా చెట్ల బెరడు, వేళు ,, ఆకులు, కాలు, గింజలు మొదలగు వృక్షభాగాలనే ఉపయోగించడం వల్ల ఇది వనమూలికా వైద్యం అయింది. ఈ విధానం భారతదేశంలో ఎంతో ప్రాచీనమైనది. ఈ విధానం నుండే ఉత్తర భారతదేశంలో ఆయుర్వేదం, తమిళనాడులో సిద్ధ, ముస్లిం దేశాలలో యునాని, జర్మనీలో హోమియోపతి వంటి ఎన్నో వైద్యవిధానాలు అభివృద్ధి చెందాయి. నాగరికత పెరిగే కొద్దీ మనిషి వీటిని వదలిపెట్టి క్రొత్తకొత్త వైద్య పద్ధతులను అభివృద్ధి చేసుకున్నాడు. కానీ ఆదివాసీలు మాత్రం నేటికీ ఏ ప్రాంతమైనా ఈ మూలికా వైద్యంపైనే ఆధారపడి నేటికీ తమ ప్రాణాలను నిలబెట్టుకొంటున్నారు. రోగ నివారణ చేసుకుంటున్నారు. ఈ విషయంలో శ్రీకాకుళం, విజయనగరం ఆదివాసీ ప్రాంతాలు కూడా ఎంతమాత్రం మినహాయింపు కాదు.

## మూలికా వైద్యం ఆదరణ

మన దేశంలో ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వందల సంవత్సరాలుగా కాలపరీక్షకు నిలబడి, తన ఉనికిని చాటుకుంటుందని, అన్ని రకాల జబ్బులకు కాకపోయినా, కొన్ని రకాల (ప్రత్యేక) వ్యాధుల నివారణ విషయంలో ఈ మూలికా వైద్యవిధానం ప్రఖ్యాతి గాంచిందని మనకు తెలుసు. అయితే దీనికి మిగిలిన (నగర) సమాజంలో అంతగా ఆదరణ లేని మాట నిజం. అందుకు కారణాలు ఏమంటే ఇతర విధానాల ప్రాబల్యపరంగా చూస్తే అల్లోపతి వైద్య విధాన ప్రభావానికి మిగిలిన పద్ధతుల్నీ గాలికి కొట్టుకుపోయాయి. ఆదివాసీల జీవనంలో మాత్రం ఆరోగ్య పరిరక్షణ విషయంలో నేటికీ మూలికా వైద్యానికి గల స్థానం తిరుగులేనిది. అందుకు ఆదివాసీ సంప్రదాయ వైద్యులకు గల అనుభవం, ప్రావీణ్యం ప్రజలకు వారిపట్ల గల నమ్మకం చాలా వరకు కారణమైతే ప్రభుత్వ సేవలు ఈ ప్రాంతాల్లో కొద్దిమంది ప్రజలకైనా అందుబాటులో లేకపోవడం, మరికొంత కారణం కాకపోవడం, ఒకప్పుడు మన దేశంలో ముఖ్యంగా ఇక్కడి అటవీ ప్రాంతాల్లో దాదాపుగా 3000 రకాల ఔషధ మొక్కలు ఉండేవని ఒక అంచనా. శ్రీకాకుళం, విజయనగరం అడవుల్లోనే దాదాపుగా వంద రకాల ఔషధ మొక్కలు దొరికేవని ఇప్పుడు 30–40కి మించి దొరకడం లేదని అనుభవజ్ఞులైన ఈ వైద్యులు చెబుతున్నారు..

ఆదివాసీలు తమ జీవనాన్ని, తమ మనుగడను తమ సంస్కృతీ సంప్రదాయాలను, పాటలను, ఆటలను, కథలను, అటవీ ఉత్పత్తుల సేకరణకు, పశు పంటలకు వ్యవసాయాన్ని, పండుగలను, ఆభరణాలను, వాడుకొనే వస్తువులను, మూలికా వైద్యాన్ని, తమ జీవన సారగాలను, తమ మనుగడను, క్రమేపీ యువత దూరమవుతూ పెద్దలు కాపాడుకుంటూ తమ మనుగడను సాగిస్తున్నారు.

–నూక సన్యాసిరావు
కార్యదర్శి, ఆర్ట్స్ సంస్థ శ్రీకాకుళం జిల్లా

ద

# చిత్తడి నేలలపై పెరుగుతున్న ఒత్తిడి

జీవుల మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు చిత్తడి నేలలు ఎంతో అవసరం. ప్రపంచవ్యాప్తంగా గడచిన వందేళ్లలో ఇవి 64శాతం మేర అంతరించిపోయాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. చిత్తడి నేలల ప్రాధాన్యాన్ని గుర్తించడంతో పాటు వాటి పరిరక్షణ, అభివృద్ధి కోసం కృషి చేయాలని ఇరాన్‌లోని రామ్సార్‌లో 1971లో ప్రపంచ దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ తరువాత నుంచి ఏటా **ఫిబ్రవరి రెండో తేదీన చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం** నిర్వహిస్తున్నారు.

చిత్తడినేలలు అనే పదం విన్నవారే తక్కువ. ఇక ఆ చిత్తడినేలల ప్రాముఖ్య గురించి తెలిసిన వారు బహు తక్కువ. దాని ఫలితమే అతి వేగంగా అంతరించిపోతున్న చిత్తడినేలలు, భౌగోళికపరంగా, జీవ వైవిధ్య పరంగా చిత్తడినేలలు ఎంతో కీలకమైనవి. సముద్ర తీరప్రాంతాలలోనైనా, నదుల ప్రాంతాలలోనైనా సంవత్సరంలో అధిక కాలము నీరు నిలిచివుండి, లోతు తక్కువగా ఉండే ప్రదేశాలను చిత్తడి నేలలుగా పిలుస్తారు. మంచినీటి, ఉప్పునీటి సరస్సులు, మడ అడవులు కలిగిన సాగర సంగమ ప్రాంతాలు, బురద కయ్యలు, ఉప్పునీటి కయ్యలు, ప్రవాహాలు కలిగిన ప్రాంతాలు వంటివన్నీ చిత్తడి నేలల కిందకే వస్తాయి.

### చిత్తడి నేలలు 19 రకాలు

సముద్ర, నదీతీర ప్రాంతాల్లో ఏడాది పొడవునా నీటి వనరులతో నిండి ఉండే ప్రదేశాలను చిత్తడి నేలలుగా పరిగణిస్తారు. మంచినీటితో పాటు ఉప్పునీటి సరస్సులు, తంపర, బీల భూములు, పగడపు దిబ్బలు, మడ అడవులు తదితర 19 రకాల ప్రాంతాలు చిత్తడి నేలల కిందకు వస్తాయి. నదీతీరాల్లోని చిత్తడి నేలలు ప్రవాహ ఉద్ధృతిని, అలల తాకిడిని అడ్డుకుని తుపానులు, వరదల ప్రభావాన్ని తగ్గిస్తాయి. పర్యావరణ మార్పుల కారణంగా వాటిల్లే దుష్ప్రభావాలను గణనీయంగా నియంత్రిస్తాయి. అరుదైన మత్స్య, వృక్షజాతుల జీవనానికి దోహదపడటంతో పాటు దేశ, విదేశీ వలస పక్షులకు ఆశ్రయమిస్తాయి. ఈ నేలలు పరిసర ప్రాంతాల్లోని నీటి నాణ్యతను పెంచడమే కాదు, కాలుష్య తీవ్రతను తగ్గించడంలోనూ కీలకమవుతున్నాయి. చిత్తడి నేలలు సాగు, తాగునీరు అందిస్తూ ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మంది ఆహార భద్రతకు భరోసా కల్పిస్తున్నాయి.

### బహుముఖ చర్యలు కీలకం

కేంద్రం మార్గదర్శకాలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తింపు పొందిన చిత్తడి నేలల సమాచారాన్ని పౌరులకు అందుబాటులో ఉంచాలి. పర్యావరణ, అటవీ, వన్యప్రాణి, కోస్తా నియంత్రణ చట్టాలను వర్తింపజేయడంతో పాటు వ్యర్థ రసాయనాలు, విషపూరిత జలాలను చిత్తడి నేలల్లో పారబోయకుండా నిఘాను తీవ్రతరం చేయాలి. కఠిన శిక్షలు, భారీ జరిమానాలు విధించడం ద్వారా ఈ నేలల ఆక్రమణలను, విధ్వంసాన్ని అడ్డుకోవాలి. చిత్తడి నేలల పరిరక్షణ కోసం గతంలో కేంద్రం ప్రకటించిన 'అమృత్ ధరోహర్' పథకాన్ని రామ్సార్ గుర్తింపు ఉన్న ప్రదేశాలకే పరిమితం చేశారు. దాన్ని మిగతా చిత్తడి నేలలకూ వర్తింపజేయాలి. పర్యాటక, అటవీ, పర్యావరణ శాఖలు సంయుక్తంగా చిత్తడి నేలల పరిరక్షణకు జిల్లాస్థాయి ప్రణాళికలను రూపొందించి స్థానిక సమూహాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సమర్థంగా అమలుపరచాలి. ఇటువంటి చర్యలు కొరవడితే- చిత్తడి నేలల విధ్వంసం నిరాటంకంగా సాగుతూనే ఉంటుంది!




### కొరవడిన సంకల్పం

చిత్తడి నేలల విధ్వంసం మూలంగా పర్యావరణ మార్పుల దుష్పరిణామాలు అధికమవుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి పరిరక్షణకు పటిష్ఠ కార్యాచరణను రూపొందించి అమలుపరచాలని కోపెన్‌హాగెన్ వంటి ప్రపంచస్థాయి సమావేశాలెన్నో తీర్మానాలు చేశాయి. అందుకు గట్టి సంకల్పం కొరవడటం దురదృష్టకరం. జనాభా పెరుగుదలకు తోడు పారిశ్రామిక అవసరాల కోసం చిత్తడి నేలలను మట్టితో కప్పి ఆక్రమించేస్తున్నారు. పంటల సాగు కోసం రసాయన ఎరువులు, పురుగు మందులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఆ ప్రభావంవల్ల చిత్తడి నేలలు సహజ స్వభావాన్ని కోల్పోతున్నాయి.



జలవనరులు మానవాళి మనుగడకు ఎంతో కీలకం. అందుకే మానవ సంస్కృతి నదీ తీరాలలోనే విలసిల్లినది. సింధు, గంగానది, కృష్ణానదీ, గోదావరీ నదీతీరాలలోనే విలసిల్లినది. నేడు మహానగరములుగా భాసిల్లుతున్న కలకత్తా, ముంబయి, చెన్నై, టొకియో, న్యూయార్క్ వంటివన్నీ జలవనరుల ఆధారముగా ఎదిగినవే, అన్ని దిక్కులనుండి అక్కడికి ప్రజలను ఆకర్షించడానికి మూలము ఆ నగరాల ఆర్థికసంపద అయితే, ఆ ఆర్థిక సంపదను అందించినది ఆ ప్రాంతాలలో ఉన్న చిత్తడి నేలలే. ఒక ప్రాంత ఆర్థికవ్యవస్థలో చిత్తడి నేలలు కీలక పాత్ర వహిస్తాయి. సముద్రతీరంలో ఉన్న చిత్తడినేలలు ఆ ప్రదేశానికి స్థిరత్వాన్నిస్తాయి. అలల తాకిడికి ఆ ప్రాంతం దెబ్బతినకుండా రక్షిస్తాయి. నదులప్రాంతంలో అయితే చిత్తడినేలలు వరదముంపుల నుండి రక్షిస్తాయి. చిత్తడినేలలు అనేక వందల రకాల మొక్కలు, జంతువులకు మెరుగైన ఆశ్రయాన్నిస్తాయి.

చేపలు, రొయ్యలు వంటి అనేక నీటిజాతులకు గుడ్లు పెట్టేందుకు, పిల్లలు ఎదిగేందుకు సౌకర్యము కల్పిస్తాయి. ఆయా ప్రాంతాలలో ఉండే నీటి నాణ్యతను పెంచడంలోనూ చిత్తడినేలలు పాత్ర వహిస్తాయి. ఆ ప్రదేశాలలోకి వదలబడిన కాలుష్యకారకాలను గ్రహిస్తాయి. ఇన్ని లాభాల్ని అందించే చిత్తడి నేలల విలువను డబ్బు రూపంలో లెక్కకడితే కొన్ని లక్షలకోట్ల రూపాయల్లో ఉంటుంది. నీటికి, భూమికి అనుసంధాన ప్రాంతంగా ఉండే ఈ చిత్తడినేలల ప్రాముఖ్యతను అర్థము చేసుకోలేకపోయిన ప్రజలు తమ ఆవాసాల విస్తరణలో చిత్తడి నేలలను మింగేయసాగారు. ముంబయి నగరం ఈ స్థాయికి విస్తరించిందంటే దానివెనక మాయమైన చిత్తడి నేలలు అనేకము ఉన్నాయి. చిత్తడి నేలలు ఆక్రమించి, మట్టితో కప్పి తమ భవన నిర్మాణానికి వాడుకోవడం మొదలు పెట్టారు. ఒకప్పుడు చిత్తడి నేల ఆడవులుగా ఉన్న ముంబయి ప్రాంతంలో నేడు కాంక్రీటు భవనాలు నిలిచాయి. ఇది కేవలము మనదేశానికి సంబంధిన సమస్యకాదు. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక అభివృద్ధితో తరిగిపోతున్న చిత్తిడి నేలలను గుర్తించి అంతర్జాతీయ వేదిక ఒక ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేసింది.

1971 ఫిబ్రవరి 02న చిత్తడి నేలల మీద ప్రపంచ దృష్టి మళ్ళించే సదస్సు ఇరాన్ దేశములో రామ్‌సార్ పట్టణములో జరిగింది. కాస్పియన్ సముద్రతీరం మీదున్న ఆ రామ్‌సార్ జరిపిన చర్చల ఫలితంగా ప్రపంచంలోని దేశాలన్నీ తమ తమ దేశాల్లోని కీలక చిత్తడి నేలలను గుర్తించి వాటి పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తీర్మాణము చేసారు. ప్రత్యేక చట్టాలతో వాటిని రక్షించాల్సిన భాద్యత ప్రభుత్వాలపైన పెట్టింది. అయినా చిత్తడి నేలల మీద దృష్టి 1997 వరకు కేంద్రీకరించబడలేదు.

తొలిసారిగా ప్రపంచ చిత్తడినేలల దినోత్సవాన్ని 1997లో ఫిబ్రవరి 02న జరిపారు. నాటి నుండి ప్రతియేటా ఈ దినోత్సవం జరుగుతోంది. ఒక్కొక్క సంవత్సరము ఒక కొత్త అంశం మీద దృష్టి పెడుతూ ఈ దినోత్సవాన్ని జరుపుతున్నారు.

ఈ సంవత్సరం థీమ్: **"తడి నేలలు మరియు సాంప్రదాయ జ్ఞానం: సాంస్కృతిక వారసత్వాన్ని జరుపుకోవడం."** చిత్తడి నేల పర్యావరణ వ్యవస్థలను నిలబెట్టడంలో మరియు సాంస్కృతిక గుర్తింపును కాపాడుకోవడంలో సాంప్రదాయ జ్ఞానం యొక్క కాలాతీత పాత్ర అనే అంశం మీద దృష్టి పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

బాలచెలిమి




# పూటకూళ్ళవ్వ

(గత సంచిక తరువాయి)

(జరిగిన కథ: చాన్నాళ్లకు మళ్లీ రవి దంపతులు వారి పిల్లలతో సహా విడిదికి విచ్చేయడంతో అవ్వ కంగారు పడుతుంది. దానికి కారణం తెలిసిన రవి మొంథా తుఫాను వల్ల పిల్లలు మారిపోయారని, నీటి విలువ తెలుసుకున్నారని చెప్పడంతో అవ్వలో ఆందోళన తగ్గి మనసు శాంతిస్తుంది.)

మరుసటి రోజు చలికాలం కావడంతో అవ్వ ఉదయమే కాస్త ఎండ వేడిలో కూర్చుందామని గేటు దగ్గరలో ఒక కుర్చీ వేసుకుని కూర్చుంది. అంతలోనే ఒక కొత్త శబ్దంతో హారన్ వినబడింది. గేటు వైపు చూసింది. అక్కడ ఆగిన కారు చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యింది. అలాంటి కారు ఎప్పుడూ చూడలేదు. అది ఒక జమీందారుల వాహనంలా ఉంది. అందులో నుండి దిగుతున్న వ్యక్తి జరీతో ఉన్న కోటు.. దానికి ఎంబ్రాయిడరీ వర్క్‌తో ఉన్న గుండీలు.. తలకు పట్టుకుచ్చు గల టోపీ ధరించి ఉన్నాడు. అవ్వ అలా ఆశ్చర్యంగా చూస్తుండగానే ఆ వ్యక్తి రాజుల కాలంలో వాడే కర్ర లాంటిది చేతిలో ఆసరాగా పట్టుకొని లోపలికి వచ్చాడు. "నమస్కారం అమ్మా!" అన్న అతని పలకరింపుతో తేరుకొని ఈ లోకంలోకి వచ్చింది అవ్వ.

"నమస్కారం" తడబడుతూ అంది అవ్వ. అతన్ని ఎలా సంబోధించాలో కూడా అర్థం కాక నమస్కారం తోనే ఆగిపోయింది. తిరిగి వెంటనే "రండి కూర్చోండి" అంటూ ఆఫీస్ రూమ్‌లోకి తీసుకెళ్లి కూర్చోబెట్టింది. వయసులో చూస్తే తనకంటే చిన్న వాడిలా ఉన్నాడు.. కానీ చూపులో చాలా దర్పంగా ఉన్నాడు. అవ్వ సందిగ్ధత గమనించి అతను "అమ్మా! మీరు నన్ను ఎలా పిలిచినా పరవాలేదు".. నేను మీకంటే చిన్న వాడినే అంటూ నవ్వాడు.

ఇప్పుడు అవ్వకు హాయిగా అనిపించింది. అందరితో

మాట్లాడినట్టుగానే "ఎక్కడినుండి వస్తున్నారు బాబు?" అడిగింది అవ్వ.

"నేను బాంబే నుండి వస్తున్నాను" అని సమాధానమిచ్చాడు అతను.

ఆశ్చర్యపోయింది అవ్వ. "అందుకే అతను తెలుగులో మాట్లాడుతున్నా.. అతని గెటప్ కొంచెం తేడాగా కనిపించింది" అనుకుంది అవ్వ.

"బాంబే నుండి ఇంత దూరం వచ్చారా! మీలాంటివారు మా విడిదిలో బస చేయడానికి వచ్చారా!?" మరోసారి ఆశ్చర్యపోతూ డైరెక్ట్‌గా అతడినే అడిగేసింది.

"అమ్మా! అంతగా ఆశ్చర్యపోకండి". నేను ఇక్కడి వాడినే ఇక్కడికి దగ్గర్లో ఉన్న "కొమ్మాల" మా స్వంత ఊరు.. అక్కడి దేవాలయంలో "లక్ష్మీ నరసింహస్వామి" దర్శనం చేసుకోవడానికి వచ్చాను. మీ విడిది సంగతి "గిర్ని బావి" ఊరిలో ఉండే మా బంధువులు చెప్పారు.

మాట్లాడుతూనే చుట్టూ ఉన్న పరిసరాలను చూస్తూ "ఆహా… బాంబేలో శబ్ద కాలుష్యంలో నివసించే మేము.. ఇంత చక్కటి వాతావరణం చూసి ఎన్నాళ్ళయిందో!" సంతోషంగా అన్నాడు.

ఆ మాటలకు అవ్వ హృదయం ఆనందంతో పొంగి పోయింది. "ఎల్లప్పుడూ నా విడిది ఇలా అందరికీ సంతృప్తినిస్తూ.. నీడనిస్తూ.. సంతోషపరిస్తే చాలు" అనుకుంది.

"రండి బాబూ.. మీరు బస చేయడానికి గది చూపిస్తాను" అంటూ అన్నింటికంటే కొంచెం వసతి ఎక్కువగా ఉన్నది.. ఆధునికంగా ఉన్న గది చూపించి.. "మీకు ఏ అవసరం ఉన్నా ఈ గదిలో ఈ మధ్యనే ఒక బెల్ పెట్టించాను. అది నొక్కండి చాలు.. అందుబాటులో ఉన్న ఎవరమయినా వెంటనే వస్తాము" అంది అవ్వ.

అవ్వ మర్యాదలు చూసి ఆశ్చర్యపోయాడు. "బంధువులు అవ్వ గురించి గొప్పగా చెప్పింది నిజమే" అనుకున్నాడు.

"ఇంతకీ మీ పేరిమిటి బాబూ' రిజిస్టర్‌లో రాసుకోవడానికి అడుగుతున్నాను" అంది అవ్వ.

"రాజా రామ్ మోహన్ రాయ్" అన్నాడు అతను.

"గొప్ప సంఘ సంస్కర్త పేరు కదా ఇది" అనుకుంటూ అబ్బురపడింది అవ్వ. రోజు వచ్చే పిల్లల ద్వారా, విడిదికి వచ్చి పోయే వారి ద్వారా ఇలాంటి వారి గురించి తను కోరుకోకుండానే చాలా విషయాలు తెలుసుకుంటుంది అవ్వ.

"సరే బాబూ… చాలా దూరం నుండి వచ్చారు మీరు. ముందు ఈ రోజంతా రెస్ట్ తీసుకోండి. భోజనం చేసి పడుకోండి. వివరంగా రేపు మాట్లాడుకోవచ్చు" అంటూ బయటికి వచ్చింది అవ్వ.

× × ×

తెల్లవారి ఉదయమే లేచిన రవి.. "పెళ్లికి వెళ్లే లోపు కాస్త వ్యాయామం చేసుకుందామని" బయటికి వచ్చాడు. అక్కడ రోజు ఒక నీతి వాక్యము గాని, మంచి మాట కానీ రాసి పెట్టే బోర్డు మీద ఆరోజు రాసినవి చూసి ఆశ్చర్యపోయాడు. ఒకటో రెండో వాక్యాలు ఉండే అబోర్డు మొత్తం అనేక వాక్యాలతో నిండిపోయింది. అత్రుతగా అన్నీ చదవసాగాడు. అవి అన్నీ మానవత్వం గురించీ, ఉన్నతమైన వ్యక్తిత్వం గురించి, మంచితనం గురించి ఉన్నాయి. "మానవసేవే మాధవసేవ". "అపకారికి ఉపకారం చేయుట".. "శత్రువునైనా ఆపదలో ఉన్నప్పుడు మిత్రునిగా చూడాలి".. "విద్య -జ్ఞానమే ఉత్తమ సంస్కారానికి మూలం".. "మనం సేవాభావంతో ఉన్నప్పుడు-భగవంతుడు కూడా మనపై దయ చూపిస్తాడు" ఇలా అనేకం ఆ బోర్డు పైన రాసి ఉన్నాయి.

ఇన్ని మంచి వాక్యాలు ఒకేసారి చూడటంతో లేవగానే ఒక "జ్ఞాననిధి" దొరికినంత సంబరపడిపోయాడు రవి. లోపలికి వెళ్లి ఫోన్ తీసుకొని వచ్చి ఆ బోర్డును ఫోటో తీసుకున్నాడు. "తన పిల్లలకు ఇవి వీలున్నప్పుడల్లా చెప్పి వివరించాలి. వాళ్ళు లేచాక ఈ బోర్డు దగ్గర నిలబెట్టి ఒక ఫోటో కూడా తీయాలి" అనుకుంటూ అసలు ఇన్ని వాక్యాలు ఒకేసారి "ఎవరు రాసారు.. ఎందుకు రాసారు!" అని ఆలోచనలో పడిపోయాడు రవి.

× × ×

(మిగతా కథ వచ్చే సంచికలో)

– మాదారపు వాణిశ్రీ
ఫోన్ : 9247286668
బొమ్మలు: కైరం బాబు

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com




## FEBRUARY 2026

The tribal dance performance by our students celebrated Telangana's rich culture through striking attire, elaborate headgear, and rhythmic movements that brought the forest spirit alive on stage.

Oxford
Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com

ogs JUNIORS

45 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| | | | | | | |
| | | | | | | |

**Important Dates**

15 Feb - Maha Shivaratri

NOTES :

Printed at : Deccan Press, Azamabad, Hyderabad. Ph: +91 90309 50055

Tradition is not to preserve the ashes, but to pass on the fire.

DECCAN LAND,
ISSN 2581-3188

Telugu Monthly Magazine Date of Publication 26th - January 2026
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

# VOL 14వ వసంతంలో 162 ISSUES నూట అరవై రెండవ సంచిక పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



## దక్కన్ పదమూడు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2026 ఫిబ్రవరి సంచికతో 162 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ. 400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar